VICTORY

విక్టరీ

# కందుకూరి వీరేశలింగం

(1848 - 1919)



బయోగ్రఫీ సిరీస్

# కందుకూరి
# వీరేశలింగం

✍
ఆవంచ సత్యనారాయణ

విక్టరీ పబ్లిషర్స్
డోర్. నెం. 30-17-3ఎ, వారణాశివారి వీధి, సీతారాంపురం,
విజయవాడ- 520 002. ఫోన్ : 0866 - 2444156.

# కందుకూరి వీరేశలింగం

© Ln. **I. Ramakumar,** PMJF
Immadisetty Akkeswara Rao
Charitable Trust, Vijayawada.

ప్రథమ ముద్రణ - 2004
చతుర్థ ముద్రణ - 2014

**సోల్ డిస్ట్రిబ్యూటర్స్ - ఆంధ్రప్రదేశ్**

**శ్రీ వెంకటేశ్వర బుక్ డిపో**
30-17-3A, వారణాశివారి వీధి,
సీతారాంపురం, విజయవాడ - 2.
**ఫోన్ : 0866 - 2444156**

❖ ❖ ❖

**సాయి వెంకటేశ్వర బుక్ డిపో**
26-27-77, బాటా షోరూమ్ ఎదురు,
గాంధీనగర్, విజయవాడ-520 003.
**ఫోన్ : (0866) 2570192, 2570309**

**సోల్ డిస్ట్రిబ్యూటర్స్ - తెలంగాణ**

**శ్రీ వెంకటేశ్వర బుక్ డిపో**
ప్లాట్ నెం. 3, 103, 2-4-1085,
సాయిలక్ష్మి నికేతన్,
రామకృష్ణా హాస్పటల్ ఎదురువీధి,
కాచిగూడ కుమార్ థియేటర్ దగ్గర,
నింబోలి అడ్డ, హైదరాబాదు-500027.
**ఫోన్ : (040) 65528228, 24653879**
**(ఫాక్స్) 24745257, సెల్ : 9346771314**

❖ ❖ ❖

**దుర్గా బుక్ డిస్ట్రిబ్యూటర్స్**
# 4-5-172, మొదటి అంతస్తు,
గోఖుల్ టవర్స్, గోఖుల్ చాట్ వెనుక,
హస్మత్‌గంజ్, కోటి,
హైదరాబాద్ - 500 095
**ఫోన్ : (040) 24752801, 64542801**

*Also available at*
**www.newshunt.com, www.kinige.com, www. rockstand.in**

**మనవి :** మాచే ప్రచురించబడిన అన్ని రకముల పుస్తకములు అన్ని ప్రముఖ బుక్ షాపు లలోను, విశాలాంధ్ర మరియు ప్రజాశక్తి బుక్ హౌస్ అన్ని బ్రాంచి లలోను లభించును. లభించని యెడల మమ్ములను నేరుగా సంప్రదించగలరు. పుస్తకాలలో ఏవైనా లోపాలు, తప్పులు ఉన్నా తెలియచేసిన తదుపరిముద్రణలో సరిచేయగలం. ఏవిషయమైన **ramakumarimmadisetty@yahoo.com** మెయిల్‌కు తెలియ జేయవచ్చును. మీకు కావలసిన పుస్తకాలకు : **SBI online A/c. No. 32987503888 విక్టరీ పబ్లిషర్స్, విజయవాడ** పేరున జమచేసి, మీకు దగ్గర గల ట్రాన్స్‌పోర్టు వివరాలు తెలుపవలెను.

***Published by :* విక్టరీ పబ్లిషర్స్, విజయవాడ**

**We have made many efforts to present this book without errors. But some errors might have crept in. We do not take any legal responsibility for such errors and omissions. If you bring them to our notice we shall correct them in our next edition. All disputes are subject to Vijayawada Jurisdiction only.**

# మీతో ఒక్క మాట....

గత శతాబ్దంలో పుట్టి, ప్రజాబాహుళ్యం మేలు కోసం తమ ధన, మాన ప్రాణాలను కూడా తృణప్రాయంగా త్యజించటానికి ఏ మాత్రం వెనుకాడకుండా, పదిమంది మేలే తమకు జరిగే మేలుగా భావించినవారు ఎందరో మహానుభావులు. వారి భవిష్యద్దర్శనం వలన, చేసిన నిస్వార్థ సేవల వలన ఈనాడు మనం స్వతంత్ర భారతదేశంలో స్వేచ్ఛగా మనగలుగుతున్నాము. భారతజాతి అంతా వారికి ఏమి ఇచ్చి ఋణం తీర్చుకోగలదు? అయితే మనకు స్వాతంత్ర్యం సిద్ధించి అర్ధనూట పదహారు సంవత్సరాలు దాటింది. దేశం దాస్య శృంఖలాలలో అనుభవించిన కష్టాలను క్రమంగా మరచిపోయే కాలం వస్తున్నది. మన భావితరాల వారికి ఆ సౌజన్యమూర్తులు చేసిన సేవలు, వారు అనుసరించిన వ్యక్తిత్వం, తమదైన వారి శీలాన్ని పరిచయం చేయవలసిన అవసరం ఎంతైనా ఉన్నది. ఇందువలన భావి భారతపౌరులైన నేటి విద్యార్థులు నాటి మహానుభావుల అసమాన త్యాగాలను గుర్తించి వారి గుణగణాలచే ఉత్తేజితులు కావటం ఒకటైతే, ఆ మార్గంలో ప్రవర్తించటానికి అవసరమైన ప్రేరణతో దేశ స్వాతంత్ర్య ఫలాలు అందరికీ లభ్యమై ప్రపంచంలోని సౌభాగ్యవంతమైన దేశాలలో మన దేశం ఒకటిగా నిలబెట్టగలిగే ప్రేరణ పొందుతారనేది ఇంకొకటి మేము ఆశిస్తున్న ప్రయోజనము. అందుకే ఒక సిరీస్‌గా అనేకమంది జాతి నిర్మాతల జీవితాలను విద్యార్థులకు పరిచయం చేయాలనుకొని ఈ ప్రచురణలను తీసుకొని వస్తున్నాము.

అందరికీ అందుబాటు ధరలో, ఆకర్షణీయంగా ఉండే శైలిలో పుస్తకాల ముద్రణ జరిగింది. పాఠశాలలు, కళాశాలలో చదువుతూ కిశోరప్రాయం (ఎడాలిసెన్సు)లో ఉన్న విద్యార్థినీ విద్యార్థులను ఈ పుస్తకాలు సరియైన మార్గంలో ప్రభావితులను చేయగలవని మా ఆకాంక్ష.

ఈ మహోన్నత లక్ష్యంలో మేము ఏ మాత్రం కృతకృత్యులము కాగలిగినా మా ఆశయం నెరవేరినట్లే.

ఈ పుస్తకాలు చదివి లోటుపాట్లను తెలియచేస్తే మలి ముద్రణలో సరి చేసుకోగలం. వీటిని గ్రంథాలయాధికారులు, పాఠశాలలు, కళాశాలలు ప్రధాన అధ్యాపకులు, అధికారులు, ఇతర పెద్దలు, విద్యాశాఖాధికారులు ఆదరించగలరనే నమ్మకంతో.

– పబ్లిషర్స్

# తల్లి ఒడిలో - బడిలో

తెలుగుజాతి ఆలోచనలను, ఆచరణలను మలుపు త్రిప్పి, ఛాందసపు ఆలోచనలను, మూఢ నమ్మకాలను పటాపంచలు చేసిన తెలుగు వెలుగు, కీర్తి భాస్కరుడు కందుకూరి వీరేశలింగం పంతులు. ఆయన తాతగారి పేరు కూడా కందుకూరి వీరేశలింగమే. తాత పేరే తనకు పేరైన ఆ మహనీయుడి జీవితం పదుగురికి ఆదర్శం. యువకులను సద్ధర్మాచరణకు ప్రేరేపించే ఉద్దీపకం.

కందుకూరి వీరేశలింగం పంతులు భారతదేశంలోని ప్రాచీన పట్టణాలలో ఒకటైన రాజమహేంద్రవరం పట్టణంలో 1848వ సంవత్సరం ఏప్రిల్ నెల 16వ తేదీని ఉదయం (అంటే తెలుగు తిథులలో కీలక నామ సంవత్సర చైత్ర శుద్ధ త్రయోదశి ఆదివారం) జన్మించాడు. వీరేశలింగం పూర్వీకులది అసలు నేటి పశ్చిమ గోదావరి మండల కేంద్రం ఏలూరు. ఈ వూరిలో కందుకూరి చంద్రమౌళి గారు సంపన్న గృహస్థు. ఈ చంద్రమౌళిగారే కందుకూరి వీరేశలింగం గారి ముత్తాత, చంద్రమౌళిగారికి ఒక కుమారుడు జన్మించాడు. ఆ బాలునికి వీరేశలింగం అనే పేరు పెట్టారు. ఈయనే కందుకూరి వీరేశలింగం గారి తాత వీరేశలింగం. ఈ వీరేశలింగం గొప్ప ధర్మాత్ముడు. భూదానాదులు చేసి కీర్తిని పొందినవాడు. ఈయన మన వీరేశలింగంగారి జననానికి ఒక సంవత్సరం ముందుగా కాలం చేశాడు.

ఆయనకు ఇద్దరు కొడుకులు. పెద్దాయన పేరు వెంకటరత్నం. రెండవ ఆయన సుబ్బారాయుడు. వెంకటరత్నంగారి వివాహాన్ని చాలా ఘనంగా, ఆడంబరంగా చేయించాడు తాత వీరేశలింగంగారు. ఇంత వైభవంగా చేయించినా, ఆ పిల్ల కాపురానికి రాకుండానే

వివాహమైన కొద్ది కాలానికే మరణించింది. కుమారుడికి మరలా వివాహం చేయాలనే ఆలోచనలో ఉండగానే తాత వీరేశలింగంగారు ఒక రోజు గుండెనెప్పి వచ్చి ఆకస్మికంగా స్వర్గస్థుడైనాడు. ఆయన మరణించేనాటికి ఆయన తల్లి అక్కమ్మ, భార్య కామమ్మ మాత్రమే కాక వారి ప్రేమకు పాత్రురాలైన తోబుట్టువు రాజ్యలక్ష్మి ఇంటిలో ఉండేవారు. రాజ్యలక్ష్మి ఆడపిల్లను కని స్వర్గస్థురాలు కాగా ఆ బాలిక వీరి దగ్గరే పెరుగుతున్నది. ఆ బాలిక పేరే పున్నమ్మ. అప్పటికి పెద్ద కుమారుడు వెంకటరత్నానికి ఇరవై అయిదేండ్లు. చిన్న కుమారుడు సుబ్బారాయుడు ఆయనకంటే మూడు నాలుగేండ్లు చిన్నవాడు.

అప్పటికే అన్నాతమ్ములు సంస్కృతంలో పంచకావ్యాలు ముగించారు. తెలుగులో మంచి సాహిత్యాన్ని సంపాదించారు. ఒక విషయాన్ని గూర్చి చక్కగా వ్రాయటానికి, చిక్కువ్రాతలను కూడా అనర్గళంగా చదవటానికి సమర్థత ఉండేది. ఇంగ్లీషు భాషలో కూడా కొంత జ్ఞానం సంపాదించి, చదవటం వ్రాయటం నేర్చుకొని ఉన్నారు. అందుకే ఉద్యోగ ప్రయత్నాలు ప్రారంభించారు. చిన్నాయన సుబ్బారాయుడికి త్వరలోనే కాకినాడ జిల్లా కలెక్టర్ ఆఫీసులో పిఠాపుర సంస్థానానికి సంబంధించిన క్లర్కుపోస్టు లభించింది. పెద్దాయన వెంకటరత్నానికి పత్రికావహన కార్యస్థానంలోను, యంత్రకార శాఖలోను స్వల్పకాలిక ఉద్యోగాలు లభ్యం అవుతుండేవి.

తమ్ముడైన సుబ్బారాయుడే వీరేశలింగం పంతులుగారి తండ్రి. ఉద్యోగం లభ్యం కాక ముందే ఇంటిలోనే పెరుగుతున్న తల్లి లేని మేనత్త కూతురు పున్నమ్మతో ఆయనకు వివాహం అయింది. ఎదురు మేనరికం పనికిరాదని కొందరు వాదించినా, చెల్లెలు రాజ్యలక్ష్మి ఎలాగూ లేదు కాబట్టి తల్లి అక్కమ్మగారి పట్టుదలతో తనకు ఎంతో ప్రేమ పాత్రురాలైన మేనకోడలును, తాత వీరేశలింగం తన రెండవ కొడుక్కు యిచ్చి పెళ్ళి జరిపించారు. ఈ సుబ్బారాయుడిగారి భార్య పున్నమ్మగారే వీరేశలింగం తల్లి. చిన్నతనం నుంచి ఆమె రోగిష్ఠి మనిషి, పుట్టుక నుంచి చాలా బలహీనంగా ఉండేది. ఆ రోజుల్లో ఎంతోమంది స్త్రీలలాగానే ఆమెకు విపరీతమైన దయ్యాల భయం. పైగా ఆమెకు రోగాలు నయం చేయించాలని మామగారు ఎందరో భూత వైద్యులను పిలిపించి భూత వైద్యాలు చేయించాడు. తాయెత్తులు, రక్షరేకులు కట్టించాడు. జపాలు చేయించాడు. అయినా ఆమెకు దయ్యాల భయం తగ్గలేదు. భూతాలు పట్టి పీడిస్తున్నాయనే అనుమానం నివృత్తి కాలేదు.

సరిగ్గా ఇలాంటి సమయంలో వీరేశలింగం ఆ యింటిలో జన్మించాడు. పుట్టినప్పటి నుంచి వీరేశలింగం చాలా దుర్బలంగా ఉండేవాడు. పైగా ఆయనకు పురిటిలోనే దగ్గు పట్టుకొన్నది. ఆయనను జీవితాంతం ఈ దగ్గు వదలలేదు. దానితోపాటే ఆయాసము వెంటబడింది. ఇవి అన్నీ అలా ఉండగా, కేవలం ఆఱు నెలల ప్రాయంలోనే ఆయనకు

స్ఫోటకం వచ్చింది. ఆనాటి స్ఫోటకపు మచ్చలు ఆయన ముఖంపై జీవితాంతం నిలిచి పోయాయి. ఆ వ్యాధి ఆవహించి ఉన్నప్పుడు ఒక రోజంతా కాలు చేయి సహితం కదలించక నిర్జీవ ప్రతిమవలె ఉండగా తాత వీరేశలింగం పేరే మనుమనికి పెట్టి అల్లారు ముద్దుగా పెంచారు.

వీరేశలింగానికి నాలుగేళ్ళ ప్రాయం వచ్చింది. తండ్రికి కాకినాడలో ఉద్యోగం కాబట్లి ఆ కుటుంబం నివాసం కాకినాడలోనే, కానీ బాలవీరేశలింగానికి పెద్ద తండ్రి దగ్గరే ఎంతో చనువు. సరిగా అదే సమయంలో వీరేశలింగం తండ్రి సుబ్బారాయుడి గారికి అపాయ స్థలంలో కురుపు లేచింది. అది ఊచి బలవంతం అయింది. ప్రాణాంతకమై కొద్దికాలం దానితో బాధపడి ఆయన మరణించాడు. తండ్రి మరణించేనాటికి వీరేశలింగానికి బాగా బుద్ధి కూడా తెలియదు. తండ్రి దగ్గర అంతగా చనువు లేని వీరేశలింగం పెద్ద తండ్రి వడిలోనే పెరిగాడు. ఆయన ఒక్కరోజు కనిపించక పోయినా బెంగపెట్టుకొనేవాడు. తండ్రి మరణించిన తరువాత కుటుంబం కాకినాడ నుంచి తిరిగి రాజమండ్రికి వచ్చి చేరింది.

కొంతకాలం జరిగిన తరువాత అప్పట్లో గోదావరి కాలువలు త్రవ్విస్తున్న ఒక దొరగారి దగ్గర వెంకటరత్నానికి ఉద్యోగం కుదిరింది. తాతమ్మ, అమ్మమ్మ, నాయనమ్మ కామమ్మ, తల్లి పున్నమ్మ అందరు ఆయనను అతి గారాబం చేశారు. పైగా ఒక్కటే నలుసు, వంశాంకురం, అర్భకుడు. ఒకసారి పెద్ద తండ్రి ఉద్యోగం చేస్తున్న స్థలానికి పల్లకీలో వెళ్ళేటప్పుడు ఏరుదాటవలసిన చోట పల్లకీలోనికి నీరు ప్రవేశించింది. వీరేశలింగం ఆ నీటి ప్రవాహానికి కొట్టుకొని పోయాడు. అయితే పల్లకీ బోయిలలో ఒకడు సమయానికి ఆపదను గుర్తించి, అప్పటికే ఒక మునుక వేసి కొద్దిగా నీరు త్రాగి ఉన్న వీరేశలింగాన్ని పట్టుకొని పైకి తీసి రక్షించాడు. తల్లులకు అప్పగించాడు. మృత్యుముఖంలోకి వెళ్ళిన వీరేశలింగం ఈ జలగండంతో మూడుసార్లు ప్రాణాపాయాన్ని తప్పించుకొన్నాడు.

క్రమంగా వీరేశలింగానికి ఐదు సంవత్సరాల వయసు వచ్చింది. అక్షరాభ్యాసం చేశారు. అప్పటికి పెదతండ్రి వెంకటరత్నం. రాజమండ్రిలోనే ఉద్యోగం నిర్వహిస్తుండేవాడు. వారి ఇంటికి దగ్గరలోనే ఉన్న గోపాలస్వామి ఆలయంలో ఒక వీధిబడి ఉండేది. ఆ బడిపంతులు పులిపాక అమ్మిరాజు. ఆ బడిలోనే ఆయన అమ్మిరాజు వద్ద అక్షరములు, గణితము, ఎక్కములు నేర్చుకొని పుస్తకం పట్టి చదవటం మొదలుపెట్టాడు. ఇంతలో పులిపాక అమ్మిరాజు మరణించాడు.

తరువాత వారి ఇంటికి సమీపంలోనే తిరుమెళ్ళవారి ఇంటి లోపల ఉన్న సోమరాజుగారి బడికి వెళ్ళాడు వీరేశలింగం. ఈయన తెలుగులోనే కొంత పాండిత్యం

కలవాడు. అందువలన వీరేశలింగంతో మొదటే అర్థసహితంగా బాలా రామాయణం. అమర నిఘంటువును చదివించాడు. అటు తరువాత వాచకమును చదవటం, వ్రాయటం నేర్పించాడు. ఇంతేకాకుండా రుక్మిణీ కళ్యాణము, సుమతీ శతకము, కృష్ణ శతకం, ఆంధ్రనామ సంగ్రహ నిఘటువును రోకటిపాటగా వీరేశలింగం చేత వల్లె వేయించాడు. ఆ రోజులలో సామాన్యంగా తెలుగుకు సంబంధించినంత వరకు ఇదే పాఠశాల విద్య ఇంతవరకు వీరేశలింగం నేర్చుకొనినందు వలన ఇక బడి మానిపించివేశారు. తెలుగు చదువు పూర్తి అయిందని నాటి రాజకీయ ఉద్యోగాలకు కావలసిన అర్హత సంపాదించే విద్య నేర్పించాలని, అందుకు అవసరమైన లెక్కాపత్రం వ్రాయటం నేర్పేటందుకు ఆయనను పోతరాజు రఘురామయ్యగారి దగ్గరకు పంపించారు. ఈ రఘురామయ్య తాలూకా కచేరీలో గుమాస్తాగా పని చేస్తుండేవాడు. ప్రతిరోజు మధ్నాహ్నం సమయంలో వీరేశలింగం తమ ఇంటికి దగ్గరలోనే ఉన్న తాలూకా కచ్చేరీకి వెళ్ళి ఆయన చెప్పిన పని చేస్తుండేవాడు.

ఈ విధంగా దాదాపు సంవత్సరం, రెండేళ్ళు జరిగింది. పెద్దగా నేర్చుకొన్నదేమీ లేదు. అయితే అదే సమయంలో, వీరేశలింగ తాత బ్రతికి ఉన్న రోజులలో వీరి ఇంట్లో పురాణం చెపుతుండే దూరి సోమయాజులు అనే ఆయన ప్రతిరోజూ ప్రాతఃకాలం వీరి ఇంటికి వచ్చి రఘువంశం పాఠం చెప్పేవాడు. సాయంకాలం పెద తండ్రి వెంకట రత్నంగారే ఇంగ్లీషు అక్షరాలు, గణితము, మాటలను నేర్పారు. క్రమంగా వీరేశలింగం దూరి సోమయాజుల వద్ద కాళిదాస త్రయాన్ని చదివాడు. ఆ కాలంలో పరీక్షలు ఉండేవి కావు. ప్రభుత్వమువారి ఉద్యోగాలను ఆశించేవారు, రాజకీయ కార్యస్థానాలకు వెళ్ళి పని నేర్చుకొంటూ, అధికారులను అనుసరించి తిరుగుతూ, వారి దయకు పాత్రమైనప్పుడు ఉద్యోగం సంపాదించుకొనే వారు. సరిగా ఈ సమయంలో భారతదేశ పరిపాలన పగ్గాలు ఈస్టు ఇండియా కంపెనీ (తూర్పు ఇండియా సంఘం) వారి నుంచి తప్పించి స్వయంగా శ్రీ మహారాజ్ఞి విక్టోరియా రాణీ స్వీకరించింది. అప్పుడు ఆంగ్ల ప్రభుత్వం వారు భారతదేశంలో పాఠశాలలు స్థాపించి దేశభాషలలోనూ, ఇంగ్లీషు భాషలోనూ కొన్ని సామాన్య, విశేష, పరీక్షలను ఏర్పాటు చేశారు. అందువలన కొద్ది కాలానికే 1860వ సంవత్సరంలో ఆయన ఇంగ్లీషు నేర్చుకొనటానికి దొరతనం వారి మండల పాఠశాలలో ప్రవేశించాడు.

మండల పాఠశాలలో చేరేనాటికి వీరేశలింగానికి పన్నెండేళ్ళు నిండాయి. అయినా దేహం ఇంకా దుర్బలంగానే ఉన్నది. ఒక్కడే నలుసు వంశాంకురం. తల్లి, పెద తండ్రి ఆయన బాగా లావై, దృఢంగా పెరగాలని చిరుతిండి వంటివి ఎక్కువగా పెడుతుండేవారు. దీనితో ఆయనను అజీర్ణవ్యాధి ఆవరించింది. అది వీరేశలింగాన్ని ఇంకా దుర్బలుడిని

చేసింది. దేహదౌర్బల్యం అధికమై క్రమంగా రోజు వెయ్యి తుమ్ముల వరకు తుమ్ముతూ, పడిసెం చేత బాధపడుతూ ఉండేవాడు. క్రమంగా అది పీనస రోగం (Eosionophilia) గా మారింది. జీవితాంతం వెంటాడింది.

మొత్తం మీద స్వభావం చేతనే దుర్బలమైన ఆయన శరీరం ఎండ సోకితే ఎక్కడ కందిపోతుందోనని, ఆటలాడితే అలసిపోతాడని, పని చేస్తే బడలి చిక్కిపోతాడని, అనుకొంటూ దేహ పరిశ్రమకు ఏ మాత్రం తావు ఇవ్వకుండా, ఇల్లు కదలనీయకుండా, ఎప్పుడూ ఏదో వ్రాయమనో, చదవమనో పని చెప్పి ఒక చోటనే కూర్చుండబెడుతుండేవారు తల్లి మొదలైన వారంతా. దీంతో ఆటాపాటా ఏవీ లేని వీరేశలింగం విసుగుతో ఉత్సాహం లేకుండా ఉండేవాడు. అప్పటికే ఆయన చదవటానికి ఇచ్చిన పాఠాన్ని రెండు మూడుసార్లు చదవగానే వచ్చేటంత మేధను సంపాదించుకొన్నాడు. వ్రాయమని ఇచ్చిన కాగితాలు కొద్దిసేపటికే అయిపోయేవి.

వీరేశలింగానికి గర్భాష్టంలో అంటే ఏడవ ఏటనే ఆచారం ప్రకారం ఉపనయనం జరిగింది. ఉపనయనంలో బ్రహ్మోపదేశం పొందింది మొదలుకొని ఆయన త్రికాలాలలోనూ, యుక్త సమయంలో సంధ్యావందనం చేస్తూ, శ్రద్ధతో రోజూ గాయత్రి మంత్రాన్ని అష్టోత్తరశతి చేస్తూ, ఇంకా ఒక్కొక్కనాడు సహస్ర గాయత్రి జపిస్తూ, అప్పుడప్పుడు గోదావరి నదికి సాయంకాలాలలో వెళ్ళి అస్తంగత సూర్యునికి అర్ఘ్య ప్రదానం ఇస్తూ, సంధ్యవార్చి, ప్రదోషకాలంలో ఆ నది ఒడ్డునే ఉన్న మార్కండేయస్వామి ఆలయానికి, వేణుగోపాలస్వామి ఆలయానికి వెళ్ళి వస్తుండేవాడు. అప్పటికే రఘువంశంలో అయిదు సర్గలు చదివి ఉండడం వలన, గూని సోమరాజుగారి బడిలో ఆంధ్ర నామ సంగ్రహం చదివి అర్థాలు తెలుసుకోవడం వలన ఇంట్లో ఉన్న తాటాకుల పుస్తకాలను తీసి చదవటం మొదలుపెట్టాడు. క్రమంగా తెలుగు మీద, తెలుగు కావ్యాల మీద అభిమానం ఎక్కువ అయింది. అందువలన క్రమంగా కావ్యాలలోని యుద్ధవర్ణనలు, తపఃచర్యలు, తపోమహిమలు చదివి ఎంతో ఆనందించేవాడు.

ఆ రోజులలో, వేసవి శలవుల తరువాత పాఠశాల ప్రారంభించి ఆరు నెలలైన తరువాత వీరేశలింగం పాఠశాలలో చేరాడు. అయినా సంవత్సరాంతంలో పరీక్షలు జరిగినప్పటికి తోటి విద్యార్థుల నందఱిని మించి ఆయనే మొదటివాడుగా నిలిచి బహుమానాన్ని పొందాడు. పాఠశాలకు పోయిన సమయంలో తప్ప మిగిలిన సమయమంతా ఇంట్లో ఉన్న తెలుగు పుస్తకాలతో గడపటమే ఆయనకు సరిపోయింది.

ఇంటి దగ్గఱ తాటాకుల పుస్తకాలు చదివేకొద్దీ, ఋషుల అద్భుత శక్తులు, వారి తపోమహిమలు ఆయనను బాగా ఆకట్టుకున్నాయి. వారిలాగే తనూ తపస్సు చేసి, ఆ

మహిమా శక్తులను పొందగలనా? అని ఎప్పుడూ ఆలోచిస్తూ ఉండేవాడు. సహజంగా బాగా ప్రతిభాశాలి అయినవాడు కాబట్టి తోటి బాలురపై ఆయనకు విశేష ప్రభావముండేది. అందువలన తపస్సు, దాని వలన మహిమలు పొందే విధములు తాను చదివిన కథలు, వారి మనస్సులకు ఎక్కించాడు. ఆయన రాచర్ల వెంకటరామయ్య కనపర్తి లక్ష్మయ్య, హోతా వీరభద్రయ్య అనే తన కంటే వయస్సులో పెద్దవారైన సహ విద్యార్థులను ప్రోత్సహించి, వారిని కూడా తపస్సుకు వెళ్ళాలనే ఉత్సాహం కలిగేటట్లు చేశాడు. వారంతా హిమాలయ పర్వతం మీద, తపస్సు చేయాలని నిర్ణయం చేసుకొన్నారు. అక్కడి నుంచి వచ్చేటప్పుడు అనేక మూలికలు తెచ్చుకోవాలనుకొన్నారు. స్వర్ణయోగం కూడా నేర్చుకోవాలనేది వారి ఆకాంక్ష. వారిలో ఆయన ఎంత ఉద్రేకం సృష్టించారంటే ప్రతిరోజు ఆయనను వారు యాత్ర ఎప్పుడని అడగడం, దుర్బలదేహుడైన ఆయన తట్టుకోలేమోననే భయంతో 'రేపు' 'రేపని' జవాబివ్వడం జరుగుతుండేది. ఇక ఏ మాత్రం ఉండబట్టలేని ఆయన మిత్రులు ముగ్గురు ఆయన దగ్గరకు వచ్చి రేపు మన ప్రయాణమని హెచ్చరించారు. ఆయన మామూలుగానే ఓపిక పట్టమన్నాడు. ఇక ఏ మాత్రం ఆగేది లేదని వారి ప్రతివచనం. ఈ సమయంలోనే అయితే నేను రాలేనన్నాడు వీరేశలింగం. అయినా ఆ మిత్రులు ముగ్గురూ ఆగదలచుకోలేదు.

ఆ మరునాడు పుస్తకాలు తీసుకొని, బడికని ఇంట్లో చెప్పి, హిమాలయాలకు ప్రయాణమైనారు. సాయంకాలానికి ముగ్గురు మిత్రులు బడి నుంచి ఇంటికి రాలేదు. వారి పెద్దలు అన్వేషణ మొదలుపెట్టారు. పిఠాపురం దగ్గర ఒకరిని పట్టుకొన్నారు. ఇంకొకడు విజయనగరం వరకు వెళ్ళి అక్కడ స్నేహితునితో పోట్లాడి వెనుదిరిగి వచ్చాడు. మూడవవాడు పూరీ జగన్నాథం వరకు వెళ్ళి అక్కడ దారి బత్తెం కోసం తన వెండి మొలత్రాడు అమ్ముకొని పూరీ జగన్నాథయాత్ర పూర్తి చేసి తిరిగి వచ్చాడు. ఈ విధంగా మిత్రుల దేహయాత్ర, వీరేశలింగం మానసిక యాత్రలతో తపోవనగమనం పూర్తి అయింది. ఆయనకు తపస్సులో ఉండే శక్తి మీద నమ్మకం చెదరలేదు గానీ తపోగమన ఉత్సాహం మాత్రం ఉడిగిపోయింది.

ఆ సమయంలోనే వీరేశలింగానికి తెలుగు కావ్యాల మీద అభిమానం పెరిగిందని చెప్పుకొన్నాం గదా! మూడవ తరగతి చదువుతున్నప్పుడే ఓగిరాల జగన్నాథ కవి రచించిన సుమనోరంజనమనే ప్రబంధాన్ని అంతటిని ఆయన కాగితల మీద వ్రాసుకొన్నాడు. తెలుగు కావ్య పఠనాభిలాష ఆయనకు ఎంత ఉన్నదో ఈ విషయం తెలుపుతుంది. ఎవరో చెప్పగా తెలుగు కావ్యాలన్నింటిలో వసు చరిత్ర మకుటాయమానమైనదని విన్నాడు. వారి యింటిలో ఉన్న తాటాకుల పుస్తకాలలో వసు చరిత్ర లేదు. దానిని కొని చదువాలనుకొన్నాడు. తల్లిని అడిగాడు. దాని ఖరీదు నాలుగు రూపాయలు. ఆమె తరగతిలో పాఠం చెప్పే

పుస్తకం అయితేనే కొనిపెడ్తాను. లేకపోతే లేదన్నది. ఆ సమయంలో తొమ్మిది నెలల ఆయన బడి జీతం కేవలం నాలుగున్నర రూపాయలే. “అంత ధనం నేనెక్కడి నుంచి తేగలను?” అని ఆమె ప్రశ్న. ఆయన మార్గాంతరం ఆలోచించాడు. అది సరియైన ఆలోచనా కాదా అన్నది ఆయనకు ఆ సమయంలో తోచలేదు. ఏ విధముగానైనను దానిని చదవాలనేదే ఆయన కోరిక.

పందిరి మహాదేవుడనే ఒకాయన రాజమండ్రిలో పుస్తక వ్యాపారి. ఆయన వద్దనే ఆ పుస్తకం లభ్యం అవుతుంది. ఆ పుస్తకాన్ని అరువివ్వవలసినదిగా వీరేశలింగం అభ్యర్థించాడు. అందుకుగాను తన వద్ద ఉన్న అర్ధ రూపాయి ఇస్తానన్నాడు. నాలుగు రూపాయలన్నర ఖరీదైన పుస్తకం ఇంటికి ఇవ్వనన్నాడా వ్యాపారి. అయినా వీరేశలింగం ఆసక్తి అతనిని మెత్తబడేటట్లు చేసింది. వారిద్దరి మధ్య ఒక ఒప్పందం కుదిరింది. ప్రతిరోజు వచ్చి ఆ పుస్తకాన్ని వీరేశలింగం మహాదేవుని దుకాణం దగ్గరే కూర్చొని చదువుకోవాలి. ప్రతి నెలా అర్థరూపాయి చెల్లించాలి. ఇలా మొత్తం నెలకు అర్థరూపాయి చొప్పున నాలుగున్నర రూపాయలు చెల్లించిన తరువాత వీరేశలింగం ఆ పుస్తకాన్ని ఇంటికి ఏకంగా పట్టుకొని పోవచ్చును. ఏ పద్ధతిలోనైనా ఆ పుస్తకాన్ని చదవాలనేదే ఆయన తాపత్రయం. అందుకే వెంటనే ఆ ఏర్పాటుకు ఆయన సరేనన్నాడు. పరమ సంతోషం కలిగిందాయనకు. ఆ రోజు నుంచి ఆ పుస్తకాలు అంగట్లో కూర్చొని చదవటం మొదలుపెట్టాడు. బడికి ఎగనామం పెట్టాడు. దాదాపుగా నెల రోజులు బడికి పోలేదు. ప్రతిరోజు వేళకు భోజనం చేసి బడికి వెళ్తున్నట్లు నటిస్తూ పుస్తకాల దుకాణంలో కూర్చుండి, పాఠశాల జీతం కోసం ఇచ్చిన అర్ధరూపాయిని పుస్తకం కోసం ఖర్చుపెట్టి, సాయంకాలానికి ఇంటికి తిరిగి రావటం మొదలుపెట్టాడు. ఇలా నెల గడిచిపోయింది. రెండవ నెలలో ఆయన తల్లి పున్నమ్మకు ఈ విషయం తెలిసింది. మోసం కొద్దికాలమే గాని రహస్యంగా ఎల్లకాలం నిలబడదు గదా! అప్పుడామె ముందు ఆయనను మందలించింది. అడిగిన వెంటనే అబద్ధం చెప్పకుండా నిజం చెప్పినందుకు సంతోషించి, పాఠశాల జీతాన్ని తీసుకొని వెళ్ళి చిరుతిండ్లు తినటానికి ఖర్చు చేయకుండా, పుస్తక క్రయానికి వ్యయపరచినందుకు సంతోషించింది. పుస్తకం కొనటానికి మిగతా సొమ్ము ఇచ్చి, పాఠశాల జీతం కట్టించి, తిరిగి పాఠశాలకు పంపించింది. విషయం సుఖాంతమే అయినా తాను చేసిన అనుచితమైన పని చాలాకాలంపాటు ఆయనను మానసికంగా చాలా బాధించేది.

అది 1861వ సంవత్సరం. వీరేశలింగానికి పదమూడవ సంవత్సరం జరుగుతున్నది. అప్పటికే చాలా మంది పిల్లనిస్తామని వస్తున్నారు. చివరకు తల్లి పున్నమ్మగారు, పెద్ద తండ్రి కలిసి రాజమండ్రికి రెండు మైళ్ళ దూరంలో ఉన్న కాతేరు గ్రామంలో ఉండే

అద్దంకి వారి అమ్మాయితో ఆయనకు వివాహం చేయటానికి నిశ్చయించారు. కాతేరు కరణం తెన్నేటి వెంకటరత్నం. ఆయన బావగారు అద్దంకి పట్టాభిరామయ్యగారు. ఆయన కుమార్తె బాపమ్మ పెండ్లి కూతురు. ఆమెకు అప్పటికి ఎనిమిదేండ్ల వయస్సు. బాపమ్మ అనే కోడలి పేరు పున్నమ్మగారికి నచ్చలేదు. తన తల్లి పేరు రాజ్యలక్ష్మి. ఆ పేరే కోడలుకు పెట్టుకొన్నదామె.

మూడవ తరగతి చదువుతుండగా వీరేశలింగానికి పెద్ద జబ్బు చేసింది. ఆయనకు బాల్యం నుంచి ఉన్న దగ్గే కాక అజీర్ణ, అతిసార రోగాలు కూడా దానికి కలిశాయి. ఇంగ్లీషు వైద్యులు, తెలుగు వైద్యులు అనేక మందులు ఇచ్చినా తగ్గలేదు. ఆయన దేహం బాగా శుష్కించి శరీరంలోని రక్తమాంసాలు హరించిపోయి శల్యమాత్రా వశిష్టుడైనాడు. బంధువులంతా ఆయన బ్రతుకడని ఆశ వదలుకొన్నారు. ఘనవైద్యులంతా ఆశ లేదని వదలిన తరువాత గండ్రాపు వెంకన్న అనే వైద్యుడు ఆయనకు కూరగాయ వైద్యం చేశాడు. క్రమంగా రోగం వెనుక బట్టింది. 1865వ సంవత్సరం మొదట్లో వ్యాధి పూర్తిగా తగ్గింది. అప్పటి వరకూ పాఠశాలకు వెళ్ళనందుచేత, వేసవి సెలవుల తరువాత తిరిగి పాఠశాలలో చేరి, చదవి వదలిపెట్టిన మూడవ తరగతిలో ఆయన పునః ప్రవేశించాడు. ఆరు మాసాలే ఆ పాఠశాలలో చదివినా, పాఠశాలకంతటికి మొదటివాడుగా వచ్చాడు. ఆయన కోరినట్లుగా పై సంవత్సరము పాఠశాలలో జీతం లేకుండా విద్య నేర్పేటట్లుగా ఉపకార వేతనం లభించింది. అలాగే ఎప్పుడూ ప్రథముడిగా వస్తున్నందున ఆ పాఠశాలలో చదివినంత కాలం ఆయన జీతం చెల్లించవలసిన అవసరం లేకపోయింది.

నాలుగో తరగతి చదువుతుండగా ఉద్యోగంలో ప్రవేశించటానికి కావలసిన పరీక్ష ఒకటి వ్రాసి అందులో ఉత్తీర్ణుడైనాడు. తాలూకా కచ్చేరీలో పని చేస్తున్న పోతరాజు రఘురామయ్యగారనే ఆయన ద్వారా ఉద్యోగ ప్రయత్నం కొంత చేశాడు. కానీ నమ్మిన వాళ్ళే మోసం చేసినందున, ఆ ఉద్యోగం ఆయనకు లభ్యం కాలేదు.

నాలుగో తరగతి చదువుతున్న సమయంలో ఒక సంఘటన జరిగింది. రాజమండ్రి మండల న్యాయాధిపతియైన హెన్రీమారిస్ దొర ఒకరోజు పాఠశాల చూడడానికి ఆకస్మికంగా వచ్చాడు. అన్ని తరగతులూ చూసిన తరువాత పాఠశాలలోని అందరు విద్యార్థులలోనూ సత్ప్రవర్తన గలవారెవరో ఆ విద్యార్థి పేరు వ్రాయమని అందరికీ చిన్న కాగితాలను ఇప్పించాడు. ఎవరి పేర్లు వ్రాద్దామా అని ఇతరులతో ఆలోచించే అవకాశం బాలురకు లేదు. అందువల్ల వారందరూ ఎవరికి తోచిన పేర్లు వారు వ్రాసి ఇచ్చారు. దొరగారు ఆ కాగితాలన్నింటిని తెప్పించి పరిశీలించగా ఎక్కువమంది వీరేశలింగం పేరునే వ్రాశారు. ఇంకో విశేషమేమంటే ఆయనకన్నా పై తరగతులలో ఉన్నవారు కూడా

వీరేశలింగం పేరునే వ్రాశారు. దొరగారు ఇవ్వదలచుకొన్న బహుమానం వీరేశలింగానికి ఇచ్చారు. ఆయనకు పై తరగతులకు కావలసిన పుస్తకాలు, ఒక నిఘంటువును బహుమతిగా మారిస్ దొర ఇచ్చాడు.

ఐదో తరగతి చదువుతుండగా 1867వ సంవత్సరములో, పెద తండ్రి వెంకటరత్నం జబ్బు పడ్డాడు. అయిదవ వతరగతి ఆ కాలములో ప్రవేశపరీక్ష తరగతి. అంటే మెట్రిక్యులేషన్. వీరేశలింగానికి చదువు సరిగా సాగలేదు. వెంకటరత్నం ఉద్యోగ స్థలం ఏలూరు వదలి వచ్చి, జబ్బుతో కొంతకాలం, తీసుకొని, మరణించాడు. ఆయన జబ్బుగా ఉన్నప్పుడు వైద్యుల కొఱకు తిరగడం, మందుల కొఱకు అన్వేషణ, పెదతండ్రి వ్యాధి వలన కలిగిన మనోవ్యధతో ఆయనకు చదువు సాగలేదు. పెదతండ్రి మరణించిన తరువాత బంధువుల ప్రేరణచే ఆయన ఉద్యోగార్ధి అయినాడు. ఉద్యోగం రాకపోవటమే మంచిదయింది. 'ఈశ్వరుడీ లోకములో సర్వమును మన మేలు కొఱకే చేయును' అని భావించాడు. ఉద్యోగం రానందువలన తన విద్య ఆగిపోకుండా కొనసాగించే అవకాశం కలిగినందుకు ఆయన సంతోషించాడు.

ప్రవేశపరీక్ష కాగానే, ఒక సంవత్సరం రాజమండ్రి పాఠశాలలో ఉపాధ్యాయుడిగా ఆయన పని చేశాడు. ఈ కాలానికే ఆయన కవిత్వం చెప్పడం ప్రారంభించాడు. కవిత్వం చెప్పడం ఆరంభించగానే తాను ప్రతిరోజు ఆరాధించే దేవాలయాలలోని మార్కండేయస్వామి మీద ఒకటి, గోపాలస్వామి మీద ఒకటి రెండు శతకాలు చెప్పాడు.

పద్దెనిమిది సంవత్సరాల ప్రాయంలో తమ ఇంటిలో అద్దెకుండే సమవయస్కుడైన బంధువుల కుమారునితో ఆయన స్నేహం చేశాడు. వినోదానికి వారు చీట్లాట ఆడుతుండేవారు. మొదట పందాలు లేకనే ప్రారంభం అయినా, తరువాత చింతగింజలను, గవ్వలను పందెంగా పెట్టి ఆడటం మొదలు పెట్టారు. ఆ రోజులలో గవ్వలు ద్రవ్యంగా చలామణిలో ఉండేవి. నెమ్మదిగా మిత్రుని ప్రోత్సాహంతో గవ్వలు దమ్మిడీలైనాయి. దమ్మిడీలు డబ్బు (నాలుగు దమ్మిడీ)లైనాయి. ఇలా వారి క్రీడ నెమ్మదిగా జూదంగా మారింది. క్రమంగా ఆ మిత్రుడు ఒకసారి వేశ్య ఇంటికి వీరేశలింగాన్ని తీసుకొని వెళ్ళాడు. వెంటనే ఆయన తెలివి తెచ్చుకొని కడచిన దానికి అనుతాపపడి ఆ మిత్రుని స్నేహం వదలివేశాడు.

# ఉద్యోగం పురుష లక్షణం

1867వ సంవత్సరంలో ఆయన పెదతండ్రి వెంకటరత్నం మరణించాడు. ఆయన మరణం తరువాత బంధువులు చాలా మంది ఆయనను ఏదో ఒక పనిలో ప్రవేశించవలసినదని హితబోధ చేశారు. ఆయన తల్లి పున్నమ్మకు బాగా నూరిపోశారు. చదువు మానుకోవటం వీరేశలింగానికి ఇష్టం లేకపోయినా, తల్లి, బంధువుల ప్రేరణతో ఉద్యోగ ప్రయత్నం చేస్తూ తనకు బహుమానం ఇచ్చి, ఎంతో ఆదరం చూపుతున్న మండల న్యాయధిపతియైన మారీస్ దొరను ఉద్యోగం కోసం వెళ్ళి కలసి అర్థించాడు. అప్పటికే సామాన్య పరీక్ష అనే పరీక్షలో ఉత్తీర్ణుడై ఉన్నందువలన ఆయనకు ప్రభుత్వ ఉద్యోగానికి కావలసిన అర్హత ఉన్నది. ఆ కాలంలో ఆ పరీక్షలో కృతార్థులైన వారు దొరకటం కూడా కష్టంగానే ఉండేది. అంతకుముందు అప్పుడప్పుడూ ఆయనను కలసి యోగక్షేమాలు తెలిపి వస్తుండేవాడు వీరేశలింగం. పెద తండ్రి చనిపోయాడని తెలిసి ఆయన వీరేశ లింగాన్ని ఊరడించాడు. వీరేశలింగానికి ఉద్యోగం ఏర్పాటు చేస్తానని మాట ఇచ్చాడు. అప్పుడు మండల న్యాయసభలో శిరస్తాదారుగా నెప్పల్లె లక్ష్మీనారాయణ అనే వీరేశలింగం గారి కుటుంబానికి ఆప్తుడు, బంధువు ఒకాయన ఉండేవాడు. ఆయన కూడా పనిని "నీకే తప్పక ఇప్పిస్తా"నని వాగ్దానం చేశాడు. ఇలా ఉండగా శిరస్తాదారు నూరు రూపాయల పారితోషికం తీసుకొని పరీక్ష కానివాడికి ఎవరికో ఆ ఉద్యోగం ఇప్పించినట్లు వీరేశలింగానికి తెలిసింది. దొర దగ్గరకు వెళ్ళి ఈ విషయం ప్రస్తావించగా, "నీకింత చిన్న వయసులో పని ఎందుకు? చదివి గొప్ప పరీక్ష లిచ్చిన తరువాత నేనే గొప్ప పనినిస్తా"నని చెప్పి పంపించివేశాడు. అయినా ఈ ఉద్యోగం రానందుకు వీరేశలింగం చింతించలేదు.

ఎందుకంటే ఉద్యోగం తనకు వచ్చి ఉంటే చదువుకొనే అవకాశం ఉండేదికాదు. కానీ జరిగిన విషయం వలన ఆయన ఇక ముందెప్పుడు న్యాయసభలో లేఖకోద్యోగంలో ప్రవేశించకూడదని శపథం చేసుకొన్నాడు.

తరువాత రాజమహేంద్రవర మండల పాఠశాలకు ప్రధానోపాధ్యాయుడైన బారోదొర వద్ద, కారాగృహములపై అధికారి అయిన కెప్టెన్ హోక్లిట్టు దొర వద్ద తెలుగు చెప్పే పనికి కుదిరాడు. వారిద్దరి వలన ఆయనకు నెలకు ముప్పై అయిదు రూపాయలు వచ్చేవి.

1871వ సంవత్సరం చైత్ర మాసంలో, రాజమహేంద్రవరములోని దొరతనము వారి మండల పాఠశాలలో, అప్పటి ప్రధానోపాధ్యాయులైన కుప్పుస్వామి శాస్త్రిగారి సహాయంతో వీరేశలింగానికి మండల పాఠశాలలో నెలకు ఇరవై అయిదు రూపాయల జీతం మీద సహాయోపాధ్యాయునిగా ఉద్యోగం వచ్చింది. అల్పకాలికమైన ఆ పని ఒక సంవత్సర కాలం మాత్రం ఉంది. తరువాత నిలిచిపోయింది. పనిలో ఉన్న కాలంలో ఆయన కొన్ని తరగతులకు ఆంగ్లము, లెక్కలు, హిందూదేశ చరిత్రను బోధిస్తుండేవాడు. ఉద్యోగ కాలంలో విద్యార్థులు ఆయన యెడల భయ భక్తులు కలిగి ఉండేవారు. సహాయోపాధ్యాయుల నుంచి ఆయనకు గౌరవము లభ్యం అవుతుండేది.

మండల పాఠశాలలో పని నిలిచిపోయిన తరువాత, 1872 జ్యేష్ఠమాసంలో ఆయనకు కోరంగి అనే గ్రామంలో గల ఇంగ్లీషు పాఠశాలలో నెలకు ముప్పది రూపాయల జీతము గల ప్రధానోపాధ్యాయత్వము లభించింది. ఈ ఉద్యోగంలో ఆయన రెండు సంవత్సరాలు మాత్రమే ఉన్నాడు. తిరిగి 1874వ సంవత్సర ఆషాఢమాసంలో, కోరంగిలో పనిని వదలివేసి, ఆయన స్వస్థలమైన రాజమండ్రికి 4 మైళ్ళ దూరంలో ఉన్న ధవళేశ్వరంలోని ఆంగ్లో దేశభాషా పాఠశాల (English Vernacular School) లో నెలకు 44 రూపాయల జీతం ఉన్న ప్రధానోపాధ్యాయ పదవిలో ప్రవేశించాడు.

1875వ సంవత్సరంలో సంక్షేప లేఖనపరీక్షలో వీరేశలింగం ఇంగ్లీషులో కృతార్థుడైనాడు. ఈ పరీక్షలో కృతార్థుడైనందుకు ఆయన సబ్ మేజిస్ట్రేట్ పదవికి అర్హతను సంపాదించుకొన్నాడు. రెవెన్యూ హయ్యర్ గ్రేడ్‌కు పోయి ఉత్తీర్ణుడైనట్లైతే వీరేశలింగం డెప్యూటీ కలెక్టర్ పదవికి అర్హుడై ఉండేవాడు. పైగా ఆ పరీక్షకు రెండే రెండు పుస్తకాలు చదువవలసి ఉంటుంది. కానీ ఆ శాఖలో ప్రవేశించదలచుకొననందున ఆయన ఆ పరీక్షను ఇవ్వలేదు. కానీ సివిల్ హయ్యర్ గ్రేడ్‌లో ఉత్తీర్ణుడైతే మొదటి తరగతి న్యాయవాదిత్వానికి, అనుగత న్యాయాధిపతి సబ్ జడ్జి పదమునకు అర్హుడు అయ్యేవాడు. న్యాయవాది కావాలనే ఆలోచన ఉన్న కాలంలో ఒకసారి ఆ పరీక్షకు వెళ్లినా, తరువాత మిత్రులైన కొందరు న్యాయవాదులు తమ పనిలో కూడా నిజమైన స్వతంత్రత లేదని, న్యాయంగా ప్రవర్తించి

ధనార్జన చేయటం అసంభమని చెప్పినా తరువాత న్యాయవాది కావాలనే ఆలోచనను ఆయన విరమించుకొన్నాడు.

1876లో రాజమహేంద్రవరం రాజకీయశాస్త్ర పాఠశాల (Government School) లో నెలకు 25రూపాయలజీతము గల ఆంధ్రద్వితీయోపాధ్యాయ పదవిలో కుదురుకున్నాడు.

ఆ ఉద్యోగం చేస్తుండగానే, నెలకు యిరవై అయిదు రూపాయల జీతంతో జిల్లా కలెక్టరు కార్యస్థానంలో ఉద్యోగం కోసం ఆయన కోరకుండానే వాగ్దానం వచ్చింది. కానీ వీరేశలింగం అందుకు అంగీకరించలేదు. రాజమహేంద్రవరంలోని ప్రభుత్వ పాఠశాలలో ఉద్యోగ నిర్వహణలో ఉండగా ఆయనకు బుర్రా రాజలింగశాస్త్రి, ఏలూరు లక్ష్మీ నరసింహము, చల్లపల్లి బాపయ్య పంతులు, బసవరాజు గవర్రాజు స్నేహితులైనారు. వారు ఆయనకు వివేకవర్ధని పత్రికా నిర్వహణలో చాలా సహాయపడుతుండేవారు. మిత్రులైనా పై ముప్వురు విద్యార్థులుగా ఆ పాఠశాలలో అధ్యయనం చేస్తుండగా వీరేశలింగం ఒక్కడే ఉపాధ్యాయుడుగా పని చేస్తుండేవాడు.

ఉద్యోగ నిర్వహణ కాలమున వీరేశలింగం విద్యార్థుల కందరకును ఆదర్శో పాధ్యాయుడుగా ఉండేవాడు. సమయపాలన చేయటం విద్యార్థులు ఆయన నుంచి నేర్చుకొనవలసిన ముఖ్యవిషయం. ఎన్ని వ్యాపకాలు ఉన్నా, దేహం దుర్బలమైనదే అయినా ఆయన ప్రజోపయోగం కోసం పాటుపడేవాడు. నిరంతర గ్రంథరచన ఒకవైపు, పత్రికా నిర్వహణ ఇంకొక వైపు, సాంఘిక దురాచార నిర్మూలన కార్యక్రమాల, విధవా పునర్వివాహ ప్రయత్నాలు, వితంతు పునర్వివాహ నిషేధవాదుల వాదవివాదాలలో పాల్గొని వారి అభిప్రాయాలను ఖండించటం, స్త్రీ విద్య కోసం ఎన్నో విద్యా సంస్థలను స్థాపించటం తనపై కక్ష తీర్చుకోవటానికి యెందరో అసూయపరులు న్యాయస్థానానికి పోగా ఆ న్యాయస్థాన వ్యాజ్యాలను ఎదుర్కొనటం, రాజమహేంద్రవరం పురపాలక సంఘ విషయా లలో ఆసక్తి చూపి కొంత కార్యభారాన్ని వహించడం ఇవన్నీ ఆయనకు నిత్యకృత్యాలే. ఆయన దినచర్యలో భాగమే. ఇదేగాక తరచుగా గ్రామాంతరాలు వెళ్లి వితంతు పునర్వివాహం, బాలికా విద్యావశ్యకతలను గురించి ఆయన ఉపన్యాసాలిస్తుండేవాడు.

అయితే ఈ కార్యక్రమాలన్నింటిలో ఆయన శిష్యులైన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు విశేషంగా తమ సహకారం అందించారు. కొందరు విద్యార్థులు వివిధ గ్రామాలకు వెళ్లి వితంతు పునర్వివాహాలకు సహకారమందిస్తామని వాగ్దానం చేసిన వారితో వ్యక్తిగతంగా కలిసి అవసరమైన కార్యకలాపాల్లో పాల్గొన్నారు. కొన్ని సమయాలలో వీరేశలింగాన్ని వ్యక్తిగతంగా బాధించాలని ఆయనపై దౌర్జన్యం చేయాలని వచ్చిన వారిని ఈ విద్యార్థులే యెదుర్కొని తమ ఉపాధ్యాయునికి ఎలాంటి ప్రమాదం జరగకుండా కంటికి రెప్పవలె

కాపాడుకొన్నారు. పేదవారికోసం రాత్రి పాఠశాలలు ప్రారంభం చేసి వంతులు వేసికొని రాత్రులు కూడా పోయి శ్రామికులకు పాఠాలు చెప్పుతూ వచ్చారు. బీదలకన్నదానము చేయటంలో ముందు ఉండేవారు.

ఈ విద్యార్థులే 1881వ సంవత్సరంలో బాలికాపాఠశాలను ప్రారంభించాలని ప్రయత్నం చేసి ధనం సమకూరనప్పుడు, వీరేశలింగమే జోక్యం కల్పించుకొని మిత్రుల చేత చందాలు వేయించి యిన్నీసుపేటలో ఒక బాలికా పాఠశాలను స్థాపించాడు.

ఆయన నాటకాలు వ్రాసి శిష్యులచేత ఆ నాటకాలను ఆడించేవాడు. ఇలాంటి వాటిల్లో 'వ్యవహార ధర్మ బోధిని' ప్రహసనం విస్తృతంగా ప్రజలచేత అభిమానించబడింది. విద్యార్థులు నాటకాలలో వేషాలు వేయటం నచ్చని ఛాందసవాదులు, కొందరు విద్యార్థుల సంరక్షకులు ఆయన మీద వ్యాజ్యం వేస్తామని బెదిరించారు. నాటక ప్రదర్శనము వలన విశేష లాభం కలదని, నీతివృద్ధి జరుగుతుందని ఆయన భావించినా, విద్యార్థులు నాటకములాడుటలోని ఉత్సాహముచేత, తమ పాఠములపై అశ్రద్ధను చూపునట్లు కనబడి నందున నాటక సమాజాల మీద ఆయన అటుతరువాత అంతగా ఆదరము చూపలేదు. విద్యార్థులకు తగిన స్ఫూర్తి కలిగించుటచేత, ఆయన విద్యార్థులు సంఘ సంస్కరణ సమాజము అనే సంఘాన్ని స్థాపించి, దాని కార్యక్రమాలకు వీరేశలింగాన్ని ఆహ్వానించి ప్రోత్సాహం పొందుతూ ఉండేవారు. ఆ సంఘంలో ఆయన కూడా సభ్యుడుగా ఉండేవాడు. ఆ సంఘ సభ్యులు చుట్టత్రాగటం, పొడుము పీల్చటం మొదలైన దురాచారాలు మానుటకు, బోగము మేళాల ఆటపాటకు పోకుండా ఉండుటకు, సమస్త సంఘ సంస్కరణ కార్యక్రమాలలో తోడ్పడటానికి ప్రతిజ్ఞలు చేయించటం, వాటిని ఆచరణలో పెట్టేటట్లుగా చేయటం అనేవి ఆయన కలిగించిన ప్రేరణతోనే జరిగేవి. శిష్యులతో పాటే తానూ పిన్నవాడై ఆయన కూడా ఆ ప్రతిజ్ఞలను తీసుకొనేవాడు.

వివిధ రకములైన కార్యక్రమములలో తీరికలేకయున్న ఆయనకు, 1881 నుంచి 1890 వరకు జీవితంలో ప్రయాస దశ అని చెప్పవచ్చు. అయినా ఆయన యితర విషయాలలో చురుకుగా పనిచేస్తూనే ఉండేవాడు. తీవ్రమైన ఉబ్బసపు దగ్గుచేత బాధ పడుతూ ఉన్నా పాఠశాలకు వెళ్లి పాఠాలు బోధించని రోజులు చాలా అల్పమేనని చెప్పవచ్చు. విద్యార్థుల సంఘాలకు పోయి ఉపన్యాసములిచ్చి వారిని సత్కార్యాలకు పురికొల్పు తుండేవాడు. రాజమండ్రి యిన్నీసుపేట పాఠశాల, పట్టణ పాఠశాలల కార్య నిర్వాహక సంఘాలలో నొకడుగా ఉండి పని చేస్తుండేవాడు. మహమ్మదీయుల ప్రార్థన మేరకు, మహమ్మదీయ విద్యాసంఘానికి ఆయనే కార్యదర్శిగా ఉండి, వారి విద్యార్థి భోజన గృహాన్ని నడుపుతుండేవాడు. రాజమండ్రి పురపాలక సంఘం (అప్పట్లో దీనిని పురపారిశుద్ధ్య

విచారణ సంఘం అనే వారు), తాలూకా బోర్డులోను, డిస్ట్రిక్ట్ లోక్ ఫండ్ బోర్డ్‌లోనూ సభ్యుడిగా ఉండి పని చేస్తుండేవాడు. తన కార్యనిర్వహణలో ఎవరెన్ని ప్రలోభాలు పెట్టినా, ఎవరితో విరోధాలు తెచ్చుకొన్నా ఆయన పట్టిన పట్టు విడువలేదు. పదిమందికి మేలు కలిగించే పనిదేనినైనా, ఎలాంటి కష్టాలు యెదుర్కొనవలసినా చేయకుండా మానలేదు. ఇందుకోసం తన పై అధికారులతో విరోధం తెచ్చుకోవలసినా ఆయన లెక్కపెట్టలేదు. మిత్రులతో మాట పట్టింపులు వచ్చినా సరకు చేయలేదు. ఆయన చిత్తశుద్ధి అలాంటిది.

1890వ సంవత్సరం జులై నెలలో బాల్యంలో ఉపాధ్యాయుడైన ఆత్మూరిలక్ష్మి నరసింహం వీరేశలింగం మీద న్యాయ స్థానంలో వ్యాజ్యం తీసుకొని వచ్చాడు. ఒక వ్యాజ్యం న్యాయస్థానంలో నడుస్తుండగానే యింకొక మాననష్టం వ్యాజ్యం ఆత్మూరి లక్ష్మి నరసింహమే తీసుకొని వచ్చాడు. ఈ వ్యవహారాలను నడుపుట కోసం వీరేశలింగం తఱచుగా న్యాయ సభలకు (న్యాయస్థానానికి) పోవలసి వస్తుందని ఒక సంవత్సరకాలం రాజమండ్రి కళాశాలలో తాను చేస్తున్న ప్రధాన ఆంధ్రోపాధ్యాయుని ఉద్యోగానికి సెలవు పెట్టాడు. ఆయన తరఫున వాదించే న్యాపతి సుబ్బారావు పంతులు వ్యాజ్యాన్ని గెలిపించటానికి ఎంత శ్రమపడుతున్నా వీరేశలింగం ఎలాంటి మనోవ్యాకులత చెందలేదు. సత్యమే యెక్కడైనా గెలుస్తుందని, తన పక్షానే న్యాయం ఉన్నదని, న్యాయమే తనను గెలిచేటట్లు చేయగలదని ఆయన దృఢమైన విశ్వాసం. చివరకు 1891వ సంవత్సరం జులై నెలలో, న్యాయాధిపతి వీరేశలింగంపై అభియోగాన్ని కొట్టివేశాడు. పైగా వీరేశలింగం లక్ష్మినరసింహాన్ని అన్నమాటలు సరైనవేనని తీర్పులో పేర్కొన్నాడు. రెండవ వ్యాజ్యం ఇంకొంత కాలం అంటే 1893 వరకు నడిచి, దాదాపు వీరేశలింగానికి అనుకూలంగానే తీర్పు ఇవ్వబడింది. ఇది జరిగిన కొద్ది రోజులకే వీరేశలింగం చేసిన సేవలకు మెచ్చి ఆంగ్ల ప్రభుత్వంవారు ఆయనకు "రావు బహద్దర్" బిరుదాన్ని అనుగ్రహించాడు.

ఎందరో ఆయనతో పరిచయం ఉన్నవారు, లేనివారు కూడా, సుదూర ప్రాంతాల నుంచి ఆయనకు అభినందన సందేశాలను పంపించారు. "ఆంధ్ర ప్రకాశిని" మొదలైన అనేక తెలుగు, ఇంగ్లీషు పత్రికలు ఆయనను ప్రశంసిస్తూ, అభినందిస్తూ వ్యాసాలు ప్రచురించాయి. ప్రభుత్వ కళాశాల ప్రధానాధికారియైన మెట్కాఫ్ దొరగారి ఆధిపత్యంలో ఒక సభ చేసి ఆయనను అభినందించారు. అలాగే ఇంకా ఎన్నో అభినందన సందేశాలు ఆయనకు వచ్చాయి. అభినందన సభలు నిర్వహించబడ్డాయి. 1898వ సంవత్సరంలో ఆయన సర్వకళాశాలలో సభ్యునిగా ప్రభుత్వం వారిచే ఫెలో ఆఫ్ మద్రాస్ యూనివర్శిటీగా నియమింపబడ్డాడు.

అప్పటికే కొన్ని సంవత్సరాల నుంచి ఆయనకు చెన్నపట్టణం వెళ్ళాలనే ఆలోచన ఎక్కువైంది. అందుకుగాను 1894లో వేసవి కాలపు సెలవులలో చెన్నపట్నం వెళ్ళి పరశువాకంలో ఒక ఇల్లు కొని, దానిని వాసయోగ్యంగా ఉండేటట్లుగా పునర్నిర్మించాడు. జన్మస్థలాన్ని బాల్యమిత్రులను విడిచి చెన్నపట్నం పోవాలనుకోటంలో ముఖ్య కారణాలు రెండు. మొదటిది ఆయన పుస్తకాలను చెన్నపట్టణంలో సంపుటాలుగా ముద్రించు కోవాలనుకోవటం. రెండవ విషయం సంఘ సంస్కరణోద్యమ కార్యక్రమాలను ఆనాటి రాజధానియైన మద్రాసులో గూడా ప్రవేశపెట్టాలని కోరుకోవటం.

ఈ ఉద్దేశ్యంతో జీతం ముట్టని పద్ధతి మీద రెండు సంవత్సరాలు ఉద్యోగం నుంచి సెలవు తీసుకొన్నాడు. ముందు సెలవు పెట్టినా, తదుపరి ఉద్యోగం మానుకొని అక్కడే నిలిచిపోవాలనేది ఆయన ఉద్దేశ్యం. జన్మస్థలం వదలుతున్నందుకు బాధగా ఉన్నా అధికోపయోగకరమైన పనిని చేయగలుగుతాననే భావంతో రాజమహేంద్రవరం వదలి వేయాలన్నది ఆయన భావన. ఆయన రాజమహేంద్రవరం వదలుతున్నారనే ఆలోచన పదుగురికి తెలియగానే పురవాసులందరూ ఒకటై, ఆయన తమను వదలి వెళ్ళటం బాధాకరమని తెలుపుతూ అనేక వీడ్కోలు సభలు జరిపారు. కాకినాడ పుర నివాసులు కూడా యిలాంటి సభను జరిపి ఆయనకు వీడ్కోలు యిచ్చారు. 1897వ సంవత్సరం చివరలో, ఆయన సకుటుంబంగా చెన్నపురికి చేరుకొన్నాడు.

1897 డిసెంబర్ నెలలో చెన్నపట్టణం చేరి, స్వగృహంలో ఉంటూ తన పుస్తకాల న్నింటిని అనుకొన్న ప్రకారం ముద్రణ పూర్తిచేయటానికి ఆయనకు రెండు సంత్సరాల కాలం పట్టింది. పుస్తకాలన్నీ కలిపి పది పెద్ద సంపుటాలుగా ముద్రణ జరిగింది. అచ్చు వేయించటం, ప్రూఫులు దిద్దడం మొదలైన పనులు ఆయనే చేయవలసి వచ్చినందున ఆయన ఎక్కువ శ్రమపడవలసి వచ్చింది. ఆ సమయంలోనే చెన్నపురిలో ఉన్న సంస్కరణ సమాజానికి, దక్షిణ హిందూస్థాన బ్రహ్మ సమాజానికి ఆయన అధ్యక్షునిగా ఎన్నుకొన బడ్డాడు. ఇంతేగాకుండా చెన్నపురి పాఠశాల పుస్తక దేశభాషా సంఘంవారు కూడా ఆయనను తమ కార్యనిర్వాహక సభ్యులలో ఒకనిగా ఎన్నుకొన్నారు. సర్వకళాశాల వారు తమ ద్రావిడ భాషాధ్యయన సభలో సభ్యునిగా తీసుకొన్నారు. ప్రభుత్వంవారు పఠనీయ గ్రంథసభలో ఒక సభ్యునిగా నియమించారు. ఇంతేగాక ప్రభుత్వం వారు డిప్యూటీ కలెక్టర్ మొదలైన వారిని నియమించే తెలుగు పరీక్షలలో ఆయనను ఒక పరీక్షకునిగా నియమించారు.

మద్రాసులో ఆయన ఒక వితంతు శరణాలయాన్ని కూడా చాలా విధాలుగా శ్రమపడి ప్రారంభం చేశాడు. తన యింటిలోనే ఆ శరణాలయాన్ని నడుపుతుండేవాడు.

చెన్నపట్టణం జీవితానికి పాతబడిపోయిన తరువాత అప్పటి విద్యావిచారణాధికారి డంకన్ దొర ఆయనను సర్వకళాశాల సమావేశ సమయాలలో తప్పక కలుసుకొంటూ ఆదరంగా ఉండేవాడు. ఆయన ఒకసారి వీరేశలింగాన్ని తిరిగి రాజమహేంద్రవరం వెళ్ళకుండా ఇక్కడే ఉండాలని ఉన్నదా అని అడిగాడు. వీరేశలింగం ఆయన ప్రశ్నకు తాను అక్కడే ఉండిపోయి పని చేయదలచుకొన్నానని జవాబిచ్చాడు. కొద్ది రోజులకే వీరేశలింగంగారి ప్రమేయం ఏమీ లేకుండానే దొరతనం వారి రాజధానీ పాఠశాలలో పండిత పదవిలో పని చేస్తున్న కొక్కండ వెంకటరత్నం పంతులును రాజమహేంద్రవరం కళాశాలకు, వీరేశలింగాన్ని రాజమహేంద్రవరం నుంచి మద్రాసు రాజధాని కళాశాలకు మార్చినట్లుగా నియోగాజ్ఞా పత్రాన్ని ఇచ్చారు. పైగా సెలవును రద్దు చేసికొని వెంటనే పనిలో చేరవచ్చునని ఉత్తర్వులో ఉన్నది.

1898వ సంవత్సరంలో, మద్రాసులో జరిగిన హైందవ దేశీయ మహాసభ, దానితో పాటుగా హైందవ దేశీయ సాంఘిక మహాసభ కూడా జరిగింది. ఆ సభకు అగ్రాసనాధిపత్యానికి వీరేశలింగాన్నే ఎన్నుకొన్నారు. ఆయనకు మహాదేవగోవింద రానడే చేత 'దక్షిణ హిందూ దేశ విద్యాసాగరుడ'నే బిరుదు ప్రదానం చేయించారు. ఆయనకు విశ్లేష గౌరవం చూపారు. ఇంతేగాకుండా 1902వ సంవత్సరం జూన్ 14వ తేదీ కాకినాడలో జరిగిన చెన్న రాజధాని దేశీయ సాంఘిక మహాసభకు కూడా ఆయననే అగ్రాసనాధిపతినిగా చేశారు. ఇలాగే విజయవాడలో జరిగిన సభకు, 1903లో జరిగిన హిందూ దేశాస్తిక మహాసభకు ఆయననే అగ్రాసనాధిపతిగా చేశారు.

ఆ తరువాత మరికొంత కాలం మద్రాసులో ఉన్న తరువాత, ఆయనకు చెన్నపట్టణ నివాసం ఎత్తి వేయాలని బుద్ధిపుట్టింది. ఈ మధ్యలో మద్రాసులోని వితంతు శరణాలయాన్ని నడపటంలో చిక్కులెక్కువై, చెన్నపురిని వదలి రాజమహేంద్రవరం చేరితే ఎక్కువ పని జరగవచ్చని తోచటం కూడా ఇందుకు కారణాలలో ఒకటి! "ఇతర దేశములోనెన్ని సౌఖ్యములున్నను ఎంత గౌరవమున్నను మనసెప్పుడును స్వదేశము వంకను, జన్మస్థలము వంకను బాఱుచుండును. ఈ స్వభావిక వాంఛ కూడా పయి హేతువుల తోడి పాటు నన్ను స్వస్థలగమనమునకు బురికొల్ప జొచ్చెను' అని ఆయన స్వీయ చరిత్రలో వ్రాసుకొన్నారు. ఆయన సర్వీస్ రిజిష్టర్ లేఖనమును బట్టి 1904వ సంవత్సరం మార్చి నెలలో ఆయనకు యాభై అయిదేండ్లు నిండి పదవి నుంచి విశ్రాంతి తీసుకొన వలసి వస్తుంది. అప్పటి నుంచి పెన్షన్ వస్తుంది. అందువలన ఆయన పై అధికారులను ఉద్యోగ విధుల నుంచి 1904 మార్చి నెల ఆఖరు నుంచి తప్పించి ఉపకార వేతనం ఇవ్వ వలసిందిగా వ్రాతపూర్వకంగా అభ్యర్థించాడు. ఆయన సేవలు అవసరమని అధికారులు

ఇంకా ఎక్కువ జీతానికి ఆయనను కొనసాగించటానికి నిశ్చయించుకొన్నా, అది ఆయనకు ఇష్టం లేక ఉద్యోగమునకు ఆరోగ్యరీత్యా పనికిరాడని వైద్యుని సర్టిఫికెట్ తీసుకొని, తక్కువ అయినను కేవలము ఇరవై నాలుగు రూపాయల ఉపకారవేతనంతో ఉద్యోగం నుంచి విడుదల పొందాడు.

రాజమండ్రిలో ఉన్నప్పటి కంటే ఆయన చెన్నపట్టణంలో విశేష గౌరవం లభ్యమయ్యేది. ఎన్నో రకాల గౌరవాలు, సన్మానాలు, మర్యాదలే గాక, మద్రాసు జీవితం కూడా చాలా సుఖంగా ఉండేది. అయినా అందరి మానవులకు వలెనే జన్మభూమిపై ప్రేమ ఆయనను రాజమహేంద్రవరం వైపు లాగజొచ్చింది. ఉద్యోగ విరమణ చేసిన తరువాత ఆయన ఒక సంవత్సరం పాటు మద్రాసులో కాపురం ఉన్నాడు. తరువాత మద్రాసులో ఉన్న ఆస్తులన్నింటిని అమ్మివేసి, రాజమహేంద్రవరంలో జీవనం చేయటానికి తగు ఏర్పాట్లు చేసుకొని 1905వ సంవత్సరంలో ఆయన తిరిగి జన్మభూమికి వచ్చి చేరుకొన్నాడు.

# రచనా రంగంలో

వీరేశలింగం కవిత్వం చెప్పటం ఆరంభించగానే ముందుగా రాజమహేంద్రవరంలోని గోపాలస్వామి మీద ఒక కంద పద్యశతకం చెప్పాడు. ఆయన మార్కండేయ స్వామి మీదకూడా ఒక కంద పద్య శతకాన్ని చెప్పాడు.

1870 ప్రాంతాలలో పంతులుగారు 'శుద్ధాంధ్ర నిరోష్ఠ్య నిర్వచన నైషధ' మనే పేరుతో నలచరిత్ర కావ్యాన్ని రచించాడు. ఈ కావ్యాన్ని రచించడానికి ఆయనకు ఎక్కువ కాలం పట్టలేదు. అందుకు కారణం పంతులుగారికి ఒక సంకల్పం కలిగిందంటే చాలు వెంటనే దానిని ఆచరణలో పెట్టేవాడు. అయితే అందుకు తన శక్తియుక్తులు చాలుతాయా లేదా అనే శంక ఏమాత్రం ఆయన మనస్సుకు తట్టేది కాదు. ఇదే సమయంలో ఆయన 'రసిక జన మనో రంజన'మనే మిశ్ర ప్రబంధాన్ని కూడా రచించాడు.

దాదాపుగా ఇదే సమయంలో ఆయన శుద్ధాంధ్ర ఉత్తర రామాయణాన్ని కూడా రచించాడు. అది కూడా ఈ పురుషార్థప్రదాయిని పత్రికలోనే అచ్చైంది. అలాగే ఆయన అదే సమయంలో రచించిన అచ్చ తెలుగు సభా పర్వంలోని కొంత భాగం అచ్చు వేయబడింది. పంతులుగారి రచనలను ఆనాడు విద్యాధికులు పండితులు, కవితా ప్రియులు శ్లాఘిస్తూ వీరిని 'అభినవ తిక్కన' అని ప్రస్తుతిస్తూ అప్పటి వార్తాపత్రికలలో తమ అభిప్రాయాలను తెలిపారు. ఈ పురుషార్థప్రదాయిని పత్రికలో 1873వ సంవత్సరంలో వీరేశలిగం గారు స్త్రీ విద్యను గురించి శ్లాఘిస్తూ 'ముద్దియ విద్దియ పెద్ద కార్యమనుట & ప్రసిద్ధము' అనే వ్యాసాన్ని ప్రకటించారు.

వీరేశలింగం గద్య రచనలు 1. నవల 2. కథలు 3. ప్రసిద్ధ స్త్రీ పురుష జీవిత చరిత్రలు 4. వ్యాసములు 5. ప్రహసనములు 6. గ్రంథ విమర్శనములు 7. చారిత్రక గ్రంథములు 8. పత్రికా రచనలు 9. శాస్త్ర గ్రంథములు 10. ఉపన్యాసములు అని విభజించవచ్చు. ఈ విధంగా ఆయనకు 'గద్య తిక్కన' అనే బిరుదు సార్థకమైంది.

పంతులుగారు 1872వ సంవత్సరంలో రాజమహేంద్రవరం సమీపంలో ఉన్న కోరంగిలో ప్రధానోపాధ్యాయునిగా పని చేస్తుండేవాడు. ఆ సమయంలోనే ఆయన 'శుద్ధాంధ్ర ఉత్తర రామాయణ' రచన చేశాడు. అప్పుడే 'సంగ్రహ వ్యాకరణం' అనే తెలుగు వ్యాకరణాన్ని పాఠశాల విద్యార్థులకు ఉపయోగకరంగా ఉండేటట్లు వ్రాశాడు.

వీరేశలింగం చిన్న తరగతుల పిల్లల కొఱకు రచించిన పుస్తకాలలో 'నీతి దీపిక' ఒకటి. గీత పద్యాలలో సులభ భాషలో వ్రాసిన రచన యిది.

ఆయన అసంపూర్తిగా ఉన్న నీతిచంద్రికను సంపూర్తి చేయదలచి, రెండవ భాగాన్ని 'విగ్రహం' పేరుతో రచించాడు. 1874లో ఈ రచన పూర్తై అచ్చు అయ్యింది. పద్య కావ్యాల కంటే వచన గ్రంథాలే ప్రజలకు ఎక్కువగా ఉపయోగపడతాయనే సదుద్దేశ్యమే ఈ పనికి ఆయనను పురికొల్పింది. ఈ గ్రంథం అచ్చు కాగానే అనేకుల ప్రశంసలు పొందింది. తరువాత వీరేశలింగం నీతి చంద్రికలో మిగిలిన ఉన్న 'సంధి'ని కూడా రచించాడు.

ఆయన 1874లో తాను నడుపుతున్న వివేకవర్ధని పత్రికలో ముందుగా 'అస్తిత్వం' అనే వ్యాసాన్ని తరువాత, 'సత్యం', అటు తరువాత 'అహింస' అనే విషయాలను గురించి సులభ వచన శైలిలో పదిమందికి పనికి వచ్చేటట్లుగా వ్యాసాలు వ్రాశాడు. ఆ కాలంలోనే 'ప్రార్థన' అనే పద్య రచన చేశాడు.

ఈ సమయంలోనే 'జాన్ గిల్ఫిన్' అనే ఆంగ్ల కవి కౌపర్ రచనను తెలుగులోనికి అనువదించాడు. ఇంకా పంతులుగారు వివేకవర్ధనిలో ప్రచురించిన 'చదువు వేరు సద్గుణం వేరు' అనే వ్యాసంలో మనిషికి శీలం ముఖ్యమనీ, చదువుతో శీలాన్ని పెంపొందించుకోవాలని ఉద్బోధించాడు. ఆయన 'స్త్రీ విద్య', 'దయ్యములు', 'విద్య', 'వైద్యములు', 'వేశ్యలు', 'ఐకమత్యం', 'సత్యం', 'ప్రమాణ విచారణము', 'ఈశ్వర సద్భావము', 'యదార్థ జ్ఞానము', 'ఆత్మ', 'భవద్గుణములు', 'బ్రాహ్మణులు వారి వృత్తులు', 'సుగుణ దుర్గుణములు' మొదలైన అనేక విషయాలను గురించి 1874లో వివేకవర్ధని స్థాపించబడినప్పటి నుంచి, ప్రతి నెల వ్యాసాలు వ్రాసి ప్రకటించాడు. ఇవి పాఠకులను ఆలోచింప చేసేవిగా మాత్రమే కాక సదా ఆచరణలో కూడా పెట్టేటందుకు వారిని పురికొల్పేవి.

1876లో ఆయన హాస్య సంజీవని అనే ఇంకొక పత్రికను ప్రారంభించాడు. 'అభాగ్యోపాఖ్యాన'మనే వ్యంగ్య రచన ఈ హాస్య సంజీవనిలోనే ప్రకటించబడింది.

సంధి విగ్రహాలను రచించిన తరువాత, వీరేశలింగం గారి ఆలోచనలోనే కొంత మార్పు వచ్చింది. సాహిత్యం నిర్వహించవలసిన కర్తవ్యం గురించి ఆయనకు గల అభిప్రాయాలు మారసాగాయి. భాష వలన ఉపయోగం ఏమి? తమ భావాలను ఆలోచనలను ఎక్కడో దూరంగా ఉన్న వారికి, రాబోయే తరాల వారికి సులభంగా వ్యక్తీకరించటం. అయితే, ఆనాటి ఎందరో అనుకొనేటట్లుగా ఎంత కష్టంగా ఉంటే అంత గొప్ప అని అనుకొని గ్రంథాలు రచిస్తే ఈ ప్రయోజనం నెరవేరదు. అప్పుడు సాహిత్యం యొక్క పరిధి సంకోచం చెందుతుంది. ఎంతో శ్రమ చేసి నిఘంటువులు, పండితుల వలన తీరా అర్థం చేసుకున్న తరువాత ఉపయోగమేమున్నది? సాహిత్య ప్రయోజనం నెరవేరదు గదా. అందుకే ఆయన సంధి విగ్రహాలలో చూపిన శైలిగాక సులభశైలిలో ఎందరికి వీలైతే అందరికి అర్థమయ్యేటట్లు ఇక ముందు రచనలు చేయాలనుకొన్నాడు.

ఈ అభిప్రాయానికి వచ్చిన తరువాత కాలంలో, ఆయన కావ్యాలు, ప్రహసనాలు, కథలు, వ్యాసాలు, నాటకాలు, ఉపన్యాసాలు, ఇంకా స్వతంత్ర రచనలు, అనువాదాలు, ఏమి వ్రాసినా, లక్ష్యాన్ని విస్మరించలేదు. సులభ శైలిలో రచించాడు. ఆయన గ్రాంథిక భాషలోనే రచనలు చేసిన మాట నిజమే. కానీ ఆ గ్రంథాల రచనా శైలి మాత్రము, సాధారణమైన చదువు వచ్చిన ప్రతివారికి అర్థమయ్యేటట్లు ఉంటుంది. నిజానికి ఆయన గ్రాంథిక శైలిలో వ్రాయకపోతే నాడు అవి పాఠ్యపుస్తకాలుగా నిర్ణయించబడేవి కావు. ఇంత గౌరవాన్ని పొందేవి కావు.

ఈ స్ఫూర్తితో ఆయన కూచిమంచి తిమ్మకవి అచ్చ తెనుగు రామాయణంలో ఆరు కాండలే వ్రాశాడని అసంపూర్తిగా ఉన్నదని తలచి, ఏడవదైన ఉత్తరకాండను, 'శుద్ధాంధ్ర ఉత్తర రామాయణమ'నే పేరుతో వ్రాశాడు.

1873 సంవత్సరాంతంలో ఆయన 'శుద్ధాంధ్ర మహాభారత' మనే పేరున మహాభారతమునంతను అచ్చ తెనుగున రచింపవలెనని యెంచి సభాపర్వము నారంభించి దానిలో కొంత భాగమును 'ఆంధ్ర భాషా సంజీవని' అనే పత్రికలో ప్రకటించాడు. మొత్తం భారతాన్ని రచించాలనుకొన్నా, ఆ ప్రయత్నము అంతటితో ఆగిపోయింది. తెనుగులో నొక వచన ప్రబంధమున చేయాలని వీరేశలింగం గారికి ఉద్దేశ్యం కలిగింది. మొదట ఏదైనా ఒక ఇంగ్లీషువచన ప్రబంధాన్ని(నవల) తెనిగించి శైలి కుదుటపరచుకొనిన తరువాత తెలుగులో వచనప్రబంధం వ్రాయాలనుకొన్నాడాయన. కానీ, ఇంగ్లీషు కథ తెలుగు వారి వాతావరణానికి సరిపడక మనవారికంతగా రుచింపదేమో అని భావించి దానిని మానివేసి 'రాజశేఖర చరిత్ర' అనే వచన ప్రబంధం వ్రాయటం ప్రారంభించాడు.

మన సంఘంలో ఉన్న మూఢవిశ్వాసాలను పోగొట్టాలనే ముఖ్య ఉద్దేశ్యంతో ఆయన ఈ రాజశేఖర చరిత్రాన్ని వ్రాశాడు. ఇది మొదటగా 1878లో వివేకవర్ధని పత్రికలో నెల నెలా వచ్చింది. తరువాత పుస్తక రూపాన్ని పొందింది. ఈ నవల అప్పటి విద్యా విచారణాధికారి కర్నల్ మేక్డొనాల్డ్ దొరకు అంకితం చేయబడింది. అనేకులు దీనిని విశేషంగా ప్రశంసించారు. ఆ రోజులలో నవలను 'వచన ప్రబంధ'మనేవారు. ఈ విధంగా తెలుగులో మొదటి వచన ప్రబంధం అనబడే నవల వీరేశలింగం చేతనే వ్రాయబడింది. రివరెండు హచ్చిన్సను అనే ఆయన రాజశేఖర చరిత్రను ఇంగ్లీషు చేసి 1886లో చెన్నపురి క్రైస్తవ కళాశాల పత్రికలో భాగాలుగా ప్రకటించి తరువాత పూర్తి పుస్తక రూపంలో, లండనులో, బొమ్మలతో సహా ప్రచురించాడు. ఇంగ్లీషులోకి అనువదించబడిన ఈ గ్రంథం పేరు 'ఫార్చ్యూన్స్ వీల్' (అదృష్ట చక్రం). ఇంగ్లండులో దీనికి చాలా ప్రశంసలు వచ్చాయి. "తెలుగు వాఙ్మయము యొక్క చరిత్రమునందు రాజశేఖర చరిత్రము నూతన శకమునేర్పర చుచున్నదని మేము చక్కగా చెప్పవచ్చును" అని 'ది హిందూ' పత్రిక ఆనాడే ప్రశంసించింది. వీరేశలింగంగారి కాలంలోనే రాజశేఖర చరిత్రం కన్నడంలోకి అనువదింపబడింది.

అయితే విలియం కౌపర్ (1731–1800) అనే ఆంగ్లకవి 'జాన్ గిల్పిన్' అనే పుస్తకం రచించాడు. దాన్ని పద్యరూపంలో 'అభాగ్యోపాఖ్యానం' అనే పేరుతో ఆయన హాస్య ప్రబంధంగా రచించాడు.

వీరేశలింగం క్రొత్త పుస్తకాలను రచించటమే కాదు, అనేక పాత పుస్తకాలను అనగా ప్రాచీన కవులు వ్రాసి కేవలం పేర్లు మాత్రమే వినపడుతూ, అప్పటివరకు ముద్రితం కాని గ్రంథాలను పరిష్కరించి సరిగా ముద్రింప చేశాడు. ఈ విషయంలో ఆయనకు శబ్ద రత్నాకర నిఘంటుకర్త బహుజనపల్లి సీతారామాచార్యుల వారి వ్రాతలు ప్రోత్సాహకాలైనాయి. దాదాపు ఇరవై రెండు ప్రాచీన గ్రంథాలను ఆయన పరిష్కరించి ప్రచురించాడు. అవి కనపర్తి అబ్బయామాత్య రచితమైన కవిరాజ మనోరంజనం అనే పురూరవ చరిత్ర, మొల్ల వ్రాసిన రామాయణము, పింగళి సూరన రచించిన ప్రభావతీ ప్రద్యుమ్నము, కాకుమాని మూర్తి కవి వ్రాసిన పాంచాలీపరిణయము, అయ్యలరాజు రామభద్రకవి ప్రణీతమైన రామాభ్యుదయము, తిక్కన శిష్యుడు కేతన రచించిన విజ్ఞానేశ్వరీయమనే ధర్మశాస్త్ర గ్రంథము, నాచన సోమనాథుడు రచించిన ఉత్తరహరివంశము వంటివి చాలా ఉన్నాయి.

ఇలా పుంఖానుపుంఖాలుగా రచనలు చేస్తున్న సమయంలోనే, ఆయన క్రొత్తగా ఉండాలని సంభాషణ రూపంలో 'బ్రాహ్మ వివాహం' అనే చిన్న రూపకాన్ని వ్రాసి హాస్య సంజీవని మొదటి పత్రికలో కొంత భాగాన్ని ప్రచురించాడు. అప్పటి వఱకు పూర్తి

సంభాషణ రూపంలో పుస్తకాలు లేనందువల్ల, అందులో ఉన్న విషయం క్రొత్తది, తమ జీవితాలకు అన్వయించుకోతగినది కాబట్టి చిన్న పిల్లల నుంచి ముసలి వారి వరకు దానిని చదివి ఆనందించడం మొదలుపెట్టారు. దానికి ప్రజలలో పెద్దయ్యగారి పెండ్లి పుస్తక'మనే పేరు ప్రచారంలోకి వచ్చింది. ఆ పుస్తకాన్ని వీరేశలింగంగారు కేవలం వినోదం కొఱకే కాకుండా అతి బాల్య వివాహం, వృద్ధ వివాహం, కన్యాశుల్కం మొదలైన దురాచారాల వలన కలిగే అనర్ధాలను తెలిపి జనులను వాటి నుంచి విముఖులను చేయాలనే ఆలోచన తోనే వ్రాశాడు. బ్రాహ్మ వివాహం తరువాత వ్యవహార ధర్మబోధిని అనే పేరుతో ఇంకొక గ్రంథం ప్రచురించారు. దీనికీ ప్రజల్లో విశేష ఆదరణ వచ్చింది. దీనిని 'ప్లీడరు నాటకమని' పిలవటం మొదలుపెట్టారు.

వీరేశలింగం కాళిదాసు సంస్కృత నాటకం అభిజ్ఞాన శాకుంతలాన్ని, శ్రీహర్షదేవ విరచితమైన 'రత్నావళి' నాటికను సంస్కృతం నుంచి పద్యగద్యాలతోను, షేక్స్పియర్ మహాకవి రచించిన 'కామిడీ ఆఫ్ ఎర్రర్స్' నాటకాన్ని, ఇంగ్లీషు నుంచి గద్యాత్మకంగానూ అనువదించి, వాటిని ఆ నాటకశాలలో తన విద్యార్థుల చేత ఆడించాడు. తరువాత కాలంలో రత్నావళి ప్రథమశాస్త్ర పరీక్షకు పఠనీయ గ్రంథంగా నిర్ణయించబడింది.

అలాగే 1885లో కాళిదాసు విరచిత 'మాళవికాగ్నిమిత్రా'న్ని అనువాదం చేసి ప్రకటించాడు. వెంటనే 'ప్రబోధ చంద్రోదయా'న్ని కూడా అనువదించి వివేకవర్ధనిలో ప్రకటించారు. ఈ నాటకం తరువాత 'షెరిటన్' (1751-1816) అనే ఆంగ్లకవి వ్రాసిన 'డ్యూయన్నా' అనే నాటక కథను అనుసరించి 'రాగమంజరి' అనే నాటకం వ్రాశారాయన. దీని కథ చాలా రమ్యంగా ఉంటుంది గానీ కొంచెం చిక్కుగా కూడా ఉంటుంది. అందుకే సామాన్య జనులు దీనిని చక్కగా గ్రహించి పొందవలసినంత ఆనందాన్ని పొందలేదు. ఇంతేగాకుండా అదే సంవత్సరంలో (1886లో) భారతం విరాటపర్వంలోని దక్షిణ గోగ్రహణ కథను పద్యగద్యాత్మకంగా అయిదంకాల నాటకంగా రచించి ముద్రింపించాడు. తరువాత రాజమహేంద్రవరం నాటకోజ్జీవ సమాజం వారి కోసం కథనేమీ మార్చకుండా హరిశ్చంద్రో పాఖ్యానాన్ని 1886లో నాటకం వ్రాశాడు.

1889వ సంవత్సరంలో, వీరేశలింగం 'తిర్యగ్విద్వన్మహాసభ', 'మహారణ్య పురాధి పత్యము' అనే రెండు నాటకాలను వ్రాశాడు.

రెండోదైన మహారణ్య పురాధిపత్యం కూడా ఆక్షేపగర్భ (వ్యంగ్య) నాటకమే. ఇందులో పాత్రలు తిర్యగ్జంతువులే. నీలితొట్టిలో బడిన ఒక నక్క కథ పంచతంత్రంలో ఉన్నది. ఆ కథ దీనికి మూలాధారం.

వీరేశలింగంచే రచింపబడిన చివరి నాటకం కళ్యాణ కల్పవల్లి. 'షెరిడన్' అనే ఆంగ్ల కవి 'ది  రైవల్స్' అనే పేరుతో బహుసుందరంగా రచించిన ఐదంకాల ఆంగ్ల నాటకానికి తెలుగు సేత.

స్త్రీలకు తెలుగుభాషలో చదువుకొనటానికి, విజ్ఞానం పొందటానికి తగిన మంచి పుస్తకాలు లేవనే విషయం ఆయనకు తట్టింది. ఈ లోపాన్ని తొలగించాలంటే ఏం చేయాలని ఆలోచించి, 1883వ సంవత్సరంలో స్త్రీల కోసమే ప్రత్యేకంగా 'సతీహిత బోధిని' అనే తెలుగు మాస పత్రికను ప్రారంభించాడు. అదే సంవత్సరం స్త్రీల ఉపయోగం కోసం 'సత్యవతీ చరిత్ర' అనే యింకొక వచన ప్రబంధం వ్రాశాడు. ఈ నవలను ఆ రోజులలో అనేకమంది స్త్రీలే కాక పురుషులు కూడా అత్యాసక్తితో చదివేవారు. దానిని చదివి ఆనందించిన అనేకులు తమకు పుట్టిన స్త్రీ, శిశువులకు, ఆ నవలకు కథానాయిక అయిన, సత్యవతి పేరు పెట్టుకొని ఆనందించారు. వీరేశలింగంగారికాలంలోనే ఈ నవల తమిళము, కన్నడ భాషలలోనికి కూడా అనువాదం పొందింది. ఇంగ్లీషులోకి పరివర్తనం చెందింది. కొన్ని పరీక్షలకిది పాఠ్యగ్రంథముగాను నిర్ణయింపబడింది. అటు తరువాత ఆయన 1884, స్త్రీల కొఱకే 'చంద్రమతీ చరిత్ర'మనే గ్రంథాన్ని వ్రాశాడు.

ఆంగ్లంలో జొనాథన్ స్విఫ్ట్ (1667-1745) అనే ప్రసిద్ధ రచయిత, నవలాకారుడు, ఆనాటి ఆంగ్ల సమాజాన్ని విమర్శిస్తూ వ్యంగ్యంగా, హేళన చేస్తూ (గల్లీవర్స్ ట్రావెల్స్) 'గల్లీవర్ యాత్ర'లు అనే పుస్తకాన్ని వ్రాశాడు. 1891వ సంవత్సరంలో, స్త్రీల విషయంలో మన దేశీయులు చేస్తున్న అన్యాయాలను వ్యంగ్యంగా తెలుపుతూ 'గల్లీవర్ ట్రావెల్సు'ను అనువాదం చేయకుండా కథను అనుసరించి 'సత్యరాజు పూర్వ దేశయాత్రలు' అనే పుస్తకపు మొదటి భాగాన్ని రచించి ప్రచురించాడు.

1897వ సంవత్సరంలో, స్త్రీల కోసమే వీరేశలింగం అప్పటి ఆంగ్లదేశపు రాణీ, భారతీయులకు గూడా రాణీయేయైనా 'విక్టోరియా మహారాణి' చరిత్రాన్ని వ్రాసి ప్రకటించాడు. అలాగే 1893వ సంవత్సరంలోనే, నీతి కథామంజరి అనే పేరుతో ఇంగ్లీషులో 'ఈసఫ్ కథల' ననుసరించి ఒక పుస్తకాన్ని వ్రాసి బొమ్మలతో సహా ప్రచురించాడు. ఈ గ్రంథంలో ప్రతి కథ చివర నీతిని తెలిపే ఒక పద్యం ఉంటుంది.

కేవలం కథలు, నీతులు తెలిపే విషయాలను గుఱించే కాక వీరేశలింగం స్త్రీలకు అత్యంతావశ్యకమైన శరీరారోగ్య ధర్మాలను బోధించే 'దేహారోగ్య ధర్మబోధిని' అను పుస్తకాన్ని వ్రాశాడు. 1896లో పత్నీహిత సూచని అనే పుస్తకం ప్రచురించాడు. స్త్రీలు గర్భధారణ సమయంలోను, శిశుపోషణ సమయంలోను, ఇతర సమయాలలోను అనుసరించవలసిన పద్ధతులు, చిన్న చిన్నరుగ్మతలకు ఆచరింపవలసిన చిట్కాలు మొదలైన విషయాలు ఇందులో తెలుపబడ్డాయి.

ఆంగ్ల భాషలో జగద్విఖ్యాత నాటకకారుడు షేక్స్పియర్. ఆయన నాటకాలను ఛార్లెస్ లాంబ్, మేరీ లాంబ్ అనే సోదరీ సోదరులు 'షేక్స్పియర్ నాటక కథల'నే పేరుతో వచనంలో కథారూపంగా వ్రాశారు. వీరేశలింగం సతీహిత బోధిని స్త్రీల మాసపత్రిక 1883లో ప్రారంభం కాగానే స్త్రీలు వినోదంగా చదువుకోవటం కోసం షేక్స్పియర్ నాటక కథలను స్వేచ్ఛానువాదం చేసి నెలా నెలా ప్రచురించాడు. ఇలాగే 1895వ సంవత్సరంలో, జ్యోతిశ్శాస్త్ర సంగ్రహాన్ని పటాలతో సహా ఆయన ప్రకటించాడు. జ్యోతిశ్శాస్త్రమంటే ఇక్కడ మనం ఖగోళశాస్త్రం అని అర్థం చేసుకోవాలి.

సామాన్యులకు వ్రాసే శాస్త్రీయ గ్రంథాలు ఎలా వ్రాయాలో అనే దానికి దారి చూపించిన వాడైనాడు. ఈ గ్రంథ రచనకు ముఖ్య కారణం గ్రహణాలు, జాతకాలు మొదలైన విషయాలను గుఱించి ఆనాడు జనులలో ఉన్న పిచ్చి నమ్మకాలను పోగొట్టాలనే సంకల్పమే. ప్రకృతి శాస్త్రాలలో వీరేశలింగం వ్రాసిన మూడో గ్రంథం జంతుస్వభావ చరిత్ర. దీని ప్రథమభాగం 1896లో ప్రచురించబడింది. అలాగే పదార్థ వివేచనశాస్త్రం, భౌతిక భూగోళశాస్త్రం అనే గ్రంథాలు కొంతవరకు వ్రాశాడుగానీ వాటిని అసంపూర్తిగానే వదలివేశాడు. అటు తరువాత ఆయన సాహిత్యానికి సంబంధించిన కావ్య సంగ్రహము, అలంకార సంగ్రహము, ఆంధ్రతర్క సంగ్రహము, సంగ్రహవ్యాకరణము అనే శాస్త్ర గ్రంథాలు రచించాడు కానీ అవి ప్రకృతి శాస్త్ర సంబంధులు కావు.

వీరేశలింగం పంతులు వ్రాసిన గ్రంథాలన్నింటిలోకి ఆంధ్రకవుల చరిత్ర చాలా ప్రత్యేకమైంది. ఈ విషయాన్ని ఆయనే తన స్వీయచరిత్రలో తెలిపాడు. పంతులుగారి రచనకు ముందు తెలుగులో ఒక్క కావలి వెంకటరామయ్య అనే రామస్వామి వ్రాసిన "ది లైన్స్ ఆఫ్ దక్కన్ పొయెట్స్" (దక్కను కవుల చరిత్ర) అనే ఆంగ్ల గ్రంథంలో పేర్కొన్న కొద్దిపాటి తెలుగు కవుల చరిత్ర తప్ప వేరేమి లేదు. తెలుగు కవి చరిత్రను వీరేశలింగం మూడు భాగాలుగా విభజించుకొన్నాడు. క్రీ.శ. 1450 వరకు గల పూర్వకవులను గురించిన గ్రంథము మొదటి భాగంగా, 1450నుంచి 1650 వఱకు గల కవుల గురించిన గ్రంథం రెండవ భాగంగాను, 1650 తరువాత ఉన్న కవులను ఆధునిక కవులని మూడవ భాగం గానూ వర్గీకరించాడు. మొత్తం ఈ మూడు భాగాలలోను మూడువందల ముప్ఫైమంది కవుల చరిత్ర ఉన్నది. మొదటి భాగం 'కవుల చరిత్ర' 1887లో ప్రకటించబడింది. రెండవ భాగం 1894లో అచ్చైంది.

కవుల చరిత్ర రచనతో ఆంధ్రభాషలో శాస్త్రీయంగా కవుల చరిత్ర రచనకు ప్రణాళిక ఏర్పాటు అయినట్లుగా భావించవచ్చు. అందుకే తాను రచించిన కవుల చరిత్ర, తన గ్రంథాలన్నింటిలో ప్రధానమైనదిగా ఆయన భావించాడు.

ఆయన సరస్వతీ నారద విలాపమనే పేరుతో ఒక పుస్తకం వ్రాశాడు. ఒక రకంగా ఇది ఖండకావ్యంలాంటిది.

హాస్య సంజీవని యొక్క మొదటి మూడవ భాగాలు, వివేకవర్ధని యొక్క ప్రథమ, ద్వితీయ, తృతీయ భాగాలు, ఉపన్యాస మంజరి అనేవి – ఆయన పత్రికల కప్పుడప్పుడు హాస్య రస ప్రధానాలుగారు. వివిధ విషయ వివరణలుగాను, నీతిమత ధర్మబోధకాలుగాను, వ్రాసిన వ్యాసాలను ఏర్చి కూర్చి ప్రకటించిన పుస్తకాలు. ఈ పుస్తకాలలో ప్రచురించినవే కాకుండా, ఆయన వ్రాసిన హాస్య సంభాషణలు, వ్యాసాలు, నీతి ధర్మబోధకాలయిన రచనలు ఇంకా చాలా ఉన్నాయి. ఇంగ్లీషు భాషలో ఉన్న పది ప్రహసనాలను అనుసరించి, పేర్లను, కొంత కథను తెలుగు వారికి సరిపోయేటట్లు మార్చి అపూర్వ బ్రహ్మాచర్య ప్రహసనము, విచిత్ర వివాహ ప్రహసనము, మహా బధిర ప్రహసనము, పునర్మరణ ప్రహసనము, బలాత్కార గాన వినోద ప్రహసనము, కలహ ప్రియా ప్రహసనము, మహామహోపాధ్యాయ ప్రహసనము, యోగనిద్రా ప్రహసనము, మహావంచక ప్రహసనము, అసహాయ శూర ప్రహసనము అనే ప్రహసనాలు కలిపురుష శనైశ్చర విలాసము, వేశ్యాప్రియ ప్రహసనము, కౌతుక వర్ధని, వినోద తరంగిణి అనేవి ఆయన స్వయంగా కల్పించి వ్రాసిన ప్రహసనాలు, కలిపురుష శనైశ్యర విలాసంలో హాస్యయుతంగా ఉండే సంభాషణల ద్వారా మద్యపానాన్ని ఆయన తెగనాడాడు.

పంతులుగారు తాను చెప్పదలచుకొన్న ఉపన్యాసాలను ముందుగా వ్రాసికొని తరువాత సభలలో చదివేవాడు. తరువాత అవి కొన్ని ప్రకటించబడ్డాయి కూడా. వాటిలో జన్మాం తరము, ప్రార్థన, మానుష ధర్మము, విద్యాధికుల ధర్మముల, మనుష్య జీవితము యొక్క పరమార్థము, వైరాగ్యము, విద్యాధురీణుల అర్హ్వకృత్యములు, వర్ణము, హిందూ మతములు, స్వయంకృషి, సకాయకర్మ చేష్టలు, వేశ్యకాంతల ఉపన్యాసము, ఐకమత్యము, దానములు, స్త్రీ పునర్వివివాహ చరిత్రము, స్త్రీల పునర్వివివాహ విషయకోపన్యాసము, స్త్రీ పునర్వివాహ విషయ ప్రథమ విజ్ఞాపనము, స్త్రీ పునర్వివాహ విషయక ద్వితీయ విజ్ఞాపనము, స్త్రీ పునర్వివాహ విషయక శాస్త్ర సంగ్రహము, స్త్రీ పునర్వివాహ వ్యాపారము యొక్క భూత వర్తమాన స్థితులు, దేశీయ మహాసభయు దాని యుద్దేశములు, శంకరాచార్యులు, బసవరాజు గవర్రాజుగారి జీవ చరిత్రము అనేవి ముఖ్యమైనవి. పై చెప్పిన ఉపన్యాసాలను పరిశీలించిన, సద్ధర్మాచరణకు మనిషికి అవసరమైన అన్ని విషయములను ఆయన స్పృశించారని అర్థం అవుతుంది. అంతేగాక స్త్రీ పునర్వివాహాలను గురించి ఆయనకు గల బలమైన అభినివేశం, ఆయన ఉపన్యాసాల ద్వారా, రచనల ద్వారా వ్యక్తం అవుతుంది.

1894–95లో ఆయన 'స్వదేశ సంస్థానముల చరిత్ర'ను పుస్తక రూపంలో చిత్ర పటాలతో సహా ప్రచురించాడు. 1894వ సంవత్సరంలో ఎండాకాలపు సెలవులలో

చెన్నపట్టణం వెళ్ళినప్పుడు ఆయన అక్కడ జీసస్ చరిత్రను వ్రాయటం మొదలుపెట్టి, ఆరు ప్రకరణాలు పూర్తి చేశాడు. అప్పటికి దానిని వదలివేశాడు. తిరిగి 1913వ సంవత్సరంలో చల్లదనం కోసం బెంగుళూరు వెళ్ళినప్పుడు మిగిలిన రెండు ప్రకరణాలు వ్రాసి పుస్తకాన్ని పూర్తి చేశాడు. దీనిని కూడా బొమ్మలతో కలిపి ముద్రించాడు.

ఈ సమయంలోనే 'ఉత్తమ స్త్రీ చరిత్ర'లనే పేరుతో ఒక గ్రంథాన్ని ఆయన ప్రచురించాడు. ఇందులో ఉత్తమ ఐరోపీయ స్త్రీల చరిత్రలు వివరించబడ్డాయి. వాటిలో జోన్ ఆఫ్ ఆర్క్‌గా ప్రసిద్ధురాలైన ఆర్లియన్సు చరిత్ర కూడా ఉన్నది. చివరలో 'ఉత్తమ మాత' అనే ఉపన్యాసం కూడా చేర్చబడింది. ఆయన రాజారామమోహనరాయల చరిత్రను వ్రాయటం చాలాకాలం క్రిందటే మొదలుపెట్టాడు గానీ దానిని పూర్తి చేసినట్లు లేదు.

మొదటి నుంచి, మన దేశీయులలో మతం పేరుతో జరుగుతున్న దురాచారాలంటే ఆయనకు ఏవగింపే. అందుకే మత విషయాలు ఎలా ఉండాలనే విషయంపై ఆయన అద్వైత మత సంగ్రహం, విశిష్టాద్వైత మత సంగ్రహం, ద్వైత మత సంగ్రహం అనే వ్యాసాలను సత్యవాదిని పత్రికలో ప్రకటించారు. వాటిని ఆయన సత్యవాదిని అనే పేరుతో ఒక పుస్తకంగా ప్రచురించాడు.

1892వ సంవత్సరంలో ఆయన ఇంగ్లీషులో ఆలీవర్ గోల్డ్‌స్మిత్ కవి రచించిన 'ది ట్రావెలర్' అనే పద్యకావ్యాన్ని 'పథిక విలాసం' అనే పేరుతో తెనుగులోకి అనువాదం చేశాడు. భాషాంతరీకరణం తేలికగా, మనోహరంగా ఉన్నదని ఆ పుస్తకం ప్రచురించిన కొద్ది రోజులలోనే మహామహోపాధ్యాయ కొక్కొండ వెంకటరత్నం ప్రశంసిస్తూ లేఖ వ్రాశాడు.

ఆయన, అనేక సందర్భాలలో అనేక పద్య రచనలు చేసి చదివాడు. అలాంటి రచనల్లో 1885లో మద్రాసులో బ్రహ్మోపాసన మందిర ప్రతిష్టాపన సమయం, 1887లో విక్టోరియా మహారాణి పంచాశద్వత్సర పరిపాలన మహోత్సవ సమయంలో వ్రాసినవి కొన్ని. ఇంకా ఇలాంటివి చాలానే ఉన్నాయి.

వీరేశలింగం రచనా కౌశలం కేవలం ఈ పుస్తకాలకే పరిమితం కాలేదు. ఆయన ఉపాధ్యాయుడు కాబట్టి పాఠశాలల విద్యార్థులకు ఎలాంటి పుస్తకాలు అవసరం అవుతాయో క్షుణ్ణంగా తెలిసినవాడు. అందుకే ఆయన కర్నల్ మాక్డానాల్డు దొర విద్యా విచారణాధికారిగా ఉన్నప్పుడు దొరతనము వారి రెండవ పాఠ్యపుస్తకాన్ని వ్రాశాడు. మార్సుడన్ అనే దొరగారి కోరిక మీద మాక్మిలన్ కంపెనీ అనే ప్రసిద్ధ పుస్తక ప్రకటనదారులకు నాల్గవ వాచక పుస్తకము, అయిదవ వాచక పుస్తకము, ఆఱవ వాచక పుస్తకములను వ్రాసి ఇచ్చాడు. ఆయనకు భగవంతుడు వేగంగా వ్రాయగలిగే శక్తిని ఇచ్చాడు. ఆయన దానిని పూర్తిగా వినియోగించుకొన్నాడు. పద్యమైనా,వచనమైనా ఆయన ఒకసారే వ్రాసేవాడు. శుద్ధ ప్రతి

వ్రాయటం, చిత్తు ప్రతిని ఉంచుకోవటం అనే ఊసే లేదు ఆయన వద్ద. ఆయన చేతివ్రాత చక్కగా ఉండేది. పాతకాలంలో ముత్యాల కోవలాంటి దస్తూరి అనేవారు. ఆయన వ్రాత అందుకు ఉదాహరణ.

ఆయన చేసిన ఇంత విస్తృతమైన రచనా వ్యాసంగానికి ప్రధాన కారణం తెలుగు భాషను వృద్ధి చేయాలనే ఆకాంక్ష మొదటి నుంచి ఆయనకు చాలా తీవ్రంగా ఉండటమే. స్వీయచరిత్ర రచనలో కూడా ఆయనదే తొలి అడుగు అని చెప్పవచ్చును. పైన చెప్పిన తొలి రచనలు వీరేశలింగానివేనని చెప్పే విషయంపై కొంత చర్చ జరిగినా, వానిసంపూర్ణ రూపంలో నవల, ప్రహసనం, స్వీయచరిత్ర, స్త్రీల కోసం వచన రచన, చరిత్రలు అనేవి తెలుగు సాహిత్యానికి ఆయన పెట్టిన తొలిభిక్షేనని దానిలో రెండవ అభిప్రాయం లేదు.

# పత్రికారంగంలో

వీరేశలింగం సాహిత్య జీవితం పత్రికా జీవితం పడుగు పేకల వలె పెనవేసుకొని పోయినట్టివి. లోకానుభవం వచ్చిన తరువాత 1870 నుంచి ఆయన చేసిన మొట్టమొదటి రచన శుద్ధాంధ్ర నిరోష్ఠ్య నిర్వచన నైషధము గోదావరి ఎడ్యుకేషనిస్టు (గోదావరి విద్యా ప్రబోధిని) అనే పత్రికలో కొంతవరకు ప్రతి నెలా ప్రచురించబడింది. ఇక్కడి నుంచి ఆయన పత్రికా రచనము ప్రారంభం అయింది. 1872లో కోరంగికి పోకముందే ఆయన బందరు నుండి వెలువడే పురుషార్థప్రదాయిని అనే పత్రికకు గ్రంథాలు వ్రాసి పంపటం ప్రారంభించారు. ఆయన రచించిన 'రసిక జనరంజనము', 'శుద్ధాంధ్రోత్తర రామాయణము' అనే గ్రంథాలు రెండూ 1872వ సంవత్సరంలో పురుషార్థప్రదాయినిలో ప్రచురించబడ్డాయి. ఈ పురుషార్థప్రదాయిని మాసపత్రిక, 1872వ సంవత్సరంలో జనవరి నుంచి బందరు నుండి వెలువడేది. ఉమా రంగనాయకులు నాయుడు అనే ఆయన ఈ పత్రికకు సంపాదకుడు. ఆ తరువాత కూడా వీరేశలింగం ఈ పత్రికకు రచనలు వ్రాస్తూనే ఉన్నాడు.

వీరేశలింగానికి ముందు తెలుగు పత్రికలు లేవా అంటే చాలానే ఉన్నాయని చెప్పవచ్చు. నిజానికి ఆయన పుట్టిన తేదీ కంటే ముందు స్థాపించబడిన పత్రికలలో ఆయన వివేకవర్ధనిలో పాటించిన నియమాలు కొన్ని సూచనప్రాయంగా కనిపిస్తాయి. వీరేశలింగానికి ముందు ఒక శతాబ్దకాలం నాటికే అంటే 1764-1847 నాటికి తెలుగులో ముద్రణ కార్యక్రమం మొదలైంది. అయితే 1830 వరకు ముద్రణకళ అంతగా అభివృద్ధి చెందలేదని చెప్పవచ్చు. తెలుగులో మొదటి పత్రిక 1838లో బళ్ళారి నుంచి వెలువడిన 'సత్యదూత'. 1830 తరువాతే తెలుగులో ముద్రణకళ అభివృద్ధి చెందినందువలననే పత్రికలు వెలువడటానికి కారణం అయిందనేది సత్యం.

ఇప్పటి వరకు వేరు వేరు పత్రికల ద్వారా తన రచనలను వీరేశలింగం, 1874వ సంవత్సరం అక్టోబరులో వివేకవర్ధని అనే మాసపత్రికను ప్రారంభించాడు. ఈ పత్రికను ప్రారంభించటంలో ఆయన ఉద్దేశ్యం స్త్రీ విద్యావశ్యకతా వాదాన్ని గురించిన తన ఊహలను లోకానికి వెల్లడించటం. అందుకు తనకే ఒక పత్రిక ఉంటే బాగుంటుందని ఆయన భావించాడు. వివేకవర్ధని మొదట్లో నాలుగు పేజీల మాసపత్రిక. ఈ పత్రికకు ఆదర్శం.

**ఒరులేయవి యొనరించిన**
**నరవర యప్రియము తనమనంబున కగుఁదా**
**నొరులకు నవిసేయకునికి**
**పరాయణము పరమ ధర్మపథముల కెల్లన్** – అనే తిక్కన భారత నీతి సూక్తి.

ఈ పత్రికను ప్రారంభించటంలో వీరేశలింగం ఉద్దేశాలు రెండు. అవి 1. భాషాభివృద్ధి 2. దేశాభివృద్ధి. భాషాభివృద్ధికి, తెలుగు భాషలో మృదువైన సులభశైలిలో సలక్షణ వచన రచన చేయడం, దేశాభివృద్ధికై, ప్రజలలో ఉన్న దురాచార దుర్వర్తనాలను పోగొట్టి, అభివృద్ధి చెందగలిగే పద్ధతలును మార్గదర్శకం చేసి, వారిని అధిక నీతిమంతులను చేసి దేశాన్ని అభివృద్ధి చేయటానికి పాటుపడటం.ఆయన ఉద్దేశ్యంలో దేశాభివృద్ధి అంటే విద్యా, వ్యవహార, కులాచార, నీతి, మత విషయాలలో అన్నింటిలో కృషి చేయాలిగానీ రాజకీయ విషయాల లోనే అని మాత్రం కాదు. వీరేశలింగం నిర్వహించిన వివిధ సంఘ సంస్కరణ ఉద్యమ నిర్మాణానికి వివేకవర్ధని పెట్టనికోటగా నిలిచింది.

బాలికా విద్యను గురించి తరచుగా ఈ పత్రికలో ప్రకటించబడిన అనేక విషయాలను చదివి, కొందరిలో మానసిక పరివర్తనం కలగడం మొదలైంది. దానికి తోడు వీరేశలింగం తరచుగా తన ఉపన్యాసాలలో బాలికావిద్య ఆవశ్యకతను గురించి ప్రాచీన శాస్త్రాలలో ఎక్కడా దానిపై నిషేధం లేని విషయం గురించి, తెలియజేస్తూ ప్రాచీన స్త్రీలు ఏ విధంగా చదువుకొన్నారో తెలిపే ఉదాహరణలను గ్రంథాల నుంచి ఎత్తి చూపటం వలన, క్రమంగా ప్రజల ఆలోచనలో మార్పు రావటం మొదలైంది. అనేక సాంఘిక దురాచారాలను, అవినీతి, మూఢ నమ్మకాలను ఖండిస్తూ ప్రజలలో ఈ పత్రిక జాగృతిని తెచ్చింది. ఈ పత్రికా రచనలు, ఉపన్యాసాల ప్రభావం చేత, చాలా మంది ప్రముఖులకు బాలికా విద్య అవసరమనే నిశ్చయం కలిగి, ధవళేశ్వరంలో 1874వ సంవత్సరం సెప్టెంబరులో వదాన్యుల నెలసరి విరాళాలతో ఒక బాలికా పాఠశాల ప్రారంభించబడింది. పురుషులలో కూడ విద్య అత్యల్పంగా ఉన్న ఆ కాలంలో, చిన్న గ్రామమైన ధవళేశ్వరంలో చందాలు వేసికొని బాలికా పాఠశాల నడిపేటట్టు ప్రేరణ కలిగించటం సాధారణ విషయం కాదు గదా! ఇది వీరేశలింగం తన పత్రికా రచనల ద్వారా చేసిన కృషి ఫలితమే. ఆధునిక పద్ధతిలో నడిచిన మొదటి పత్రిక వివేకవర్ధనియేనని చెప్పడంలో యెలాంటి విప్రతిపత్తి లేదు.

వివేకవర్ధని ప్రకటన ప్రారంభం అయి ఆరు మాసాలు వచ్చినది మొదలు, గొప్పవారి దుర్నీతిని మాన్పే ప్రయత్నం పత్రిక ద్వారా ప్రారంభం అయింది. అంటే పత్రికలు ఇంకా మన తెలుగు సీమలో శైశవావస్థలో ఉన్నప్పుడే, ఆధునిక కాలంలో 'ఇన్‌వెస్టిగేటివ్ జర్నలిజం' అని పిలువబడే పరిశోధన ప్రధాన పత్రికా రచన మొదలు పెట్టాడు వీరేశలింగం. బహుశః భారతదేశంలోనే ఈ రంగానికి ఈయనే ఆద్యుడేమో. ఈ విషయంపై పరిశోధన జరిగితే తెలుగుతేజం లోకానికి తెలుస్తుంది.

1876వ సంవత్సరంలో, మరికొందరు భాగస్థులతో కలసి రాజమహేంద్రవరంలోనే వీరేశలింగం స్వంత ముద్రణాశాలను వివేకవర్ధని కోసం ఏర్పాటు చేశాడు. ఈ ముద్రణశాల వలన వివేక వర్ధనికి స్వంత అచ్చు కూటం లభించిందే కానీ దాని మీద నష్టం రావటం మొదలైంది. 1875లో నరసాపురంలో వీరేశలింగానికి మిత్రుడైన మీర్‌షుజాయతల్లీఖాన్ సాహెబ్ 'విద్వన్మనో హారిణి' అనే తెలుగు మాస పత్రికను ప్రకటిస్తుండేవాడు. వివేకవర్ధనిని ఒక సంవత్సరం నడిపిన పిమ్మట విద్వన్మనోహారిణిని దానితో కలిపిచేసి, వివేకవర్ధనిలో ఇంగ్లీషు కూడా చేర్చారు. ఇంగ్లీషు భాగానికి మీర్‌షు జాయతల్లీ రచనలు చేస్తుంటే తెలుగుకు వీరేశలింగం వ్రాసేటట్లు ఏర్పాటు జరిగింది.

1876 నుంచి వివేకవర్ధని పక్షపత్రికగా మార్చబడింది. ఆ నెలనుంచే హాస్య సంజీవని అనే పేర హాస్యరస ప్రధానమైన ఒక మాస పత్రిక కూడా వివేకవర్ధనికి అనుబంధంగా ప్రచురించటం మొదలు పెట్టాడు వీరేశలింగం.

ఇంకొక సంఘటన. అప్పుడే కాదు ఇలాంటి సంఘటన ఇప్పుడు జరిగినా అంత తీవ్రంగాను ఉంటుంది. ఇది న్యాయశాఖలో జరిగే అన్యాయాలు, న్యాయశాఖ ఉద్యోగుల లోని లంచగొండితనానికి సంబంధించినది. న్యాయస్థానాల చరిత్రలోనూ, పత్రికా రచయితగా వీరేశలింగం జీవితంలోనూ అతి ప్రధాన ఘట్టం చిరస్థాయిగా నిలిచిపోవలసిన విషయం. ఆ రోజుల్లో అధికారుల్లో లంచగొండితనం అతి సామాన్యం. దీనికి బద్ధవిరోధి వీరేశలింగం. అప్పటి మండల ప్రాడ్వివాకుడు (డిస్ట్రిక్ట్ మునిసిఫ్) పోలూరు శ్రీరాములు. సాధారణంగా న్యాయాధిపతులైన దేశీయ ఉద్యోగులు లంచాలు పట్టటంలో ఘనులు. వారిలో ఈ పోలూరి శ్రీరాములుది ఇంకా ఘనత వహించిన పాత్ర. 1878వ సంవత్స రంలో, శ్రీరాములు రాజమహేంద్రవరం ప్రాడ్వివాకుడుగా వచ్చాడు. ఆయన లంచాలు పట్టే విధానం కూడా చాలా చిత్రంగా ఉండేది. న్యాయస్థానంలో మునిసిఫ్ ముందు న్యాయవాదులు తమ తమ కేసులు వాదించేటప్పుడు 'ఇండియన్ క్రిమినల్ ప్రొసీజర్ కోడ్'నుంచో 'ఇండియన్ ఎవిడెన్సు యాక్టు' నుంచి లేకపోతే 'ఇండియన్ పీనల్ కోడ్ నుంచో' ఫలానా 'సెక్షన్' నుంచి ఈ విషయం ఉటంకిస్తున్నానని తెలుపుకోవాలి. దాని

ప్రకారం వాదన జరపాలి. కానీ పూర్తి లంచాలకు మరిగిన ఆ ప్రాడ్వివాకుడికి ఏ చట్టం, ఏ కోడ్ అక్కర లేకపోయింది. కేవలం ధనం మాత్రమే ఆయన ప్రధాన చట్టం అయింది.

అందువలన వాదించేటప్పుడు ఒక న్యాయవాది చట్టం పేరు చెప్పకుండానే 100వ సెక్షన్ ప్రకారం నేను చెప్పే విషయాన్ని పరిశీలించండి అని మనవి చేసుకొంటాడు. అంటే వంద రూపాయలు నా కక్షిదారుడు లంచం చెల్లిస్తాడని దాని ఉద్దేశ్యం. వెంటనే కక్షిదారుని న్యాయవాది 150వ సెక్షన్ పరిశీలించండి అని అంటే తన కక్షిదారుడు 150 రూపాయలు లంచం ఇస్తాడని అర్థం. ఇలా వేలం పాటలాగా కోర్టులో పెంచుకొంటూ పోగా ఎక్కడో ఒక చోట ఈ పాట ఆగిపోతుంది. ఎక్కువ చెల్లిస్తామన్న ఆ కక్షిదారుడికి అనుకూలంగా అభియోగం నిర్ణయమవుతుంది. ఈ సెక్షన్ల భాగోతం మున్సిఫ్‌కు పూర్తిగా అర్థం అవుతుంది. ఈ రహస్య భాష ప్లీడర్లకూ, మున్సిఫ్‌కు మాత్రం అర్థం అయ్యేది. మిగిలిన వారికి మాత్రం కేసును చట్టం ప్రకారం వాదించినట్లే ఉండేది.

పైగా న్యాయాన్ని కలిగించవలసిన అన్యాయాధిపతి ఇంకొక అన్యాయమైన పని చేసేవాడు. ఆయన వియ్యంకుడు బావ అయిన చిత్రపు కామరాజు అదే న్యాయస్థానంలో ప్రభుత్వ న్యాయవాదిగా పని చేస్తుండేవాడు. పోలూరి శ్రీరాములు తను స్వయంగా తీర్పులు వ్రాయటం అనవసరమైన శ్రమ అని భావించి, చిత్తు ప్రతిని చిత్రపు కామరాజును వ్రాయమనేవాడు. ఆయన చిత్తుప్రతి వ్రాసిస్తే తాను ఆ తీర్పును శుద్ధప్రతి వ్రాసుకొని మున్సిఫ్ కోర్టులో చదివేవాడు. ఆ న్యాయస్థానంలో వాదించే న్యాయవాదులకందరికీ ఈ సంగతి తెలుసు. కానీ వారేమీ చేయలేకపోతున్నారు. దీనిని బహిరంగంగా నిలదీసే ధైర్యం ఎవరికీ లేదు. అయితే ఈ విషయం వీరేశలింగానికి తెలిసింది. ఇంకా ఆయన చేస్తున్న విపరీతాలు చాలా ఉన్నాయి. కొద్ది కాలంలోనే ఎక్కువ ధనం సంపాదించాలని వరుస తప్పించి పెద్ద మొత్తాలు గల వ్యాజ్యాలను ముందుగా విచారించటం ఒకేసారి రెండు మూడు వ్యాజ్యాలు విచారణకు తీసుకొని తన గుమస్తాలకు సాక్ష్య విచారణను అప్పగించటం, అన్ని వ్యాజ్యాల సాక్ష్యాలను, వ్యాజ్యముల విషయాన్ని పూర్తిగా చదివి తీర్పు వ్రాయాలంటే తనకు ఒక్కడికి కష్టం కాబట్టే ప్రభుత్వ న్యాయవాదిగా ఉన్న వియ్యంకుడు, బావ చిత్రపు కామరాజుకు తీర్పులు వ్రాసే పనిని అప్పగించటం చేసేవాడు. న్యాయవాది పట్టాల సత్రాన్ని తెరచిన వాలేస్ దొరే అప్పుడు మండల న్యాయాధిపతిగా ఉన్నాడు. ఆయన శ్రీరాములును నిజంగానే న్యాయబుద్ధి కలవాడేనని భావించేవాడు.

చిత్రపు కామరాజు మునసబుగారి కొఱకు వ్రాసిన చిత్తు తీర్పు ప్రతుల కాగితాలు శుద్ధ ప్రతులు వ్రాసిన తరువాత చించివేసి, ఆ చించివేసిన ముక్కలను యితర చిత్తు కాగితాల ముక్కలతో తమ యింటికి యెదురుగా ఉన్న పాడుదొడ్డిలోని పెంటకుప్పలలో

పారవేయిస్తుండేవాడు. అందులో తీర్పు ప్రతులున్నాయని తెలియకపోయినా, వారి ఇంటి ఎదురుగా ఉండే న్యాయవాది ఒకరు అక్కడ చించివేసిన కాగితాలున్నాయని వీరేశలింగానికి తెలియజేశాడు. ఆ న్యాయవాది వీధులు తుడిచే మనిషికి కొంత డబ్బు యిచ్చి రెండు బుట్టలతో ఆ కాగితాలను తెప్పించి వీరేశలింగానికి చేర్చాడు. వీరేశలింగం అతి ఓపికగా ఆ కాగితాలన్నింటిని చేర్చి ప్రయాసపడి అతికించాడు. చించిన కాగితపు ముక్కలు అతికించిన వానిలో రెండు కాగితాలు చేరి పూర్తిగా ఒక తీర్పు చిత్తు ప్రతి అయింది. ఆ తీర్పులు ప్రభుత్వ న్యాయవాది చిత్రపు కామరాజు తన బావమరిది, జిల్లా మునిసిఫ్ అయిన పోలూరి శ్రీరాములుకు వ్రాసి పెట్టిన చిత్తు తీర్పులే. ఇలాంటి తీర్పు ప్రతులు నాలుగు అయిదింటిని ఆ చించి పోసిన కాగితాలతో ఆయన తయారు చేసుకొన్నాడు.

తరువాత వెంటనే వీరేశలింగం ఒక బాధితునితో తీర్పుపై అప్పీలు చేయించాడు. అయితే కథ అనేక మలుపులు తిరిగింది. ఈ వృత్తాంతాన్ని అంతటినీ వీరేశలింగం తన స్వీయచరిత్రలో చాలా విపులంగా వర్ణించాడు. చెత్తపోగు నుంచి వీరేశలింగం స్వీకరించిన కాగితపు ముక్కలతో కూర్చిన పత్రాలలో కొన్ని తనకు విశ్వాసపాత్రులే అయిన మిత్రులు చేసిన మోసాల ఫలితంగా నష్టం అయినాయి. రాజమహేంద్రవరంలో తిమ్మిని బ్రహ్మిని చేయగలిగిన ప్రభుత్వ న్యాయవాది కామరాజు ఎన్నో కుతంత్రాలు చేశాడు. కామరాజు క్రిమినల్ 'రికార్డు కీపర్' ద్వారా వీరేశలింగం కోర్టు వారి వద్ద నిక్షిప్తం చేసిన తీర్పు కాగితాలను దొంగతనంగా తీసివేయించి, ఆ స్థానంలో వేరే పనికిరాని కాగితాల నుంచేటట్లు చేశాడు. న్యాయస్థానంలో రికార్డులు దొంగతనం చేయించాడు. వీరేశలింగానికి ఆ వ్యవహారం ఎదురు త్రిప్పటానికి ఇలాంటి చాలా పన్నాగాలు పన్నాడు. ఎత్తులు వేశాడు. అయినా వీరేశలింగం తన వద్ద ఎవరికీ చెప్పకుండా ఒక తీర్పుగల ప్రతిని ఉంచుకొన్నాడు. చివరకు అంతిమంగా విచారణకు వచ్చినప్పుడు దానినే ఆయన విచారణాధికారికి సమర్పించి తాను ఎలాంటి అభాండాలు ఎవరి మీద వేయలేదని, అన్నీ యదార్థ విషయాలనే ఫిర్యాదు చేశానని నిరూపించుకొన్నాడు. చిత్తు కాగితాలలో చాలా భాగం తన పరం చేసుకొని కోర్టులో దాఖలు పరచిన సాక్ష్యాన్ని నిర్మూలించాలని కామరాజు ఎన్నోసార్లు ప్రయత్నించినా వీరేశలింగం జాగరూకత వల్ల అవి అన్నీ విఫలం అయినాయి.

కేసును విచారించిన జిల్లా జడ్జి దానితో సంబంధం ఉన్న ఉద్యోగులందరినీ అపరాధులుగా నిర్ణయించాడు. అందువలన శిరస్తాదారుకు, క్రిమినల్ రికార్డు కీపర్‌కు ఉద్యోగాలు పోయాయి. శిరస్తాదారుకు మతిభ్రమించింది. అవమానాన్ని భరించలేక ప్రభుత్వ న్యాయవాది చిత్రపు కామరాజు ఆత్మహత్య చేసుకొన్నాడు. విచారణ ఫలితం వెలువడక ముందే జిల్లా మునిసిఫ్ కూడా మరణించాడు. కొందరు ఆయనది ఆత్మహత్య అన్నారు. ఇంత పచ్చిబూతుగా బహిరంగంగా జరుగుతున్న అన్యాయాన్ని అరికట్టటానికి

వీరేశలింగానికి వివేకవర్ధని వజ్రాయుధమే అయింది. ఈ విపరిణామాలు చూచిన వీరేశలింగం కూడా చలించిపోయాడు. ఆయన దయార్ద్ర హృదయం అలాంటిది. మనసు, ప్రవర్తన మార్చుకోవాలనే గానీ, శత్రువుకైనా బాధ కలిగించకూడదనేది ఆయన ఉద్దేశం. అయితే ఈ సంఘటన తర్వాత ధర్మం, సత్యాల మీద ఆయనకు గల నమ్మకం ఇంకా దృఢమైంది. తన వైఖరి ధర్మయుతంగానే ఉన్నదనే నమ్మకం కలిగింది. ప్రభుత్వ పదవుల కంటే, న్యాయాధీశుల అంగబలం కంటే సత్యబలం ఎక్కువైనదని ఆయన ఇంకొకసారి దృఢపరచుకొన్నాడు.

వీరేశలింగం పత్రికా నిర్వహణను అసిధారావ్రతంగా స్వీకరించాడు. పత్రికను తన స్వార్థచింతన కోసం, స్వలాభం కోసం ఆయన ఏనాడూ ఉపయోగించుకోలేదు. పదిమందికి మేలు చేకూర్చాలనే తాపత్రయమే ఆయన చేత పత్రికను స్థాపింపచేసింది.

కొందరు స్వాములు ముఖ్యంగా విరూపాక్ష పీఠాధిపతులైన శంకరాచార్యులు వీరేశలింగం అనుసరిస్తున్న సంస్కరణోద్యమాన్ని దెబ్బతీయటానికి అనేక రకాలుగా ప్రయత్నాలు చేయగా, స్వాముల వారి దంభాన్ని, ఆయన శిష్యుల దురాచారాలను, దుష్ట చేష్టలను బయటపెట్టటానికి వీరేశలింగానికి వివేకవర్ధనే ఆధారమైంది. ఇంత సేవ చేసిన వివేకవర్ధని 1890వ సంవత్సరంలో నిలిచిపోయింది.

వివేకవర్ధని ప్రారంభించినప్పటి నుంచి ఆయన అనేక ఉత్తమ తరగతికి చెందిన వ్యాసాలు, పలువురికి అవసరమైనవి వారిలో ఉత్తమ సంస్కారాన్ని పెంపొందించేవి వ్రాసి ప్రచురించాడు. అనేక వ్యాసాలు వివేకవర్ధని ద్వారా ప్రచురించి పాఠకులకు సద్భావం కలిగే ఉత్తేజాన్ని కలిగించాడు వీరేశలింగం. వివేకవర్ధని కొంతకాలం వారపత్రికగా కూడా నడిచింది. వివేకవర్ధని ప్రచురించిన ఆయన వ్రాసిన ఈ వ్యాసాలు ఇప్పుడు పరిశీలిస్తే చాలా ప్రాథమికంగా కనిపించినా, బడిపిల్లల వ్యాసాల వలె ఉన్నా, ఆనాడు వాటికి ఎంతో ప్రాముఖ్యత ఉన్నది. అలాగే అవి నాటి జనుల ఆలోచనా విధానాన్ని మార్చగలిగాయి. ఒక సంవత్సరంలో స్త్రీ విద్యను గురించి మూడుసార్లు ఆయన వ్యాసాలు వ్రాశాడంటే, స్త్రీ విద్యను గూర్చి ఆయనకు ఎంత ఆసక్తి ఉన్నదో గ్రహించవచ్చు.

తరువాత 1891లో, వీరేశలింగం చింతామణి అనే పత్రికను ప్రారంభించాడు. నిజానికి ఇది న్యాపతి సుబ్బారావు పంతులు నడిపిన పత్రిక. ఈ చింతామణి పత్రికే తొలిసారిగా మన తెలుగు భాషలో నవలల పోటీని నిర్వహించి పత్రికాలోకానికే క్రొత్త ఒరవడిని చూపింది. వీరేశలింగం 1883లో ప్రారంభించి 1890 వరకు నడిపిన పత్రికలలో స్త్రీ హితబోధిని ఒకటి ఇది పూర్తిగా స్త్రీల కోసమే పూర్తిగా ఉద్దేశింపబడిన పత్రిక. 1890 ప్రారంభంలో, దీని ప్రచురణ నిలిచిపోయింది. రాజమండ్రిలోని ప్రార్థనా

సమాజంవారు 1891, జులై నుండి సత్యసంవర్ధిని అనే పేరుతో ఒక పత్రికను నడిపారు. దీనికి కూడా వీరేశలింగమే సంపాదకుడు. ఇది బ్రహ్మ సమాజ ఆదర్శాలను, బ్రహ్మసమాజ పద్ధతులను వివరిస్తూ బ్రహ్మ సమాజ అనుష్ఠానపరులకు విశేషంగా ఉపకరించిన పత్రిక. సత్యవాదిని అనే పత్రికను వీరేశలింగం 1905 మార్చి నెల ఒకటవ తేదీన ప్రారంభం చేశాడు. కాశీభట్ట బ్రహ్మయ్యశాస్త్రి అనే ప్రముఖ విద్వాంసుడు నడిపే 'ఆర్యమత బోధిని' పత్రికకు సరిగా ప్రతిస్పర్ధి ఈ పత్రిక. ధార్మిక సాంఘిక విషయాలే కాకుండా విమర్శ, ప్రతి విమర్శ, చర్చలు అనేకం యిందులో ప్రచురింపబడ్డాయి.

ఇంతేగాకుండా మల్లాది వెంకటరత్నంచే నిర్వహించబడిన 'జనానా' పత్రిక 1894లో ప్రారంభం అయినప్పుడు వీరేశలింగం శిష్యుడు రాయసం వెంకట శివుడు సంపాదకుడుగా ఉండేవాడు. వీరేశలింగం కూడా ఈ పత్రికకు 1904 సెప్టెంబరు నుంచి సహ సంపాదకుడిగా పనిచేశాడు.

ఇంకా మన్నవ బుచ్చయ్య మద్రాసు నుంచి ప్రచురించే 'హిందూ జన సంస్కారిణి' పత్రికలోనూ వీరేశలింగం రచనలు అచ్చయ్యేవి. ఇవేగాకుండా "హిందూసుందరి", 'సావిత్రి', 'ధర్మసాధని' మొదలైన పత్రికలు వీరేశలింగం రచనలను ప్రకటిస్తుండేవి. ఇంకా తన కాలం నాటి అనేక పత్రికలలో ప్రచురించబడిన విషయాలను విమర్శిస్తూనో లేక విషయ వివరణ చేస్తూనో ఆయన చాలా రచనలు చేశాడు. ఆ పత్రికలు ప్రకటించుకున్నాయి కూడా. ఇలా తన జీవితకాలంలో పత్రికలకు, పత్రికల ద్వారా ప్రజలకూ వీరేశలింగం చేసిన సేవలు అనల్పమైనవిగా మనం గుర్తించవచ్చు. మహాంధ్రోదయానికి పత్రికల ద్వారా ఆయన వేసిన బాటలను వీక్షించవచ్చు.

# సంస్కరణలో

సహస్రాబ్దుల కంటే ముందే నాగరికమైన భారతజాతి, ఎప్పటికప్పుడు తన అవసరాలకనుగుణంగా మారుతూ వస్తున్నది. అందువలననే కొంతకాలం మార్పులు లేకుండా స్తబ్దుగా ఉన్న భారతీయ సమాజాన్ని జైన బౌద్ధాలు ఒక కుదుపు కుదిపి మార్పును తెచ్చాయి. అయినా మరికొన్ని శతాబ్దాలు గడిచేసరికి జైన బౌద్ధాలలో తాంత్రికత, వామాచార పంథాల ఆధిక్యతతో యింకొకసారి మార్పు ఆవశ్యకమైంది. ఇది గుప్తులకాలంలో జరిగిన పునరుజ్జీవన ప్రక్రియకు దారి తీసింది. కావ్య పురాణ ఇతిహాస రచనా వికాసం జరిగింది. ఇలా జరిగిన మార్పులకు, పునరుజ్జీవనానికి భాషే మూలమైంది. ఏ మార్పైనా రావాలంటే ప్రజల ఆలోచనలో మార్పు రావాలి. దాని ద్వారా మనస్తత్వాలలో మార్పు కలగాలి. అలా మనస్తత్వాలలో మార్పును కలిగించగలిగేది మనస్సును కదిలించేది సాహిత్యమే. సాహిత్యానికి కదలిక భాష ద్వారా, వివిధ సాహిత్య ప్రక్రియల ద్వారా వస్తుంది. ఇలా పందొమ్మిద శతాబ్దం వరకు భారతదేశంలో జరిగిన, కలిగిన మార్పంతా ఒక సంకుచిత పరిధిలో జరిగింది. ఇందుకు మన తెలుగు సీమ కూడా అపవాదమేమీ కాదు.

పందొమ్మిదవ శతాబ్దం ప్రారంభం సంస్కరణోద్యమాల తొలి అడుగు. ఇది 1800 నుండి 1870 వరకు అంటే వీరేశలింగం యువకుడై రంగం మీద కాలిడేవరకు కొనసాగింది. అటు తరువాత తన ముందు వారు బీజప్రాయంగా వేసిన సంస్కరణ వృక్షాన్ని వీరేశలింగం మహావృక్షం చేసి పూవులు పూయించి కాయలు కాయించాడు. వీరేశలింగం సంస్కరణోద్యమం మూడు విభాగాలుగా ఉన్నది. మొదటిది భాషా సంస్కరణ, రెండవది అసహాయ స్త్రీ రక్షణ అంటే స్త్రీలను అభివృద్ధి పథంవైపు ప్రయాణం చేయించడం.

మూడవది నీతికి సంబంధించినది. ఇందులో మత, ధర్మ, కర్తవ్య నిర్వహణ వంటి ప్రజాప్రవర్తనకు సంబంధించిన విషయాలన్నీ ఉన్నాయి.

ఈ మూడు రకాలైన సంస్కరణలకు ఆయన స్పష్టమైన రూపాన్ని యిచ్చాడు. ఒక రకంగా మహోద్యమాలను సృష్టించాడు. ఆయన జీవితంలో ఈ మూడు ఒకదానితో ఒకటి పెనవేసుకని పోయి ఉంటాయి. ఎందరిలోనో కేవలం భావాలుగా ఉన్న పై మూడు విషయాలను వీరేశలింగమే ఉద్యమ రూపంలో మలిచాడు. కేవలం భావజాలం ఉద్యమాలు కాలేవు గదా! భావాలు సమాజ పొరల్లోకి చొచ్చుకొని పోయి ప్రజల్ని తాకి ప్రభావితం చేయాలి. అప్పుడే ఆ భావాలకు ప్రబలశక్తి లభిస్తుంది. ఇతరులలో అస్పష్టంగా ఉన్న భావాలకు ఒక నిర్దిష్టమైన దిశను కలిగించటానికి వ్యూహాన్ని రచించాడు. అందుకు మాధ్యమం భాషేనని గ్రహించాడాయన. ఈ భాష ద్వారా భావాలు అందరికీ చేరాలంటే అందులోనూ అసలు విద్య లేనివారికి, అల్ప విద్యావంతులను చేరటానికి ఎంత సులభమైన భాషైతే అంత మేలు. కానీ ఆ కాలంనాడు భాష చాలా జటిలంగా ఉండి గొడ్డు గ్రాంథికంగా సంస్కృత భాషాభూయిష్టమై ఉన్నది. పైగా కొందరికి భాష ఎంత కఠినంగా ఉంటే అంత గొప్ప సంస్కారమనుకొనే ఆలోచనలు ఉన్నాయి. మొదట్లో వీరేశలింగం ఈ భావాలతో రచనలు చేసినా భాష వలని ప్రయోజనమేమి అని తనకు తానే ప్రశ్నించుకొని దానికి జవాబులు తనే చెప్పుకొని, భాష అందరికీ తెలిసేటట్లు సులభంగా ఉండాలి. గ్రంథాలు సాధారణంగా సలక్షణమైన సులభ శైలిలో రచించాలనే అభిప్రాయాన్ని దృఢం చేసుకొన్నాడు. అవసరమైతే విషయాలకనుగుణంగా తత్తదుచిత రీతిన గ్రామ్యభాష (వ్యావహారిక భాషనే వీరేశలింగం రోజుల్లో గ్రామ్యభాష అనేవారు) యందు సహితం వ్రాయవచ్చనే అభిప్రాయానికి వచ్చాడు.

సంస్కరణలను గురించి తన భావాలు జన బాహుళ్యలోకి వ్యాపించటానికి, వారికి చేరటానికి తన సంస్కరణ, భాష నుంచే మొదలుపెట్టాడు. తన భాషను సులభం చేశాడు. సూటిగా భావవ్యక్తీకరణ ప్రారంభించాడు. తన ప్రహసనాలలో గ్రామ్యభాష ఉపయోగించాడు. అందువల్లనే జనం ఆయన 'పెద్దయ్యగారి పెళ్ళి పుస్తకం' అనే బ్రాహ్మ వివాహం, ప్లీడరు నాటకం అనే దంభాచార్య విలసనము అనే ప్రహసనాల్ని వీధి అరుగుల మీద గుంపులు గుంపులుగా కూర్చొని చదివి ఆనందించారు.

రెండవ లక్ష్యం సమాజంలో నీతిని ప్రవర్తిల్ల చేయటం. దీనిని సాధించటానికి, తన భావాలు ప్రకటించటానికి ఒక బలమైన మాధ్యమం అవసరమని భావించాడాయన. అందుకే 1874 అక్టోబరులో వివేకవర్ధని పత్రికను ప్రారంభించాడు. అనేక సద్గుణాలను, మనుష్యులు వాటిని పెంచుకొనవలసిన పద్ధతులను గురించి ఆయన వివేకవర్ధనిలో యెన్నో వ్యాసాలు వ్రాశాడు.

అందుకే క్రమంగా ఆయన ఆలోచనలు ప్రజలలో మతాన్ని గురించిన భావాలలో మార్పు తీసుకొని రావాలనే అంశం వైపు మళ్ళాయి. దానిని సాధించాలనే ఆయన బ్రహ్మ సమాజం వైపు దృష్టి మరల్చాడు.

అందుకే, వంగదేశంలో అప్పటికే ప్రబలంగా ఉన్న బ్రహ్మ సమాజ భావాల వైపు ఆయన ఆకర్షితుడైనాడు. ప్రపంచంలోని మతాలన్నీ ఒకటేనని, వాటి పేర్లే వేరని దేవుడనే దివ్యశక్తి ఒకటేనని పేర్లు మాత్రం భిన్నమని, ఇదే మన ఉపనిషత్తులలో చెప్పబడిన విషయమని రాజారామమోహనరాయ్ ప్రతిపాదించిన బ్రహ్మ సమాజ ముఖ్యసూత్రం. మనిషి దుస్థితిలో ఉన్నప్పుడు మతం వారికి ఊరట కల్పించాలని సమాజ అభ్యున్నతికి మతం తోడ్పడాలని ఆయన భావించాడు. తెలుగు సీమలో బ్రహ్మ సమాజాన్ని రఘుపతి వెంకటరత్నం నాయుని సహాయంతో స్థాపించాడు. క్రమంగా యువకులలో ఈ భావాలు వ్యాప్తి చెందాయి. బ్రహ్మ సమాజం శాఖలు వివిధ ప్రాంతాలలో ప్రారంభం అయినాయి. యువకులు, ఇతరుల ఆలోచనలలో మార్పు రావటం మొదలైంది. వివేకవర్ధని ద్వారా ప్రభుత్వోద్యోగులలో ఉన్న లంచాలు స్వీకరించడం, అహంభావంతో సామాన్యులను దగ్గరికి రానీయకపోవటం, వేశ్యాలంపటత్వం మొదలైన లక్షణాలను తూర్పార పట్టాడు. వారి మనస్తత్వాలలో మార్పు రావటం గమనించాడు. ఎంతకు చలించని చిత్రపు కామరాజు, పోలూరి శ్రీరాములు వంటివారు వివేకవర్ధని సృష్టించిన ప్రచండ జంఝూమారుతంలో కొట్టుకొనిపోయి ప్రాణాలనే పోగొట్టుకున్నారు. ఆత్మూరి లక్ష్మీనరసింహం వంటివారు పరువును పూర్తిగా పోగొట్టుకొని క్షమాపణ పత్ర సమర్పణతో ఒడ్డునపడి బ్రతుకుజీవుడా అనుకొన్నారు.

ఇక మూడవదైన స్త్రీ జనోద్ధరణ. ఆ రంగంలో వీరేశలింగం చేసిన ప్రయత్నాలు చేయవలసి వచ్చిన త్యాగాలు ఈ ప్రకరణంలో చెప్పబడ్డాయి. ఏ సమాజంలోనైనా సగం స్త్రీ. కాబట్టి సమాజ అభ్యుదయానికి మహిళా ప్రగతి ఒక కొలబద్ద. కేవలం నైతికంగా, ఆర్థికంగా, సామాజికంగా ఆమెకు అన్యాయం జరగడమే కాదు తరతరాలుగా మగవారి దౌష్ట్యాలకు, దుష్టనీతికి ఆమె బలి అవుతూను ఉన్నది. ఇలా అన్ని విధాలుగా బాధలు పొందుతూ అసహాయురాలైన స్త్రీ జాతిని ఉద్ధరించాలని ఆయనకు సంకల్పం కలిగింది. దీనికి పరిష్కారమార్గాన్ని ఆయన ఆలోచించాడు. ఈ సకల అనర్థాలకు మూలం స్త్రీకి విద్య లేకపోవటమేనని, దీనికి పరిష్కారం స్త్రీ విద్యవ్యాప్తేనని ఆయన భావించాడు.

1874లో చెన్నపురిలో కొందరు ప్రముఖులు స్త్రీ పునర్వివాహాన్ని ప్రోత్సాహపరచటానికి ఒక సమాజాన్ని స్థాపించి పనిచేయటం ఆరంభించారని ఆ కాలంలోనే శ్రీ మహామహో పాధ్యాయ పరవస్తు వెంకట రంగాచార్యులవారు 'పునర్వివాహ సంగ్రహ' మనే పేరుతో

స్త్రీ పునర్వివాహం శాస్త్ర సమ్మతమేనని 1875వ సంవత్సరంలో ఒక చిన్న పుస్తకాన్ని వ్రాసి ప్రకటించారు.

ఇదే సమయంలో బాల్యసఖుడు చల్లపల్లి బాపయ్య తరచుగా స్త్రీ పునర్వివాహ విషయంలో ఏదో కొంత చేయాలని వత్తిడి తెస్తున్నాడు. అది వీరేశలింగం రణరంగంలోకి దూకటానికి ప్రథమ ప్రయత్నం. నాటి నుంచి రాజమహేంద్రవరంలో ప్రతి ఇంట్లోను స్త్రీ పునర్వివాహ చర్చలే. ఆయనను అంతకు ముందు భూషించినవారు కూడా దూషించడం మొదలుపెట్టారు. ఏమైనా ఆయన చలించలేదు. 'తనకు ధర్మమయిన పనిలో శక్తివంచన లేక కృషి చేయటమే మనుష్యుల పని. దాని ఫలాఫలాలను ఇవ్వవలసిన వాడు ఈశ్వరుడు కాబట్టి తద్విచారము మనుష్యునిది కాదు' అని భావించాడాయన.

1879 ఆగస్టు నెల 3వ తేదీన రాజమహేంద్రవరంలో మొట్టమొదటి స్త్రీ పునర్వివాహ సమర్థన సభ జరిగింది.

ఇలా తెలుగుదేశమంతా కొంత కాలం ఖండన మండనాలతో ఉడికిపోయింది. అనేక ప్రదేశాలలో ఆయన ఉపన్యాసాలిచ్చి తన వాదాన్ని సమర్థించుకొన్నాడు. కాకినాడలో ఒకసారి ఇలాంటి సభే జరిగినప్పుడు ఆయన ప్రతిపక్షులు ఆయనను దైహికంగా బాధించాలని ప్రయత్నించినపుడు గుమ్మిడిదల మనోహరం అనే పోలీసు ఉద్యోగి అలాంటిది జరుగకుండా ఆయనను కాపాడాడు. వీరేశలింగం అండగా వచ్చిన ఆయన విద్యార్థులు ప్రతిపక్షులను తీవ్రంగా మర్ధించడంతో అల్లరిమూక చెల్లాచెదరైంది. ఇంతటితో ఊరుకొనక ఆయన మద్రాసులో కూడా స్త్రీ పునర్వివాహ సమర్ధన చేస్తూ ఉపన్యాసం ఇచ్చే సమయంలో కొందరు దొమ్మికిరాగా పనప్పాకం అనంతాచార్యుల వారు ఆయనను కాపాడారు.

'స్త్రీ పునర్వివాహం సమాజం' అని పేరు పెట్టి అందుకు కృషి చేయటానికి వీరేశలింగం పూనుకొన్నాడు. మిత్రులు చల్లపల్లి బాపయ్య బసవరాజు గవర్రాజు, ఏలూరి లక్ష్మీ నరసింహం మొదలైన ఐదారుగురితో ఈ సమాజ కార్యక్రమాలు ప్రారంభం అయినాయి. పాఠశాలలో ఆయనకు శిష్యులుగా ఉన్న అనేకులు వితంతు కన్యలు దొరికిన పక్షంలో వివాహం చేసుకొంటామని ముందుకు వచ్చారు. దీంతో రాజమండ్రిలో వితంతు పునర్వి వాహ సమాజం ఆరంభించిన ఉద్యమం కొద్దికాలంలోనే బలం పుంజుకొన్నది. మద్రాసులో ప్రముఖుడు బారురాజారావు పంతులు, కాకినాడ వదాన్యుడు పైడా రామకృష్ణయ్య, అవసరం అయితే 30 వేల వరకు ధన సహాయం చేస్తానన్నారు. ఇంకా న్యాపతి సుబ్బారావు, ఆత్మూరి లక్ష్మీనరసింహం మొదలైనవారు ఆ ఉద్యమం పట్ల తమ ఆసక్తిని వ్యక్తం చేశారు. ఇదే సమాజం వారికి చాలా ప్రోత్సాహం కలిగించింది.

కేవలం రాజమహేంద్రవరానికే యీ భావజాలం పరిమితం కాలేదు. అది క్రమంగా ఆంధ్రదేశమంతా వ్యాపించింది. ఎందరో విద్యార్థులు, విద్యావంతులు వీరేశలింగం అభిప్రాయాలను తమ జీవితాలలో ఆచరణలో పెట్టటానికి సిద్ధం అయినారు. విద్యార్థులు, వితంతువులను వివాహం చేసుకోవటానికి తాము సిద్ధమేనని ముందుకు వస్తే, కొందరు వితంతువుల తల్లిదండ్రులు, సంరక్షకులు తమ బిడ్డలకు ఆయన ఏమైనా గతులు కల్పించ గలడేమోనని లేఖల ద్వారాను, వ్యక్తిగతంగాను వచ్చి ఆయనను కలిసి అర్థించటం మొదలుపెట్టారు. ఇలా ఉండగా ఆయన ఉద్యమాన్ని, సాహసాన్ని ప్రశంసించినా, అందులో తాము స్వయంగా భాగం తీసికొనటానికి సాహసించలేని వారు కొందరైతే, కొందరు అలాంటి వివాహాలు జరిగితే అందులో సంపూర్ణ భాగస్వాములం కాగలమని, అందువలన వచ్చే ఎలాంటి చిక్కులనైనా ఎదుర్కొనటానికి సిద్ధమేనని ముందుకు వచ్చారు. కొందరికి ఆయన భావాలు మరీ విప్లవాత్మకంగా తోస్తున్నాయి. అంత వేగం వాళ్ళకు నచ్చలేదు. అయితే అందరూ జరుగబోయే దానికోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

భారతదేశంలో మొట్టమొదటిసారిగా 1856లో వంగదేశంలో ప్రథమ వితంతు వివాహం జరగింది. ఈ మధ్య కాలంలో అంటే 1879 వరకు తెలుగునాట అటువంటిది ఏమీ లేదు. 1869లో మహాదేవ్‌గోవింద రానడే వంటి వారి కృషి వల్ల కొన్ని ప్రాంతాల్లో సకృత్తుగా ఒకటి రెండు అలాంటి వివాహాలు జరుగుతున్నాయి. వితంతు పునర్వివాహ చట్టం 1856లోనే పండిత ఈశ్వరచంద్ర విద్యాసాగర్ కృషి వల్ల చట్టంగా వచ్చింది. దక్షిణాదిలో చెన్న రాజధానిలో 1880 వరకు ఎలాంటి కార్యక్రమం లేదు. కానీ కొందరు ఉత్సాహవంతులు ఆ విషయంలో పుస్తకాలు, కరపత్రాలు ప్రకటించారు. 1880లో వీరేశ లింగాన్ని కులం నుంచి వెలివేయాలని, వీలైతే ఆయనను మర్దించాలని కొందరు ఛాందసులు ప్రయత్నించారు గానీ ఆ సభ భగ్నం అయింది. వీరేశలింగానికి విద్యార్థులు అండగా నిలవడం వలన ఆ ప్రయత్నం సాగలేదు.

ఆంధ్రదేశంలో రాజమహేంద్రవరంలో 1881 డిసెంబరు 11వ తేదీన్న మొదటి వితంతు వివాహం జరిగింది. మొత్తం దక్షిణాదిలోనూ ఆ గౌరవం రాజమహేంద్రవరం పట్టణానికే దక్కింది. ఈ వివాహ నిర్వహణలో అలుపెరుగకుండా పనిచేశాడు వీరేశలింగం. ఆ వివాహం జరగటానికి ఎంతో ధైర్యాన్ని, సమయస్ఫూర్తినీ, చాకచక్యాన్ని ప్రదర్శించవలసి వచ్చింది. 150 మైళ్ళ దూరంలో ఉన్న కృష్ణాజిల్లా తిరువూరు ప్రాంతములోని ఒక గ్రామమునకు చెందిన కన్య గౌరమ్మ. వరుడు గోగులపాటి శ్రీరాములు. ఆయన బాల్యంలోనే కృష్ణా మండలం బందరు దగ్గర మల్లవోలు నుంచి పారిపోయి రాగా, వీరేశలింగం తల్లి పున్నమ్మ ఆయనను పెంచి పెద్ద చేసింది. కన్యను రాజమహేంద్రవరం రహస్యంగా చేర్చ టానికి ఎందరో సహాయం చేశారు. రాత్రికి రాత్రే ఆమెను తీసుకొని రాత్రిళ్ళే ప్రయాణం

చేసి ప్రయాణ సౌకర్యాలు ఏ మాత్రం లేని ఆ రోజుల్లో అతి ప్రయాస మీద గమ్యం చేర్చవలసి వచ్చింది. ఇక వరుడి బంధువులు విజృంభించి ఆఖరు క్షణం వరకు ఆయను మనసు మార్చే ప్రయత్నం చేసి విఫలులైనారు. ఇందుకుగాను వారు ఉపయోగించని ఉపాయం లేదు.

రెండో వితంతు వివాహం 1881 డిసెంబర్ 15వ తేదీ ఇంకొక నాలుగు రోజులలోనే జరిగింది. కన్య స్థానిక బాల వితంతువే. ఇరవై సంవత్సరాల వయస్సున్న రామచంద్రరావనే స్థానిక విద్యార్థి వరుడు. ప్రతిపక్షులు వీరేశలింగాన్ని, ఈ వివాహానికి సహకారం చేసిన వారిని నానా బెదిరింపులు బెదిరించారు. సంఘ బహిష్కరణ చేస్తామన్నారు. అయినా ఏమీ చలించలేదాయన. యధావిధిగా వివాహం జరిగింది.

కొంతకాలం ఎలాంటి అలజడి లేకుండా నడిచింది. క్రొత్త వివాహాల కోసం ఆయన ప్రయత్నాలు కొనసాగిస్తున్నా, వాతావరణం అంత అనుకూలంగా కనిపించలేదు. ఆ సమయంలో ఆయన1882 మేలో, మద్రాసు వెళ్ళి చంచలరావుగారి ఆతిథ్యం స్వీకరించాడు. ఆయన వెంట ఆయన భార్య రాజ్యలక్ష్మమ్మగారు, పునర్వివాహాలు చేసుకొన్న నూతన దంపతులు ఉన్నారు. అక్కడ సమాన ధర్ములైన మిత్రులను కలుసుకొని వారదరికి నూతన దంపతులను పరిచయం చేశారు. అక్కడక్కడ ఉపన్యాసాలిచ్చాడు. వీటిల్లో ముఖ్యమైంది మద్రాసు క్రైస్తవ కళాశాల ఉపన్యాసమందిరం ఏండర్సన్ హాలులో ఆయన చేసిన ప్రసంగం అది. చాలా ఆవేశంగా సాగింది.

రాజమండ్రి తిరిగి వచ్చిన తరువాత వితంతు వివాహం చేసుకొన్నవారికి ఎవరూ నివాసానికి ఇండ్లు అద్దెకు ఇవ్వనందువలన, పైడా రామకృష్ణయ్యగారే కొన్ని ఇండ్లను కొని వారికి, వారివారికి వసతి కల్పించాడు. పెండ్లికి పని చేసిన బ్రాహ్మణుడు, వంటవారు మొదలైన వారు ప్రాయశ్చిత్తములు చేయించుకొని అక్కడి నుంచి వెళ్ళిపోయి బంధువులతో కలిశారు.

ఇలా ఉండగా 1882 ఆగస్టులో, మూడో వివాహానికి ఏర్పాట్లు మొదలైనాయి. మొదట్లో పునర్వివాహం చేయించటానికి యిష్టపడిన వధువు తల్లిదండ్రులు వెనుకకు తగ్గటం చేత ఈ వివాహం చేయించటం చాలా కష్టం అయింది. కేవలం వధువుతోనే రహస్యంగా ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపి ఆమెను రహస్యంగా రాజమహేంద్రవరం తీసుకొని రావలసి వచ్చింది. ఈ వివాహం చేయించటానికి మొదటి వివాహం కంటే పది రెట్లు ఎక్కువ ప్రయాసపడవలసి వచ్చింది. ఈ దుర్ఘటకార్యాన్ని నెరవేర్చినందుకు పండిత ఈశ్వరచంద్ర విద్యాసాగరుల వారు వీరేశలింగాన్ని అభినందిస్తూ సుదీర్ఘమైన లేఖ వ్రాశారు. అయితే వీరేశలింగం వీటి అన్నింటికీ అతీతుడు గదా. మూడో వివాహపు వరుడు తాడూరి రామారావు. వధువు లక్ష్మీబాయమ్మ. తరువాత తన పేరును సీతమ్మగా మార్చుకొన్నది.

క్రమంగా 1884 మధ్యకాలం నాటికి, వైశ్యులలో రెండో వివాహాలు మొదలైనాయి. బ్రాహ్మణులలో వివిధ శాఖలలో అప్పటికే మొత్తం పది పునర్వివాహాలైనాయి. వీరేశలింగానికి చాలా సంతృప్తిగా ఉన్నది. అన్ని రంగాలలోను భార్య రాజ్యలక్ష్మమ్మ ఎంతో చేదోడుగా ఉన్నది. తన భర్తపై అచంచల విశ్వాసం ఉన్న ఆ మహాసాధ్వి ఎన్ని కష్టాలనైనా ఓర్చింది. ఆయన లక్ష్యసాధనలో బాసట అయింది. ప్రాణమిత్రుడు బసవరాజు గవర్రాజు కూడా వదలకుండా ఆయనను అంటిపెట్టుకొని ఉన్నాడు. పైడా రామకృష్ణయ్య ప్రతి వివాహానికి వెయ్యి రూపాయలు ఇస్తున్నాడు. కాబట్టి ధనసంపత్తికి అంతగా కొదవ లేదు.

వారు ముందుకు వచ్చినా, అయోగ్యులనుకొన్న వారికి వివాహం జరిపించటానికి ఆయన అంగీకరించలేదు. 1885వ సంవత్సరంలో ఒక స్త్రీ తన కుమార్తెను తీసుకొని వచ్చి అతనికి కొమ్మురాజు గోపాలమనే పేరు గల వరునితో వివాహం చేయించమని కోరినా, అతడు చదువుకొన్నవాడు కాదని, పైగా అల్లరిగా తిరిగి తల్లిదండ్రుల మాట వినక వచ్చిన వాడని వివాహం చేయటానికి ఆయన అంగీకరించలేదు. ఆయన సంఖ్య కొరకు, తన ప్రతిష్ఠ కోసం వివాహాలు చేయలేదు. వారి సర్వతోముఖాభివృద్ధి కోసమేననే విషయాలు దీని వలన నిర్ధారణ అవుతున్నాయి.

అందుకే 1905 ఫిబ్రవరిలో పండిత హేమనాథ్ సర్కార్ రాజమండ్రి వచ్చినప్పుడు తన తండ్రి ఆబ్ధికం బ్రహ్మసమాజం విధుల ననుసరించి చేయదలచుకొన్నట్లుగా, తాను బ్రాహ్మోగా మారదలిచినట్లు ఆయనకు తెలిపాడు. హేమచంద్ర సర్కారు సాధారణ బ్రహ్మ సమాజ మత ప్రచారకుడు. 1906వ సంవత్సరం అనంతరం తన తండ్రి ఆబ్దికాన్ని వీరేశలింగం బ్రాహ్మసమాజం పద్ధతిలో జరిపి అప్పటి నుంచి వర్ణ విభేదాన్ని వదులుతున్నట్లు ప్రకటించాడు. నిజానికి ఆయన అలాంటి భేదాలను ఎప్పుడో వదలివేశాడు. ఆ సమయంలో ఆయన క్రైస్తవులు మొదలైన అన్ని జాతుల వారితో సహపంక్తి భోజనం చేశాడు.

1907వ సంవత్సరంలో ఒకనాటిరాత్రి ఆయన కళ్ళుతిరిగి పడిపోయి చాలా సేపు స్మృతి కోల్పోయాడు. అప్పటి నుంచి ఆయనను నీరసం ఆవహించింది. ఆ సమయంలో పండిత శివనాథశాస్త్రి కలకత్తా నుంచి వచ్చాడు. ఆయనతో వీరేశలింగం తాను కలకత్తాను దర్శించాలని ఉన్నదని తెలిపాడు. ఈ సమయంలో ప్రయాణాలు చేయకూడదని ఎవరు యెంత చెప్పినా వినకుండా ఆయన భార్యతో కలసి శివనాథశాస్త్రి తోడురాగా కలకత్తా వెళ్ళాడు. దారిలో భువనేశ్వరం దేవాలయాలను పూరీ జగన్నాథ క్షేత్రాన్ని దర్శించాడు. కలకత్తాలో శివనాథశాస్త్రికి అతిథిగా ఉన్నాడు. కలకత్తా నగరంలో అప్పటికే ఆయన పేరు విశేష ప్రచారంలో ఉన్నది. కలకత్తాలో కొంతకాలం ఉన్నప్పుడు బ్రహ్మసమాజంలోని (ఆది, సాధారణ) రెండు వర్గాల వారు ఆయనను సన్మానించారు.

కలకత్తా నుండి ఆయన బెంగుళూరు వెళ్ళాడు. బెంగుళూరులో వర్ధమాన సమాజం వారు చేసిన గౌరవ సన్మానాన్ని స్వీకరించి ఆయన మైసూరు ప్రయాణమయ్యాడు. మైసూరు మహారాణీ కాలేజీలో ఏర్పాటు చేసిన సన్మాన సభలో పాల్గొన్నాడు. తరువాత హైదరాబాదు వచ్చి కవికోకిల సరోజినీదేవి దర్శించాడు. వితంతు శరణాలయానికి చందాలను ప్రోగు చేశాడు. 1908వ సంవత్సరంలో ప్రార్థనా సమాజాన్ని ఆయన ఇంట్లోనే నిర్వహించేవారు. వీరేశలింగం, ఆయన మిత్రులు ఇళ్ళలోనే ప్రార్థనలు నిర్వహిస్తుండేవారు. అప్పటికి ప్రార్థనా సమాజమనేదే లేదు. మొదట్లో వారు మేడమీద తలుపులు వేసుకొని ప్రార్థనలు చేసు కొంటుండేవారు. పలువురు వారి ప్రార్థనలను పరిహసించటమే ఇందుకు కారణం. ఆ ప్రార్థనా సమావేశాలలో మిత్రులు కొందరు ప్రార్థన కీర్తనలు పాడగా వీరేశలింగం ఉపన్యాసాలిచ్చేవాడు. ఆయన ఇచ్చిన ధర్మోపన్యాసాలన్నీ వివేకవర్ధనిలో ప్రచురణ అయ్యేవి. కాలం గడిచే కొద్దీ ఈ ప్రార్థనలకు యితరులను కూడా రానిచ్చేవారు. ప్రార్థనా సమాజం ప్రభావం పలువురి మీద పడింది. కొందరు అప్పటివరకు తాము నడిచిన చెడు ప్రవర్తనను వదలి వేసి సన్మార్గంలోకి మారారు.

రాజమండ్రిలో నందూరి జగ్గరాజనే ఆయన ఉండేవాడు. ఆయనకు విధవలతో సంబంధాలున్నాయనీ, వారి ద్వారా ధనం సంపాదిస్తాడనీ చెడు పేరుండేది. ఒకరోజు ఆయన ప్రార్థనా సమాజానికి వచ్చి అక్కడ జరుగుతున్న ప్రార్థనలను చూచాడు. ఆ బోధనలను విని మనసు మార్చుకొన్నాడు. కొద్దికాలంలోనే సన్మార్గంలోకి మారాడు. అక్కడి నుంచి ప్రతి ప్రార్థనా సమావేశానికి హాజరయ్యేవాడు. కొందరు వీరేశలింగమన్నా, ప్రార్థనా సమాజమన్నా గిట్టనివారు ఆయన తల్లికి "ప్రార్థనా సమాజానికి వెళ్ళి నీ కొడుకు చెడి పోతున్నాడ"ని చెప్పారు. ఆమెకు దుర్బోధలు చేశారు. కొడుకును పిలిచి ఆ తల్లి మందలించింది. సమాజానికి వెళ్ళవద్దన్నది. అతడు వినలేదు. ఒకరోజు ఆమె ప్రార్థనా సమాజంలో ఏం జరుగుతున్నదో ప్రత్యక్షంగా తెలుసుకోవాలని అక్కడకు వచ్చి చాటుగా కూర్చొని అంతా విన్నది. కళ్ళారా చూచింది. అక్కడ జరిగిన ఉపాసనను చూచింది. ధర్మోపన్యాసాలను విన్నది. ఆమెకు చాలా సంతోషం అయింది. ప్రతివారం తనను కూడా అక్కడకు తీసుకొని వెళ్ళమని కొడుకును కోరింది. ఈ విధంగా ప్రార్థనల సమయానికి క్రమంగా వందలకొద్దీ జనం చేరటం మొదలైంది. ఈ సామాజికుల ద్వారా పేద విద్యార్థులకు ఉచిత పాఠశాలలు మొదలైనవి ఏర్పాటు చేయబడ్డాయి.

వీరేశలింగం భార్య రాజ్యలక్ష్మమ్మ మొదట్లో విగ్రహారాధకురాలే. అయినా క్రమంగా ఆమెకు విగ్రహారాధనలో నమ్మకం సడలింది. ఆమె వారానికి ఒక్కొక్కసారి చుట్టుపట్ల ఇళ్ళల్లో గల స్త్రీలను తన ఇంట్లో సమావేశపరచి ఏకేశ్వరోపాసనను ప్రోత్సహించింది. తాను స్వయంగా పరిశుద్ధాస్తిక భావాలను ప్రచారం చేసే కీర్తనలను రచించి ప్రార్థనా

సమావేశాలలో పాడేది. రాజమండ్రిలో స్త్రీలకు ప్రత్యేక ప్రార్థనా సమావేశాలు, ప్రార్థనా మందిరాన్ని ఏర్పాటు చేయిచింది. ఆ రోజుల్లో మద్రాసు రాజధానిలోనే ఒక్క రాజమహేంద్ర వరంలో తప్ప స్త్రీలకు ప్రత్యేక ప్రార్థనా మందిరాలు ఇంకెక్కడా లేవు. ఆమె వితంతు శరణాలయంలోని వారిని ప్రతి శనివారం వెంటబెట్టుకొని వెళ్ళి ప్రార్థనలలో వారిని పాల్గొనేటట్టు చేసేది.

వీరేశలింగం స్థాపించిన ప్రార్థనా సంఘానికి కొందరు స్త్రీలు కూడా తమ భర్తలకు తెలియకుండా గుప్తదానాలు చేశారు. అస్వతంత్రులైన స్త్రీలు ఇలా భర్తలకు తెలియకుండా దానం యిచ్చారంటే ప్రార్థనా సమాజ సిద్ధాంతాలు వారిని ఎంత ప్రభావితం చేశాయో దీని వలన తెలుసుకోవచ్చు. ఇలా సద్ధర్మపరమైన భావజాలాన్ని ప్రజలలో కలిగించటానికి వీరేశలింగం కారణమైనాడు.

వీరేశలింగం బీజప్రాయం మొదలుపెట్టిన భాషా సంస్కరణోద్యమం, గురజాడ అప్పారావు, గిడుగు వేంకటరామమూర్తులు ద్వారా వ్యావహారిక భాషోద్యమంగా రూపు చెందింది. గిడుగు దీనికి ముందుండి వ్యావహారిక భాషోపయోగానికి ఆయన చివరి రోజులలో వీరేశలింగాన్ని ఒప్పించాడు. ఈ విషయాన్ని అంగీకరించటం వల్లనే మొత్తం తెలుగు భాషకు నవ్యాంధ్ర వ్యాకరణం అవసరమని ఆయన భావించాడు. దాని రచన మొదలుపెట్టి కొంత వ్రాశాడు. ఇంతలోనే ఆయనకు సమయం మించిపోయింది.

# దీనస్త్రీ జనసేవలో

'న స్త్రీ స్వాతంత్ర్యమర్హతి' అని స్మృతికారుడు మనువు ఏనాడన్నాడో, భారత స్త్రీ పరిస్థితి ఆనాటి నుంచి అధోగతే అయింది. వీరేశలింగం చిన్నతనంలో తన యింటిలోనే నాలుగు తరాల స్త్రీ ప్రతినిధులను చూచాడు. ఆయన చూపులో వారిపట్ల గౌరవం ఉండేది. వారు పెరిగిన పరిస్థితులలోని అసామంజసతలన్నింటినీ ఆయన పరిశీలించాడు. అందుకే ఆయనకు చిన్నతనం నుంచి స్త్రీలంటే గౌరవం, వారి అసహాయ స్థితికి జాలి, వారిని పైకి తీసుకొని రావటానికి ఏదో చేయాలనే తపన సహజగుణాలుగా వచ్చాయి.

స్త్రీలు అభివృద్ధి చెందాలంటే ముందుగా వారికి విద్య నేర్పించవలసిన అవసరం ఉందని ఆయన సరిగా ఊహించాడు. పట్టుమని ఇరవై సంవత్సరాలు నిండకుండానే. విద్యార్థిగా ఉన్నప్పుడే ఆ పక్షం వహించి పత్రికలకు రచనలు చేశాడు. స్త్రీకి విద్య అత్యంతావశ్యకం అని వాదించాడు. స్త్రీల స్థితి బాగుపడితే కాని మొత్తం దేశం బాగుపడదని ఆయన ప్రగాఢ విశ్వాసం. అవిద్య వలననే వారిలో మూఢనమ్మకాలు వంటివి పెరిగి దయ్యాలు, భూతాలు వంటి నమ్మకాలు హెచ్చి అనారోగ్యం పాలవుతున్నారని భావించాడు.

అందుకే ఆయన అధ్యాపకునిగానే కాక, విద్యాదాతగా కూడా అవతరించాలను కొన్నాడు. ప్రజలకు స్త్రీ విద్యను గురించి ప్రబోధించాడు. ధవళేశ్వరంలో బాలికా పాఠశాలను ప్రారంభించేటట్లు చేశాడు. తరువాత ఆయన దృష్టి పరమ నికృష్టమైన వేశ్యావృత్తిపై పడింది. ఇది మొత్తం మానవజాతికే కళంకమైన వృత్తిగా భావించాడాయన. దీని నిర్మూలనకు ముందుగా పురుషులను తగిన విధంగా మారిస్తేనేగాని కుదరదని ఆయన భావించాడు. అందుకే వివేకవర్ధని ద్వారా కన్నెరికాలు చేసి గొప్పగా భావించే వారిని,

వారి దుష్టచేష్టలను ఏకి, కాకులకు వేశాడు. వారు సిగ్గుపడి అటువంటి పనులు మాను కొనేటట్లు చేశాడు.

కేవలం పత్రికల ద్వారానే కాక ప్రజల మనస్సులలో మార్పు తీసికొని రావటానికి సాహిత్యం కూడా మార్గమేనని ఆయన భావించాడు. అతిబాల్య వివాహాలు, అతి వృద్ధ వివాహాలు, కన్యాశుల్కం మొదలైన వాని అనర్థాలు సాహిత్యం ద్వారా తెలియజేయాలనుకొని "బ్రాహ్మ వివాహం" అనే ప్రహసనాన్ని వ్రాశాడు. అది ప్రజలను చాలా ఆకర్షించింది. అయితే ఆయన అనుకొన్న ఫలితాన్ని తేలేకపోయింది. అందుకే శుష్కమైన వ్రాతల కంటే కార్యాచరణ ముఖ్యమని భావించాడాయన. ముందు చిన్న చిన్న సంస్కరణలతో ప్రారంభిం చాలనుకొన్నాడు. అప్పటికే కొన్ని అక్కడక్కడా సంస్కరణ సమాజాలు వెలసియే ఉన్నవి. అవి పేరుకే కాని వాటి తరఫున జరిగిన పని హుళక్కి. క్రమంగా ఆయన చేసిన కృషి ఫలితంగా ప్రజలలో కొందరిలో మార్పు రావటం మొదలైంది. విధవా వివాహాలు కూడా స్మృతి శాస్త్ర సమ్మతాలేనని, ఆచరణీయాలేనని నమ్మకం కలగటం మొదలైంది.

కొందరు బాల వితంతువుల సంరక్షకులు రహస్యంగా వచ్చి తమ ఆడపిల్లలకు పునర్వివాహాలు చేయటానికి ముందుకు వచ్చారు. మొదటి నుంచి వీరేశలింగానికి ఆయనంటే ప్రాణమిచ్చే విద్యార్థులు అండగా ఉన్నారు. ఆయన ఉపన్యాసాలు, వ్రాతలతో ప్రభావితులైన వారిలో కొందరు ముందుకు వచ్చి వితంతువులను తాము వివాహమాడ తామన్నారు. అదే సమయంలో వదాన్యులైన పైడా రామకృష్ణయ్య ధనం తాను సమకూరుస్తానన్నాడు. అన్ని అనుకూల పరిస్థితులు కలిగినందువలననే ఆయన యదార్థ కార్యరంగంలోకి పూర్తిగా దిగాడు. వితంతు వివాహం చేసుకొంటామని వాగ్దానం చేసిన విద్యార్థుల పాఠశాల జీతాలను ఆయన కట్టాడు. బాల వితంతువులంటే స్థలాలను విచారించి తెలియజేయటానికి తన స్వంత ఖర్చుతో మనుష్యులను నియమించాడు. బాల వితంతువుల తల్లిదండ్రులతో మాట్లాడి అనుకూలం చేయటానికి అమలాపురం, మండపేట, తాళ్లపూడి, కాకినాడ, రామచంద్రాపురం మొదలైన ప్రాంతాలకు మనుష్యులను పంపాడు. కొన్ని ప్రాంతాలకు తానూ స్వయంగా వెళ్ళాడు. ఒక్కొక్కచోట, కనీసం పడక కూడా సరిగా లేక పశువులశాలలో నిద్రించాడు.

ఇలా ఎన్ని సమస్యలను ఎదుర్కొనవలసి వచ్చినా తాను ఆశించిన వితంతు పునర్వివాహం మొదటిది చేయగలిగాడు.

1881వ సంవత్సరం డిసెంబర్ 11వ తేదీ రాత్రి రాజమహేంద్రవరంలో మొదటి వితంతు పునర్వివాహం సలక్షణంగా జరిగింది.

ఇలా ప్రప్రథమ వితంతు పునర్వివాహం నిర్వహించిన వెంటనే, ఎందరో బాల వితంతువులకు సంరక్షకులు, తల్లిదండ్రులు వివిధ ప్రాంతాల నుంచి తమ వితంతు కుమార్తెలకు వివాహం చేయించాలని వీరేశలింగం దగ్గరకు రావటం మొదలుపెట్టారు. అందువల్లనే మొదటి వివాహం అయిన నాల్గవరోజునే రెండో వివాహం అయింది. ఈసారి దంపతులను ఆశీర్వదిస్తూ, వీరేశలింగాన్ని అభినందిస్తూ చాలా ఉత్తరాలు వచ్చాయి.

ఇద్దరు బాల వితంతువులు గంజాం నుంచి పునర్వివాహం చేసుకోవాలనే కోరికతో వీరేశలింగం దగ్గరకు రావాలనుకొన్నారు. అయితే ఇంటిలో తెలిస్తే అంగీకరించరనే ఉద్దేశ్యంతో గంజాం నుంచి ఒక రాత్రి ఎవరికి చెప్పకుండా గ్రామం వదలి విజయనగరం మీదుగా విశాఖపట్నం చేరుకొన్నారు. అందులో ఒకామె ధైర్యం కోల్పోయి అక్కడే నిలిచిపోగా, రెండవ ఆమె తన ఒంటిమీద ఉన్న బంగారాన్ని కూడా అమ్ముకొని, ధైర్యంతో కొంతదూరం నడచి, కొంత దూరం బండి మీద, నిరంతరం ప్రయాణాలు చేసి కొనఊపిరితో రాజమహేంద్రవరంలో వీరేశలింగం గారి ఇల్లు చేరుకొన్నది. ఆమెను అన్ని కష్టాలు ఎదుర్కొనేటట్లు చేసింది కేవలం భవిష్యత్తులో సుఖపడగలననే ఆశ ఒక్కటే. ఇలా ఆయన ఎందరో బాల వితంతువులు మనసులలో ఆశలు చిగురింపచేశాడు. వాళ్ళ జీవితాల్లో కూడా పునర్వసంతం తీసుకొని రాగలిగాడు.

వితంతువులకు వివాహాలు చేయగానే ఆయన తన బాధ్యత తీరిపోయినట్లుగా భావించ లేదు. వివాహానంతరం వారి బాగోగులను ఆయన పట్టించుకొన్నాడు. ఆయన తన వద్దనే వారికి ఏదో ఒక ఉద్యోగం ఏర్పాటు చేశాడు. ఉండటానికి ఇళ్ళు ఇప్పించాడు. కొందరికి రోగాలు రొష్ఠులూ వస్తే మందులిప్పించి నయం చేయించాడు. ఇలా చేసినందువలన ఆయన వితంతు పునర్వివాహ ఉద్యమ ఫలితంగా ఎందరో బాల వితంతువులలో చాలా మార్పు వచ్చింది. తెగువ, ధైర్యం కలిగి ఆయన వద్దకు రావటం పెరిగింది.

రాజమహేంద్రవరంలోనే కాకుండా సామాజికులకు ప్రోత్సాహకరంగా ఉంటుందని రెండు మూడు వివాహాలు ఆయన మద్రాసులో చేయించాడు. కొన్ని గుంటూరు, నరసాపురం, మచిలీపట్నంలలో కూడా చేయించాడు. వివాహాలు చేయించడానికి, ఇతర ఖర్చులకు రాను రాను నిధుల కొరత ఏర్పడినందు వలన ఆయన చెన్నపురిలో ఒక సభ ఏర్పాటు చేసి అందరిని నిధులకు యాచిస్తే ఎవ్వరూ ముందుకు రాలేదు. అటు తరువాత ఇంటింటికీ తిరిగితే నిరసన, అవమానాలు ఎదురైనాయి. ఇక ముందు ఎవ్వరినీ నిధుల కోసం దేబిరించకూడదని నిర్ణయించుకొని రాజమహేంద్రవరం తిరిగి చేరుకొన్నాడు. అందువలన, 1892లో ఆయన తన స్వంత ఖర్చుతో రెండూ వివాహాలు జరిపించాడు.

ఇందుకోసం మిత్రుల దగ్గర అప్పు చేశాడు. మొదట ఎక్కువ సంఖ్యలో వివాహాలు చేయించాలనేది లక్ష్యంఅయినా, తరువాత ఎదుర్కొన్న సమస్యలవలన, లభ్యమైన అనుభవం చేత, వధూవరులు ఒకరినొకరు చూచుకొని పరస్పరం ఇష్టపడితేనే వివాహం చేశాడు.

ప్రముఖ తమిళకవి సుబ్రహ్మణ్యభారతి తాను వ్రాసిన 'చంద్రిక' నవలలో వీరేశలింగాన్ని ఒక పాత్రగా చేసి వితంతువును ఆయన వద్దకు పునర్వివాహానికి పంపినట్లుగా చెప్పబడింది. సమకాలికులలోనే ఆయనపై ఎంత గౌరవభావం ఉండేదో ఈ వృత్తాంతం తెలుపుతుంది.

కొందరు వితంతువులకు ద్వితీయ వివాహం చేసుకోవటం ఇష్టం ఉండదు. అలాంటి వారి కోసం వారు చదువుకొని, విద్యావంతులై స్వతంత్రంగా బ్రతుకవచ్చుననే ఉద్దేశ్యంతో వితంతు శరణాలయాన్ని ప్రారంభించాడు. మద్రాసులో ఉన్నప్పుడు అక్కడ కూడా ఒక వితంతు శరణాలయాన్ని ప్రారంభించాడు. ఆ శరణాలయంలో ఉన్న వితంతువులకు విద్య నేర్చుకోటానికి పాఠశాలకు పంపించారు. వ్యాధి వచ్చినప్పుడు వైద్యం చేయించాడు. వారిలో ఎవరైనా వితంతువులు విద్య నేర్చుకొని వివాహం చేసుకొనటానికి ఇష్టపడితే కోరిన వరులతో వివాహం చేయించాడు. ఇలా ఆయన స్థాపించిన వితంతు శరణాల యాలను దిగ్విజయంగా నడిపించాడు. భార్య జీవించి ఉన్నవాడికి ఎవడికీ మళ్ళీ పెళ్ళి చేయించలేదాయన.

రాజమహేంద్రవరంలోని వితంతు శరణాలయాలలోని వితంతువుల వసతిలోకి సమస్తమైన ఏర్పాట్లు చేసి వారు సుఖమయమైన జీవితం గడిపేటట్లు చేశాడు. వితంతువుల కోసం ఒక పాఠశాల ఏర్పాటు చేశాడు. చదువు చెప్పటానికి వయసు మళ్ళిన ఇద్దరు పురుషులు, ఒక స్త్రీని ఉపాధ్యాయులుగా ఏర్పాటు చేశాడు. తాను కూడా ఆ పాఠశాలలో ఉపాధ్యాయుడుగా పనిచేసేవాడు. ఆయన భార్య వారికి సంగీతం నేర్పేది. వారికి చిత్రలేఖనం నేర్పటానికి ఒక ఉపాధ్యాయుడిని ఏర్పాటు చేశాడు. రాజ్యలక్ష్మమ్మగారు తోటలో కట్టిన ఆనందాశ్రమానికి శరణాలయంలోని స్త్రీలనందరిని ప్రతిరోజు ఉదయం సాయంకాలం ప్రార్థనకు తీసుకొని వెళ్ళేది. శరణాలయ నిర్వహణకు ఒక్కొక్క వితంతువు మీద నెలకు అయిదు రూపాయలు ఖర్చు అయినా స్వంత ధనమే ఖర్చు చేసేవాడు. పుస్తకాలకు ఇతర ఖర్చులకు ఇంకొంత ఖర్చు అవుతుండేది.

వితంతు శరణాలయ నిర్వహణ వీరేశలింగంగారి ఉద్దేశ్యాల ప్రకారం చేయాలంటే కష్టసాధ్యమే. చాలామంది వితంతువులు వివాహం కోసం వచ్చేవారు. వారికి చదువుపై శ్రద్ధ ఉండేది కాదు. పాఠాలు చదువలేదేమని ప్రశ్నిస్తే తాము వివాహం కోసం వచ్చాంగానీ, చదువు కోసం కాదని జవాబు చెప్పేవారు. వచ్చిన స్త్రీలు అనేక ప్రాంతాల నుంచి వచ్చిన వారు కాబట్టి అనేక రకాల మనస్తత్వాలతో ఉండేవారు. అనేక రకాల స్వభావాలతో ఉండేవారు. విద్యాగంధం లేనివారు కావటం వల్లన ప్రతి చిన్న విషయానికి తమలో

తాము దెబ్బలాడుకొంటుండేవారు. వచ్చిన రెండవ రోజు నుంచే 'పెళ్ళి' అని గోల చేసేవారు. తమ పక్షాన మాట్లాడలేదని అలిగి గోల చేయటం. భోజనం మానివేయటం మామూలే. "ఆయన తమ కోసం ఎంత శ్రమ చేస్తున్నారు? అసలు ఎందుకు చేయాలి? అది తమ హక్కా?" అని ఆలోచించగలిగేవారు కాదు. హనుమాయమ్మ అనే కృష్ణా మండలం నుంచి వచ్చిన వితంతువు వీరేశలింగం దంపతులను పెట్టిన బాధలు ఆయన చాలా కాలం తరువాత కూడా మరచిపోలేకపోయాడు. ఆమెతో కలిసి ఇంకొక ఇద్దరు ఒకసారి వెంటనే తమకు పెళ్ళి చేయకపోతే తాము ఎవరితోనైనా లేచిపోగలమని బెదిరింపులకు కూడా దిగారు. ఏదో దొరికినవారితో వెంటనే వారికి వివాహాలు చేయించి పంపించివేశాడు ఆ మహానుభావుడు.

మోసగించబడిన స్త్రీల కోసం ఆయన 'పతిత యువతీరక్షణశాల'ను ప్రారంభించాడు. అందులో కొంతకాలం ఉండి, వివాహం చేసుకొన్న కనకరత్నం, కృష్ణమూర్తి దంపతులు, శరణాలయం వారికి కావలసిన వస్తువులను తమ దుకాణం నుంచే సరఫరా చేసేవారు. వారు వచ్చి తమకు సహాయం చేసి కడుపు నిండా అన్నం తినేటట్లు చేయమని ప్రార్థించి నప్పుడు వీరేశలింగమే ఈ ఏర్పాటు చేశాడు. కానీ ఆ జంట హెచ్చు ధరలకు వస్తువులను అమ్మి తక్కువ తూకాలు తూచి, ఆయననే మోసం చేశారు. పైగా ఆయన వారిని ఏమీ అనకుండా, శరణాలయంలో ఉండే వారిచేత వస్తువులను కొనిపించటం మానివేసినప్పుడు, అక్కడి నుంచి వెళ్ళిపోతామని ఆయనను బెదిరించారు. తరువాత వారు ఎక్కడికీ వెళ్ళలేదు. రాజ్యలక్షమ్మ కనకరత్నానికి పురుడు కూడా పోసింది. వీరు కాక ఇంకో నలుగురు స్త్రీలు "పతిత యువతీ రక్షణశాల'లో ఉండేవారు. వాళ్ళు చెప్పాపెట్టకుండా పారిపోయారు. కొద్ది రోజులకు రాజ్యలక్షమ్మ మరణిస్తుందనగా, ఒక బ్రాహ్మణ వితంతువు బిడ్డను కని, వదలివేసి పారిపోగా, ఆ బిడ్డను రాజ్యలక్ష్మమ్మే పెంచింది.

వీరేశలింగం తాను ప్రారంభించిన కార్యక్రమాలను తన తదనంతరం కూడా నిర్వహించటానికి హితకారిణీ సమాజాన్ని ప్రారంభించారు. తన యావదాస్తిని హితకారిణీ సమాజానికి వ్రాసి ఇచ్చాడు. ఆ హితకారిణి సమాజ బాధ్యతలలో ముఖ్యమైనవి తాను ప్రారంభించిన బాలికా పాఠశాల, వితంతు శరణాలయం, అనాధ శిశు సంరక్షణశాలల నిర్వహణ, కొత్తవి ప్రారంభించి నడపడం.

ఇలా తన జీవితాన్నంతా సంఘసేవయే ముఖ్యంగా స్త్రీల సేవకే వినియోగించి హితకారిణీ సమాజంలో సామాజికునిగా చేరి దాని అభివృద్ధికి కృషి చేయండని ఆయన తెలుగు ప్రజలకు చేతులెత్తి మ్రొక్కాడు.

అందుకే ఆయన దీనస్త్రీ జన బాంధవుడు.

# సంస్థలలో

1874వ సంవత్సరంలో వీరేశలింగం ధవళేశ్వరంలోని ఆంగ్లోదేశభాషా పాఠశాలకు ప్రధానోపాధ్యాయుడుగా నెలకు నలభై నాలుగు రూపాయల జీతం మీద ప్రవేశించాడు. అప్పటికి పత్రికలలో స్త్రీకి విద్య అవసరా అనవసరమా అనే చర్చలు ముమ్మరంగా జరుగుతున్నాయి. వీరేశలింగం స్త్రీకి విద్య అవసరమనే పక్షంలో చేరి సంజీవని పత్రికలోని వ్రాతలను ఖండిస్తూ పురుషార్థప్రదాయినిలో వ్రాసేవాడు. ఈ వాద ప్రతివాదాలు ఒక్కొక్కసారి పద్యరూపంలోనూ ఉండేవి. వీరేశలింగం నడిపిన పత్రిక వివేకవర్ధని కూడా 1874లోనే ప్రారంభం అయింది. వివేకవర్ధని కూడా స్త్రీకి విద్య అవసరం అనే వాదాన్నే బలపరుస్తూ అనేక రచనలను వీరేశలింగం ప్రచురించేవాడు.

ఈ విధంగా పత్రికాముఖంగా మాటల పోరాటం జరుగుతుంటే, దాని వాసన ధవళేశ్వరం పురజనులకు కూడా సోకి త్వరలోనే ఫలితం కూడా కనపడేటట్లు చేసింది. వీరేశలింగం ధవళేశ్వరంలో సభలను ఏర్పాటుచేసి యెన్నోమార్లు బాలికా విద్యాభ్యాసం వలన లాభాలను వివరిస్తూ రాగా, బుద్ధులు సంచలించే వృద్ధుల నుంచి మొదట్లో ప్రాతికూల్యత వచ్చినా, క్రమంగా వారి విముఖత తగ్గి అక్కడి ప్రముఖులకు బాలికా విద్య ఆవశ్యకమన్న నిశ్చయం కలిగింది. అందువలన అక్కడి ప్రముఖులంతా 1874వ సంవత్సరము సెప్టెంబరులో ఒక బాలికా పాఠశాలను స్థాపించి నిర్వహించే ఏర్పాటు చేసుకొన్నారు. తరువాత యిదే స్థానిక సంఘం వారి చేత స్వీకరించబడి నేటికీ నడుస్తున్నది. ఈ విధంగా ఒక సంస్థా నిర్మాణానికి వీరేశలింగం కారణభూతుడైనాడు. పురుషులకే విద్య అనావశ్యకమని తలంచబడే ఆ రోజుల్లో స్త్రీ విద్య కోసం బాలికా పాఠశాల, పలువురు

చందాలు వేసుకొని నడపటానికి ముందుకు రావటం, అదీ గ్రామంలో అంటే ఆశ్చర్యమే గదా. ఈ విద్యా సంస్థ వీరేశలింగం మానసిక పుత్రికే అనడంలో సందేహం లేదు.

వివేకవర్ధని ప్రారంభం అయిన తరువాత దానిని ముద్రించటానికి తగిన ముద్రాశాల లేక ఆయన చాలా యిబ్బందులు పడ్డాడు. అందుకే కొందరు భాగస్థులను చేర్చుకొని వారితో కలసి ముద్రాశాలను ప్రారంభించాడు. అయినా దానికి అనుకున్నంతగా పని లభించలేదు. అందువలన నష్టాలతో నడవవలసి వచ్చింది. మిగిలిన భాగస్థులు వదులు కొనినా, వీరేశలింగమే తన స్వంతధనంతో ఆ ముద్రాశాలను నిర్వహించాడు.

1870 నుంచే, ఆయనను బ్రహ్మ సమాజ భావనలు ప్రభావితం చేశాయి. అందుకు క్రమంగా తన భగవదారాధనను కూడా ఆయన బ్రహ్మ సమాజ పద్ధతిలోనే చేసుకొనేవాడు. దీనిలో భాగంగానే ఆ కాలంలో ఆయన కొందరు మిత్రులతో కలసి, మానసికంగా భగవత్ప్రార్థన చేసుకొంటుండేవాడు. అంతకు ముందు రాజమహేంద్రవరంలో వారము వారమును మానసికంగా ఈశ్వరోపాసనము చేయు సమాజం లేదు. అలాంటి సమాజాన్ని స్థాపిద్దామని ఆయనను మిత్రులు కొందరు ప్రోత్సహించారు. అప్పుడు 1878వ సంవత్సరంలో వీరేశలింగం గృహంలోనే ప్రార్థన సమాజం ప్రారంభం చేశారు. ఈ ప్రార్థనా సమాజంలో వీరేశలింగం, బుర్రా రాజలింగం, బసవరాజు గవర్రాజు, ఏలూరు లక్ష్మీనరసింహం, బయపూనేడి వెంకట జోగయ్య కన్నంరెడ్డి పార్థసారథి నాయుడు అనేవారు సభ్యులుగా ఉండేవారు. సమాజం పేరు విని పిన్నలే కాదు పెద్దలు కూడా చాలామంది పరిహసించేవారు. అందుకే వారంతా ప్రతివారం ప్రాతఃకాలంలో మేడమీద తలుపులు వేసుకొని కూర్చొని ప్రార్థనలు చేసుకొనేవారు. కొందరు కీర్తనలు పాడేవారు. వీరేశలింగం చిన్న ధర్మోపదేశం వ్రాసి చదివేవాడు.

1890లో రాజమహేంద్రవర పురమందిరం నిర్మాణం జరిగిన తరువాత, కొంత కాలానికి పురమందిరానికి ఆనుకొని ఉన్న స్థలాన్ని కొని, ఆయన రెండు అంతస్థులతో ఉన్న ప్రార్థనా మందిరాన్ని నిర్మించాడు. ఇందుకు కూడా చాలా వరకు స్వధనాన్నే వినియోగించాడు. అయినా చందాల మూలంగా వచ్చిన ధనం కూడా దీంతో చేరి ఉన్నది. ఈ మందిరంలో క్రింది అంతస్థు గ్రంథాలయంగాను, పై అంతస్థు ప్రార్థనల కొరకు ఉపయోగించబడాలని నిర్దేశించాడు. ఆ రోజుల్లో దాని నిర్మాణానికి పదిహేను నూర్ల రూపాయల ఖర్చైంది. ఇది 1897లో వీరేశలింగానికి అనుంగుమిత్రుడు, ఆత్మీయుడు, పరమవిశుద్ధుడు అయిన రఘుపతి వెంకటరత్నం నాయుడిగారి చేత ప్రారంభించబడింది. అప్పటికే ప్రారంభించబడిన హితకారిణీ సమాజం వారికి ఈ ప్రార్థనా మందిరం నిర్వహణ

అప్పగించబడింది. అన్ని మతాల వారి ప్రార్థనలకు దీనిని వినియోగించాలని సర్వ మానవ సౌభ్రాతృత్వాన్ని నెలకొల్పేటట్లుగా ఆ ప్రార్థనలుండాలని వీరేశలింగం నిర్దేశించాడు.

ఆయన భార్య రాజ్యలక్ష్మమ్మ ఈ ప్రార్థనా సమాజ భవనంలో మహిళా సమాజాన్ని ప్రారంభింపచేసింది. స్త్రీలకు ప్రత్యేకంగా ప్రార్థనలు, సమావేశాలు ఇక్కడే నిర్వహించేవారు. ఆ రోజులలో మద్రాసు రాష్ట్రం మొత్తంలోనూ, స్త్రీలకు ప్రత్యేకంగా ప్రార్థనా సమాజం వేరెక్కడా లేదు. వీరేశలింగం మద్రాసులో నివాసం ఉన్నప్పుడు, ఆయన భార్య మరణించిన తరువాత కూడా ఈ ప్రార్థనా సమాజం తన కార్యక్రమాలను నిర్వహిస్తూనే ఉన్నది.

అప్పటి నుంచి సర్వజనులకు ఉపయోగపడే ఉపన్యాస సభా భవనం ఒకటి పట్టణంలో ఉంటే బాగుంటుంది గదా అని వీరేశలింగం భావించాడు. దానితో 1890వ సంవత్సరం అక్టోబరులో పురమందిరం పూర్తై ఉపయోగానికి సిద్ధమైంది. పుర మందిర నిర్మాణానికి ఏడువేల రూపాయలు ఖర్చైంది. దీని విస్తీర్ణం 1720 చ.గజాలు. 1890 అక్టోబరు 23వ తేదీన చెన్నపురి ప్రెసిడెన్సీ కాలేజీ సంస్కృతోపన్యాసకులు రంగాచార్యులు దీనిని ప్రారంభించారు. ఈ రంగాచార్యులవారికే ఆంగ్ల ప్రభుత్వము వారు 1860లో తొట్టతొలిగా మద్రాసు రాజధానిలో 'రావుబహద్దర్' బిరుదాన్ని ఇచ్చారు. పురమందిర నిర్మాణానికి వీరేశలింగం చేసిన అప్పులు 1896కు గానీ తీరిపోలేదు. 1889 నవంబర్‌లో పండిత శివనాథశాస్త్రి ఈ పురమందిరంలోనే కొన్ని ఉపన్యాసాలిచ్చాడు. ఋణాలన్నీ తీరిపోగానేపురమందిరానికి ధర్మకర్తల(Trustees)లను ఏర్పరచి నిక్షేపపత్రాన్ని (Trustdeed) వ్రాసి లేఖ్యారూఢం (Register) చేయించి, ధర్మకర్తలకు అప్పగించిన తరువాత ఆయన మద్రాసుకు తన మకాం మార్చుకొన్నారు.

ఆయన వ్రాసిన నిక్షేప పత్రంలో ఏయే భాగాలు గ్రంథాలయానికి, ప్రార్థనా సమాజానికి, బిలియర్డ్స్‌కు ఉపయోగించాలో నిర్దేశించాడు. ఎప్పుడైనా ఏకేశ్వర మానసికోపాసనముగల పరిశుద్ధాస్తిక సమాజాలకే (అంటే అవతారాదుల అర్చన, విగ్రహారాధనలేని) ఆ పురమందిరం ఉపయోగపడాలని నిర్దేశించాడు. మతవర్ణాచారాల పట్ల మూఢ విశ్వాసాలు నశించిపోయే విధంగా నీతిని పెంపొందించే ఉపన్యాసాలకే పురమందిరం ఉపయోగపడాలని భావించాడు. హిందువు, క్రైస్తవ, మహమ్మదీయ మొదలైన మతాలు, బ్రాహ్మణ శూద్ర అనే వర్ణ భేద భావం లేకుండా దేశ, భాషాభివృద్ధికి పాటుపడే కార్యక్రమాలు, మహనీయులను సత్కరించే కార్యక్రమాలకు, అన్ని జాతలు వారు సభలు జరుపుకోటానికి జ్ఞానాభివృద్ధి కలగటానికి, మూఢవిశ్వాసాలు తొలగించే కార్యక్రమాల నిర్వహణకు ఈ పురమందిరం ఉపయోగపడాలని ఆయన నిక్షేపపత్రంలో నిర్దేశించాడు.

వేశ్యలు వేసే నాటకాలు, వేశ్యల ఆటపాటలు, విగ్రహారాధనకు సంబంధించిన భజనలు, పూజలు ఇందులో జరగకూడదని చెప్పాడు. పురమందిరంలో మహనీయులు, మంచి పనులు చేసినవారు, సద్వర్తనం కలిగిన వారి పటములను నుంచవచ్చును. స్వలాభం కోసం ఆడే నాటకాలకు అవి ఎలాంటివైనా ఈ మందిరాన్ని ఇవ్వకూడదని నిర్దేశించాడు. ప్రజల ఉపయోగం కోసం రెండు నెలలకు ఒకసారైనా ఒక ఉపన్యాసం ఏర్పాటు చేయాలని ఆయన కోరాడు.

ఈ పురమందిర ట్రస్టీలు కనీసం పట్టభద్ర విద్యార్హత ఉన్నవారే ఉండాలని నిర్దేశించాడు. అంతేగాక ట్రస్టీలలో ఒక క్రైస్తవ, ఒక మహమ్మదీయ, ఒక వైశ్య, ఒక శూద్ర సభ్యుడైనా ఉండాలని నిర్దేశించాడు. ఇంత సహృదయతతో, విశాల దృష్టితో వీరేశలింగం ఈ పురమందిరోపయోగాన్ని నిర్దేశించాడు.

వీరేశలింగం గారి విద్యార్థులు ప్రార్థనా సమాజ కార్యాలలోనూ శ్రద్ధాభక్తులు ప్రదర్శించి బీదలకు అన్నదానం చేయటం మొదలైన సత్కార్యాలను చేస్తుండేవారు. విద్యార్థులు ఇన్నీసు పేటలో ఒక బాలికాపాఠశాలను సహితం స్థాపించాలనుకొన్నారు. అయితే తగిన ధనం సమకూరనందున వీరేశలింగమే వారి పక్షం వహించి మిత్రులచేత చందాలు వేయించి ఇన్నీసుపేటలో 1881లో బాలికా పాఠశాల స్థాపించాడు. ప్రభుత్వం వారి తరఫున దానికి ధన సహాయం చేయించాడు. ఈ విధంగా ఆస్తిక పాఠశాల, ఇన్నీసుపేట బాలికా పాఠశాలల ప్రారంభానికి ప్రోత్సాహకుడు వీరేశలింగమే.

మద్రాసు వెళ్ళిన తరువాత ఆయనను సంఘ సంస్కరణ సమాజానికీ, దక్షిణ భారత బ్రాహ్మసమాజానికి అధ్యక్షులుగా ఎన్నుకొన్నారు. ఆ రెండు సమాజాలను నడపటానికి కార్యక్షేత్రం అవసరమై తన స్వంత ధనంతో ఆయన మద్రాసులో ఒక చిన్న యింటిని కొన్నాడు. ప్రెస్సు కూడా నడుపుతున్న స్వంత యింటిలోనే, ఎగ్మూరు బాలికాపాఠశాలలో చదువుకొంటున్న బాల వితంతువులకు ఆశ్రయం కూడా ఆ గృహంలోనే కల్పించాడు. తను నివసించే ఇంటి నుంచి శరణాలయం చాలా దూరంగా ఉన్నందువలన ఆయన చాలా చిక్కులు ఎదుర్కొన్నాడు. దాని నిర్వహణకు తగిన ధన సహాయం రాలేదు. అందుకు తన స్వంత ధనంతో చెన్నపురిలో వితంతు శరణాలయాన్ని సంఘ సంస్కార సమాజ మందిరాన్ని నిర్మింపచేశాడు. ఈ వితంతు శరణాలయం హిందూదేశ చక్రవర్తిణి విక్టోరియా మహారాణి పేరున స్థాపన జరిగింది. ఇక్కడ ఉన్న వితంతువులను ఉపాధ్యాయినీ బోధనాభ్యసన పాఠశాలకు పంపేవారు. దీనికోసం పన్నెండు వందల రూపాయలు వెచ్చించి పరశువాకం గంగాధరేశ్వరుని కోవెల వీథిలో భవనం నిర్మింపచేశాడు. ఆయన మద్రాసు

నుంచి రాజమహేంద్రవరానికి రాగానే ఈ వితంతు శరణాలయం కూడా ఆయన వెంటే రాజమండ్రి చేరింది.

1907వ సంవత్సరంలో ఆయన భార్యతో కలసి బెంగుళూరు వెళ్లాడు. అక్కడ ఆరుళపేటలో చేనేత కార్మికులైన బ్రాహ్మసామాజికులు ఉపాసన కొరకు తగిన వసతి లేక బాధపడుతుండటం చూసి, వారి నిజమైన భక్తిని చూచి, వారికి ప్రార్థన కొరకు వసతి కల్పించాలని నిర్ణయించుకొన్నాడు. తిరిగి 1908వ సంవత్సరంలో అక్కడ ఒక యింటిని కొని ప్రాతయిల్లు పడగొట్టించి 1500 రూపాయలు ఖర్చుపెట్టి ప్రార్థనా మందిరాన్ని నిర్మించి యిచ్చాడు.

ఆయన సంఘసంస్కరణ కార్యక్రమాలు మొదలుపెట్టినప్పటి నుంచి, నిస్సహాయ స్థితి నుంచి స్త్రీలను పైకి తీసుకుని రావాలనే కోరిక బలంగా ఉండేది. ఇది విద్య ద్వారానే సాధ్యం. అప్పటికీ ఆయన 1874లో ధవళేశ్వరంలో బాలికా పాఠశాల, 1881లో రాజ మహేంద్రవరంలో ఇన్నీసుపేటలో బాలికాపాఠశాల ప్రారంభానికి చేయగలిగినంతా చేశాడు. ఆయన వితంతు వివాహాలు 1881లో మొదలు పెట్టినప్పటి నుంచి, వితంతువులను తన యింటిలోనే ఉంచుకొని వారికి విద్యాబుద్ధులు నేర్పించటానికి అయ్యే సమస్త ఖర్చును భరించి వివాహమయ్యేంత వరకు వారి నిర్వహణ భారాన్ని వహించేవాడు.

మద్రాసు నుంచి తిరిగి వచ్చిన తరువాత 1905వ సంవత్సరంలో విక్టోరియా బాలికా పాఠశాల అనే పేరుతో రాజమహేంద్రవరంలో పాఠశాల మొదలుపెట్టాడు. సత్యవాది అనే ఇంగ్లీషు, తెలుగులోనూ వెలువడే పత్రికను స్త్రీల కోసమే నడిపాడు. ఈ స్త్రీల పాఠశాలకు అవసరమయ్యే ముగ్గురు ఉపాధ్యాయులను నియమించి పాఠశాల నిర్వహణ కయ్యే ఖర్చునంతటిని తాను భరించాడు. తన ఇంటినే పాఠశాల భవనంగా మార్చి యిచ్చాడు. ఆయన గృహమే ఒక వితంతు శరణాలయంగా ఉండేది. వితంతువులకు విద్య నేర్పించడానికి అవసరమయ్యే పాఠశాలగానే ఆయన విక్టోరియా బాలికా పాఠశాలను ప్రారంభించాడు.

స్త్రీలకు వివాహం చేసుకోటంలో స్వాతంత్ర్యమే కాకుండా విద్యకూడా అభ్యసించ గలిగినప్పుడే వారి అభివృద్ధి కలుగుతుందని ఆయనకు గట్టి నమ్మకం. ఆయన వితంతువులను వివాహం చేసుకోటానికి సిద్ధపడే వరులను అన్వేషిస్తుండేవాడు. వధువు, వరుడు మాట్లాడుకొని, ఇద్దరు అంగీకరించినా, అతడు ఆమెను చక్కగా గౌరవించ గలడనుకొన్నప్పుడే వారికి తాను వివాహం జరిపించేవాడు. చాలా సందర్భాలలో వధువు, వరుడి తరఫు పెద్దల అంగీకారంతోనే ఈ వివాహాలు జరిగేవి. సంఘంలో ఈ వివాహాలు

త్వరగా ప్రాచుర్యం పొందాలంటే కేవలం తన యింటిలోనే గాకుండా ఇతర స్థలాల్లో కూడా జరగాలని ఆయన ఆశించేవాడు. అలాగే కొన్ని వివాహాలను ఆయన తన శ్రేయోభిలాషుల ఇళ్లలో జరిపించాడు. వితంతు శరణాలయంలో వితంతువులు కానివారిని కూడా విద్య కొరకు చేర్చుకొనవచ్చని భావించాడాయన. ఇలా వితంతు శరణాలయం అనాథశరణాలయములను స్థాపించి, నిర్వహించి వారికి ఒక స్థాయి కల్పించ గలిగాడాయన.

వీరేశలింగం ఆస్తిక పాఠశాలను స్థాపించాలని చెన్నపట్టణానికి వెళ్లకముందే అనుకొన్నాడు గాని అది అప్పటిలో కుదరలేదు. ఒకసారి ప్రారంభించిన దానిని ఏలూరి లక్ష్మీ నరసింహం దారి తప్పించాడు. అందువలన ఆయనకు ఆ కోరిక బలంగా నిలిచి పోయింది. అప్పటికే రాజమహేంద్రవరంలో చిలకమర్తి లక్ష్మీనరసింహం ఒక మాధ్యమిక పాఠశాలను ప్రారంభించి కొన్ని సంవత్సరాల నుంచి నడుపుతున్నాడు. వీరేశలింగం ఆయనను ఆ పాఠశాలను తనకిమ్మని కోరగా వెంటనే చిలకమర్తి లక్ష్మీనరసింహం అంగీకరించి అప్పగించాడు.

1911వ సంవత్సరం నవంబర్ 27వ తేదీ ఈ పాఠశాల గృహప్రవేశం జరిగింది. దీనికి సూర్యారావు బహద్దరు వారి పేరును పెట్టటానికి వీరేశలింగం ప్రయత్నం చేశాడు. కానీ, విద్యావిచారణాధికారికి పిఠాపురం రాజావారు ప్రత్యేకంగా వ్రాయించి గృహప్రవేశ సమయంలో వీరేశలింగ ఆస్తిక పాఠశాల అనే పేరు మార్చేటట్లు ఉత్తర్వులను తెప్పించాడు. ఈ పాఠశాల పేరుకు తగినట్లు సర్వమత ప్రార్థనతోను, మిగిలిన ఆస్తిక భావనలతోను విలసిల్లినది. ఈ పాఠశాల ఈనాటికీ కొనసాగుతున్నది.

1906వ సంవత్సరం డిసెంబర్ నెలలో వీరేశలింగం తన మిత్రులను తన అభిప్రాయాలపై సమభావం, గౌరవం ఉన్నవారిని సమావేశపరచి ఆయన తలపెట్టిన, చేసిన కార్యక్రమాలన్నింటిని కొనసాగించటానికి ఒక సమాజాన్ని స్థాపిస్తే మంచిదని భావించాడు. ఇందుకు కారణం అప్పటికాయనకు దాదాపు అరవై సంవత్సరాల వయస్సు వస్తున్నది. పైగా తన ఆరోగ్యాన్ని గురించి ఎప్పుడూ ఆయనకు శంకే. తాను ఉద్యోగం నుంచి విశ్రాంతి పొంది ఉండడం కూడా ఒక కారణం. ఈ సంఘానికి ఆయన హితకారిణీ సమాజం అని పేరు పెట్టాడు. తనకు ఉన్న స్థిర చర ఆస్తులు దాదాపు యాభైవేల రూపాయల విలువైన వానిని ఆయన ఈ హితకారిణీ సమాజానికి అప్పగించాడు. 1908లో ఈ సమాజాన్ని రిజిష్టర్ చేయించి మొత్తం కార్యభారాన్ని సమాజానికి అప్పగించాడు. తన జీవిత కాలం ఈ సొత్తు తన ఆధీనంలోనే ఉండాలని రిజిష్టర్డ్ డీడ్ వ్రాయించాడు. హితకారిణీ సమాజం ఈనాటికీ ఆయన స్థాపించిన సంస్థల బాగోగులను చూస్తున్నది.

తన సమస్త శక్తియుక్తులు వినియోగించి సంఘ శ్రేయస్సునుకోరి చేసిన కార్యకలాపాలన్నింటికి శాశ్వతమైన సంస్థారూపం కలిగించాలని ఆయనకు కోరిక పుట్టిది. పౌరుల సభలో ఏర్పాటు చేయబడిన పౌర ప్రతినిధులతో కూడిన కార్యనిర్వాహక వర్గం యాజమాన్యాన ఆ సంస్థ పని చేయాలని ఆయన ఆశించాడు. ఈ హితకారిణీ సమాజం నిర్వహణ క్రిందకు తేబడిన మూడు ప్రధాన సంస్థలు. వీరేశలింగం బాలుర ఆస్తికోన్నత పాఠశాల, వితంతు శరణాలయం, బాలికల లోయర్ సెకండరీ స్కూలు. ఇంకొకటి రాజమహేంద్రవర పుర మందిరం.

ఇలా ఆయన తాను స్థాపించిన సంస్థలను మధ్యలో వదలివేయకుండా, కలకాలం కొనసాగేటట్లుగా ఎంతో ముందుచూపుతో ఏర్పాట్లు చేశాడు.

# మనిషిగా - మనీషిగా

ఆయన ఏకసంథాగ్రాహి. అందువలన ఆంగ్లవిద్యను కూడా క్షుణ్ణంగా అభ్యసించాడు. ఆ భాషా సాహిత్యాలలో ఉన్న మేలు కీళ్ళను గ్రహించగలిగాడు. అందుకే మేలుగా ఉన్న విషయాలను ఆయనకు అనుకూలంగా మలచుకొని మన భాషలోనికి వాటిని అనువర్తితం చేయగలిగాడు. రాబోయే ఇరవయ్యోవ శతాబ్దిని కూడా తన ప్రభావంతో ముంచెత్తాడు. పందొమ్మిది యిరవై శతాబ్దాలు సాహిత్య చరిత్రలో వీరేశలింగం యుగంగా గుర్తించేటట్లు ప్రభావం నెరిపాడు. పందొమ్మిదవ శతాబ్దం ఉత్తరార్థం, యిరవైయవ శతాబ్దం పూర్వార్థం మన సాహిత్య చరిత్రోల 'నభూతో నభవిష్యతి'. అందుకే ఆకాలం యధార్థంగా వీరేశలింగ యుగమే. నవ్యాంధ్ర సాహిత్య వికాసానికి సాహిత్యపరంగానేగాకుండా సామాజిక పరంగా కూడా సుస్థిర నేపథ్యాన్ని కూర్చినట్టివి ఆయన రచనలు.

అసలు భాషయొక్క ప్రయోజనమేమి? అని తనను తాను ప్రశ్నించుకొని, వాటికి సమాధానాలను తానే చెప్పుకోగలిగాడు. అంతిమంగా తను ఎన్నుకొన్న మార్గం సరికాదని భావించాడు. తమ భావాలను దూరంలో ఉన్నవారికి రాబోయే తరాల వారికి సులభంగా తెలపడమే భాష యొక్క ప్రథమ కర్తవ్యం. అలాంటప్పుడు విగ్రహతంత్ర రచన వంటి రచనా విధానం వల్ల మేలు ఏమి ఉన్నది? అని ప్రశ్నించుకొని గ్రంథాలు ఎలా ఉండాలి? అనే ప్రశ్నకు అందరికి తెలియునట్లు సులభంగా ఉండవలెను అని జవాబిచ్చుకొని తాను యిక ముందు వ్రాసే పుస్తకాలన్నింటిని సుగమములుగా ఉండేటట్లు వ్రాయాలని నిర్ణయం చేసుకొన్నాడు. జీవితాంతం దానినే పాటించాడు. తన రచనలు ప్రజాయత్తం కావాలని ఆశించి, ఆ విధంగానే రచనలు చేశాడు.

ఇలా వీరేశలింగం ఒక అభిప్రాయానికి బద్ధుడు గాక తగిన హేతువులుంటే వానిని గ్రహించి తన అభిప్రాయం మార్చుకొనటానికి ఎప్పుడూ సిద్ధమే. అందువలననే మత విషయాలలో కూడా ఆయన తనకు మొదటిలో ఉన్న పరమ ఛాందస ప్రవృత్తి వదలివేసి క్రమంగా ఏకేశ్వరోపాసియై, అనుష్ఠానిక బ్రహ్మ మతస్థుడై యజ్ఞోపవీతాన్ని త్యజించి వర్ణశాఖల పట్టింపు లేనివాడై, సంస్కార భోజనాలు చేసి విశ్వమానవుడు కాగలిగాడు.

సాహిత్య ప్రయోజనము విశ్వశ్రేయము. అందుకుగాను ఆయన సాహిత్యాన్ని సాధనంగా చేసుకొన్నాడు. మొదటి పాండిత్య ప్రకర్షా ప్రదర్శనానికి శుద్ధాంధ్ర నిరోష్ఠ్య నిర్వచన నైషధం లాంటి గ్రంథాలను రచించినా, పండితైకవేద్యం చేసినా, సాహిత్య ప్రయోజనాన్ని గుర్తించిన తరువాత దానిని సంఘంలోని దురాచారాలను విమర్శించి, ప్రజలకు వారలవాటు పడిన విషయాలలో చెడ్డను యెత్తి చూపటానికి ఉపయోగించిన మహానుభావుడు. సాహిత్య పరమ ప్రయోజనాలలో ఒకటైన ఉపదేశాన్ని ఆయన గ్రంథాలలో మనం పూర్తిగా చూడగలం.

వీరేశలింగం జన్మించిన కాలంలోను, అటు తరువాత దేశం నైతికంగా పూర్తిగా పతనమై ఉన్నది. దురాచారాలకు లెక్కేలేదు. అతి బాల్య వివాహాలు, అతి వృద్ధ వివాహాలు, కన్యాశుల్క గ్రహణం, లంచగొండితనం. వేశ్యాలంపటత్వం, భూతప్రేత పిశాచాల మీద, జాతకాలు, ముహూర్తాల మీద పిచ్చి నమ్మకాలు ఇలా ఎన్నో మొదట్లో వీరేశలింగంపై వీటి ప్రభావం ఉన్నా క్రమంగా అవగాహనా పరిధి పెరిగేకొద్దీ ఆయన దృష్టి విశాలమైంది. స్త్రీల విషయంలో ఆనాడు సంఘంలో ప్రబలి ఉన్న దురాచారాలు ఇన్నీ, అన్నీ అని చెప్పే వీలు లేదు. వీటినన్నింటిని సమూలచ్ఛేదం చేయటానికి ఆయన బద్ధకంకణం కట్టుకొన్నాడు.

వీరేశలింగానికి అత్మప్రత్యయం (ఆత్మగౌరవం) మెండు. చాలా చిన్న వయసులో ధవళేశ్వరంలో ప్రధానోపాధ్యాయునిగా ఉన్నప్పుడు పాఠశాలల విచారణాధికారియగు దొర ఒక పిల్లవానిని ఒక గణితశాస్త్ర సమస్యను సాధించమనగా అతడు చేయలేకపోగా, దొర ప్రధానోపాధ్యాయుడైన వీరేశలింగాన్ని సాధించమని చెప్పగా ఆయన ఆ పని సహాయో పాధ్యాయునిదిగానీ నాది కాదని చెప్పి నిరాకరించాడు. దొర ఆ విషయాన్ని తన దినచర్య పుస్తకంలో వ్రాసుకొన్నాడు. అయితే ఆయన జంకలేదు. అదే విధంగా ఉపాధ్యాయులకు ఉత్తర్వులిచ్చేటప్పుడు ప్రధానోపాధ్యాయునితో సహా అందరు ఉపాధ్యాయులు నిలబడి ఉండగా దొర కూర్చొనటం ఆచారమైనా, తాను ఒక కుర్చీ తెప్పించుకొని వేసుకొని దొన ప్రక్కనే కూర్చొని తన స్వాభిమానాన్ని చాటుకొన్నాడు. ఈ ఆత్మగౌరవ భావం ఆయనలో క్రమంగా వృద్ధి పొందింది. అందుకే అనేకులతో రకరకాల న్యాయస్థాన వ్యాజ్యములలో చిక్కుకొన్నా ఆయన రాజీకి అంగీకరించేవాడు కాదు. ఇందుకు ఆయన జీవితంలో ఎన్నో ఉదాహరణలున్నాయి.

“విద్యలేని మూఢులు చాలా మంది చేరి చేసేదానికంటే విద్యాధికుడు ఒక్కడైనను చేసే హాని నూరు రెట్లు ఎక్కువగా ఉంటుంది. మన దేశంలో యాచ్నావృత్తి హేయంగా యెంచబడకుండా ఉండటం, పాటుపడక కూర్చుండడం గొప్ప అని తలచడం, చిరకాల గతాచారాలుగా ఉంటున్నాయి. కాయకష్టపడక, నిరుద్యోగంగా కూర్చుండి, స్వోదర పోషణార్థం యితరులను వేడి ధనార్జన చేయడం చాలా హేయమైనదని ఎవరూ గమనించ లేకుండా ఉన్నారు. అందువల్ల ప్రతివారు ధనాకర్షణకు వీలైన ఉపాయంతోనైనా సాధ్యమైనంత డబ్బు లాగటానికే ప్రయత్నం చేస్తున్నారు. వికలాంగులు కాకుండా అవయవ పటుత్వం ఉన్నవారందరూ పాటు పడవలసిన వారే”నని, “పాటు పడడం యిష్టం లేనివారికి ధనదానం చేసి సోమరితనాన్ని ప్రోత్సాహపఱచటం పాప”మని ఆయన మతం. ఆయన పాటుపడతాడు. ఇతరులు అలా పాటుపడవలసిన వారే అని ఆయన ప్రగాఢ నమ్మకం.

తాను నమ్మిన విషయాలను అనుసరించడం ఆయన నియమం. అలా చేయని వారంటే ఆయనకు పరమద్వేషం. నెయ్యం కంటే న్యాయం ఆయనకు ప్రియమైనది. న్యాయానికి గురువుతోనైనా గ్రుద్దులాడవలసిందే అనేదే ఆయనకు అనుసరణీయ న్యాయం. వీరేశలింగం నాల్గవ తరగతి చదువుతున్నప్పుడు ఆత్మూరి లక్ష్మీ నరసింహముగారు ఆయనకు గురువు. అటు తరువాత లక్ష్మీనరసింహం ఉపాధ్యాయ వృత్తిమాని, న్యాయాధి పతిగా వివిధ ప్రాంతాలలో పనిచేసినప్పుడు కూడా ఆయనకు ఈయనకు, చక్కని మైత్రి సాగేది. అటు పిమ్మట ఆయన రాజమహేంద్రవరం వచ్చాడు. అప్పుడు కూడా ఆయన వీరేశలింగం చేసే స్త్రీ పునర్వివాహ దీక్షలోనూ, ఇతర విషయాలలోనూ ఎన్నో విధాలుగా సహాయపడుతుండేవాడు.

వారిద్దరికి కొంత వివాదం వచ్చి కొంతకాలం సాగింది. తరువాత మిత్రుల జోక్యంతో వివాదం ఇంతటితో సమసిపోయింది. అటు తర్వాత వీరేశలింగాన్ని ఏమీ చేయలేక వితంతు వివాహం చేసుకొన్న వారికి ఇవ్వవలసిన పైడా రామకృష్ణయ్యగారి ధనాన్ని దుర్వినియోగం చేసి వీరేశలింగాన్ని సాధించానని లక్ష్మీనరసింహం తృప్తిపడ్డాడు. ఇలా వీరేశలింగం న్యాయం కోసం గురువుతోనే గ్రుద్దులాడాడు.

అసత్యం చెప్పటం ఆయనకు ఏ మాత్రం ఇష్టం ఉండని పని. స్వీయచరిత్రలో ఒకసారి తాను ఆడిన అబద్ధాన్ని గురించి తెలిపి చాలా పశ్చాత్తాప పడ్డాడు. ఇరవై రూపాయల జీతం కలిగిన ప్రభుత్వోద్యోగార్హత కలిగించే సామాన్య పరీక్షకు ఆయన కూర్చొనవలసి వచ్చింది. సర్వకళాశాల ప్రవేశ పరీక్షలో కృతార్థులైతేగాని ఈ పరీక్షలో కూర్చోటానికి అర్హత ఉండదు. అప్పుడు ఆ పరీక్షకు ఉన్న ప్రశ్నాపత్రాలను చూచినప్పుడు ఆయనకు చాలా తేలిక అనిపించింది. పద్దెనిమిది సంవత్సరాల వయసు దాటినవారుగాని, ఆ పరీక్షకు

కూర్చొనకూడదు. ఆయనకు పద్దెనిమిది సంవత్సరాలు నిండలేదు. ఆ విషయం ఆయనకు తెలుసు. అందుకే తాను శీఘ్రంగా పరీక్షాసిద్ధుడు కావాలనే కోరికతో తన వయస్సు పందొమ్మిది సంవత్సరాలనీ, మశూచి బారిన పడ్డాడని నిర్ణయపత్రం ఇచ్చాడు. ఆ పరీక్షలో ఉత్తర సర్కారుల మొత్తానికి ఆయన రెండవవాడుగా నిలిచి కృతార్థుడైనా, ఈ అబద్ధం ఆయనను చాలా బాధించింది. చాలాసార్లు పశ్చాత్తాపపడ్డాడు. అప్పటిలో కొన్ని విషయాలలో అబద్ధమాడవచ్చని గాయత్రీ మంత జపాదుల వలన, బహువార పురాణ పఠనాదుల వలన ఈ పాపం పోగొట్టుకోవచ్చని ఆయనకు అనిపించేది. అయితే ఇది చాలా తప్పని ఆయనకు తరువాత కలిగిన భావం.

అందుకే "ఇట్టి దురాచారాలను పిన్నవారు ఆత్మానంద వినాశకములైన మహా విషయమువలె పరిత్యజించి అసత్యాన్ని జిహ్వాగ్రం మీదకురానీయకూడ"దని అంటారాయన. దీనిని జీవితాంతం నిలబెట్టుకొన్నారు. 'న అనృతాత్ పాతకం పరం'- అసత్యం కంటే మించిన పాపము లేదని ఆయన పరమ విశ్వాసం. చివరి వరకు దానినే పాటించాడు. స్వీయ చరిత్రలో తాను చేసిన ఎన్నో విషయాలను తెలుపుతూ ప్రతి విషయానికి ఆధారాలైన విషయాలను ప్రదర్శించారాయన. సాధారణంగా శాంత స్వభావం కలవాడే అయినా న్యాయ విషయంలో ఆగ్రహం కలిగిందంటే ఆయన ఉద్రేకానికి, పట్టుదలకు పరిమితులే ఉండవు. అప్పుడాయన గురువని, బంధువుడని, స్నేహితుడని ఎవరినీ లెక్కపెట్టేది లేదు.

మొదట్లో దయ్యాల మీద నమ్మకం ఉన్నా, విజ్ఞాన వీచికలు తన మనస్సులో వీయగానే ఆయన దయ్యాలను చూడాలనుకొన్నాడు. తగిన హేతువు లేకుండా ఒక విషయాన్ని నమ్మడం ఆయనకు గిట్టని విషయం. దయ్యాలను ప్రత్యక్షంగా చూడాలని మంత్ర మహిమ వలన దయ్యాలు వదలిపోతాయని భావించి, రామ మంత్రాన్ని ఉపదేశం పొంది, దయ్యాలు పట్టిన వాళ్ళ యిండ్లకు పోతూ భూత వైద్యులు చేసే మంత్రతంత్రాలను చూస్తూ మంత్రవేత్తలను ఆశ్రయించేవాడు. ఎంతోమంది భూతవైద్యులను వేడుకొని ఒక్క భూతాన్ని అయినా చూపండని ప్రార్థించినా, వారెవ్వరూ ఆ పని చేయలేకపోయారు. ఒక భూత వైద్యుడు ఊరి చివర మర్రిచెట్టు వరకు తీసుకొని వెళ్ళి, యేవేవో కుంటిసాకులు చెప్పి ఆయనకు భూతాన్ని చూపనేలేదు. అయితే తాను ప్రత్యక్షంగా స్వయంగా చూడాలనే కోరికతో రాత్రిళ్ళు యెవరికి చెప్పకుండా శ్మశాన భూములకు వెళ్ళి అవి కనిపించక తిరిగి వచ్చేవాడు.

ఉత్తమోపాధ్యాయుడైన ఆయన విద్యార్థుల అందరిమీద సమభావాన్నే చూపేవాడు. బాలురను నీతివర్తనంలో ప్రోత్సహిస్తూ ఎవరి విషయంలోనూ పక్షపాతం చూపేవాడు కాదు. 1871వ సంవత్సరంలో వేపాకృష్ణమూర్తి అనే విద్యార్థి కొంత అవిధేయత కనబరచగా

వీరేశలింగం తక్షణం ఆయనను మందలించి బల్లపై ఎక్కించి నిలబెట్టాడు. కృష్ణమూర్తి అన్న రామమూర్తి ఆ పాఠశాలలో ద్వితీయోపాధ్యాయుడు. అందువలన కొందరు ఉపాధ్యాయులు కృష్ణమూర్తి అల్లరి చేసినా, చూసీ చూడనట్లు ఊరకుండేవారు. వీరేశలింగం అందరిని పక్షపాతం లేకుండా సమానంగా చూస్తాడు కాబట్టి అతనిని శిక్షించాడు. అందుకు రామమూర్తి పంతులు వీరేశలింగంపై కోపించక, తన తమ్ముడైనా మొహమాటం లేకుండా స్వకృత్యాన్ని చేసినందుకు అభినందించాడు. చాలా కాలం తరువాత వేపాకృష్ణమూర్తి వీరేశలింగాన్ని ఈ విషయమై అభినందిస్తూ లేఖను వ్రాశాడు.

సేవక వృత్తి లేకుండా స్వతంత్రుడిగా ఉండాలనేది ఆయన సంపూర్ణ ఆకాంక్ష. అందువలననే, అనేక పరీక్షలు యిచ్చి ఉపకరగ్రాహి కాగలిగిన అర్హతను సంపాదించినా, లంచగొండులు, వేశ్యాలంపటులు, అధికార మదాంధులుగా మెలిగే అవకాశాలున్న ప్రభుత్వోద్యోగాన్ని చేయకూడదనుకొని నిర్ణయాలు తీసుకొన్నాడు. న్యాయసభలో కొలువు కూడా అటువంటిదే కాబట్టి వాటి జోలికి పోకూడదనుకొన్నాడు. స్వతంత్రుడుగా ఉండటానికి న్యాయవాదియై పని చేయాలని కోరిక ఉండేది. అందుకు అవసరమైన పరీక్షలకు చదవాలనుకొన్నాడు. బాల్యమిత్రుడు చల్లపల్లి బాపయ్యతో కలిసి దండశాస నోన్నత పరీక్ష (Criminal Higher Grade) ను ఇద్దరూ వ్రాసి ఉత్తీర్ణులైనారు. కానీ కొందరు న్యాయవాది మిత్రులు న్యాయవాద వృత్తిలోనూ స్వతంత్రత ఉండదనీ, న్యాయముగా ఉండి ఆ వృత్తిలో ధనము సంపాదించటం దుర్లభమని సలహా ఇవ్వటంతో అంతటితో ఆ ప్రయత్నాన్ని విరమించాడు. పాపకార్యాలకు అంతగా అవకాశం లేని ఉపాధ్యాయత్వం నిర్వహించాలనుకొన్నాడు.

వీరేశలింగానికి మూఢ నమ్మకాలు క్రమంగా సడలిపోయాయి. మొదట్లో మంత్రాలు, మహిమల మీద ఎంత నమ్మకం ఉండేదో యిప్పుడంత విశ్వాసం సడలిపోయింది. అందుకే ఆయన తన యింటి దొడ్డిలో నున్న అరటి చెట్టొకటి ఏ హేతువు చేతనో కొన నుంచి గెల వేయక నడుమ నుంచి చీల్చుకొని పువ్వు పైకి వచ్చి గెల వేసింది. ఈ విధంగా చెట్టు మధ్య నుండి వచ్చి గెల వేయటం అరిష్ట సూచకమని వెంటనే ఆ చెట్టును కొట్టివేయ వలసినదని యిరుగుపొరుగువారు, దైవజ్ఞులు, బంధువులు కూడా ఆయనతో బహు విధాల చెప్పారు. ఆయన వారి మాటలు వినలేదు. ఆ చెట్టును అలాగే ఉంచివేశాడు. మొదటో జనం అంతా గుంపులు గుంపులుగా వచ్చి చెట్టును చూచి పోతుండేవారు. కొన్ని నెలలకు కాయలు యెదిగి వచ్చాయి. అప్పుడు కాయలతో కూర వండుకొని దూట కోసం చెట్టును నరికించాడు.

అదే విధంగా ఆయన యింటి లోపల దూలం కొసన ఉన్న ఖాళీలో తేనెపట్టు పట్టింది. ఇంటిలో తేనెపట్టు పట్టగూడదని, అలా పట్టటం అరిష్ట సూచకమని, దానిని తీసివేయించి దోషపరిహారార్థంగా బ్రాహ్మణుల చేత శాంతి కర్మ చేయించాలని అందరూ బోధ చేశారు. తల్లి, తాతతల్లి కూడా చెప్పి చూశారు. కానీ ఆయన చలించలేదు. దానిని ఆ విధంగానే ఉంచివేశాడు. ఆయనకు కోరంగిలో ప్రధానోపాధ్యాయుని ఉద్యోగం వచ్చింది. ఆ పనిలో మొదటిసారిగా చేరటానికి వెళ్ళేటప్పుడు మంచి దినం చూచి మంచి ముహూర్తం పెట్టుకొని వెళ్ళమని ఇంట్లోని వారు, ఇతరులు చాలా బలవంతం చేశారుగాని, ఆయన వాటిని అన్నింటిని లెక్క చేయకుండా అమావాస్యనాడు బయలుదేరి పోయి పనిలో ప్రవేశించాడు. ఎవరో అమావాస్యనాడు ఎందుకు బయలుదేర వచ్చావని ప్రశ్నించగా ఆయన 'ఈశ్వరుడు చేసిన దినాలన్నీ సమానంగానే మంచివైనప్పుడు ఏ దినం బయలుదేరితే ఏమ'ని ప్రశ్నించి వారిని నిరుత్తరులను చేశాడు.

ఆ కాలంలో రాజకీయ (ప్రభుత్వ) ఉద్యోగులలో లంచాలు పుచ్చుకోవటం సర్వ సాధారణం. పుచ్చుకొనకుండా ఉండేవారు మృగ్యము. లంచం తప్పుగాక ఉద్యోగధర్మమని ప్రతివారి నమ్మకం. కాబట్టి రాజకీయ ఉద్యోగులలోని యీ అక్రమాన్ని మాన్పటానికి ప్రయత్నించటం ఆయన స్థాపించిన వివేకవర్ధని పత్రిక ఉద్దేశాలలో ఒకటి. ఇది దేశాభివృద్ధి కలిగించే అంశమని ఆయన దృఢ విశ్వాసం.

ఇంతేకాక లంచాలిచ్చే ప్రజలలోనూ, పుచ్చుకొనే అధికారులలోనూ నీతి గౌరవాలు వర్ధిల్లకపోతే లంచాలు పోవు. కాబట్టి జనులలో నీతి వర్తనాన్ని వృద్ధి చేయటం పత్రిక యొక్క ఇంకొక ఉద్దేశ్యం. వేశ్యాగమనాదులు దురాచారాలని కులములో భావింపబడునంత వరకు నీతి తలయెత్తి వర్ధిల్ల లేదు. కాబట్టి కులాచారాలను చక్కబడేటట్లు చేయటం ఇంకొక ఉద్దేశ్యం. తులసీ రుద్రాక్షముల తిరుధారణాది బాహ్యధారణం కంటే, సత్ప్రవర్తనం మతానికి అధికావశ్యకమైనదని ప్రజలలో విశ్వాసం కుదిరే వరకు మతం పరిశుద్ధమైనదై దురాచార నివారకం కాలేదు. కాబట్టి పరిశుద్ధ మత సిద్ధాంతాలను బోధించటం వేరొక ఉద్దేశ్యం.

ఇలాంటి సదుద్దేశ్యాలతోనే వివేకవర్ధనిని ఆయన స్థాపించాడు. దానిని దురాచార నిర్మూలన కుఠారం గావించాడు. ప్రభుత్వ ఉద్యోగుల దురాచారాలను ప్రత్యక్షంగానూ, ఒక్కొక్కప్పుడు పరోక్షంగానూ నిర్భయంగా వివేకవర్ధనిలో విమర్శించి వ్రాసి వారికి గుండెలలో దడ పుట్టించాడు. కొందరు ఈ దెబ్బకు తట్టుకొనలేక బదలీ చేయించుకొని వెళ్ళిపోయారు. కొందరు తమ దుర్నడతను సరిచేసుకున్నారు.

ఆయనకు భగవంతునిపై అచంచల విశ్వాసం ఉన్నది. ఈ విశ్వాసం బాధలలో ఉన్నా, యెన్ని కష్టాల నెదుర్కొన్నా ఎప్పుడూ చలించలేదు. "ఈశ్వర బలము ముందరను,

సత్యబలము ముందరను మనుష్యబలమును, ధన బలమును, గవ్వకును కొఱగావు. ఈశ్వర బలమున్న పక్షమున పూరిపుడకయైన వజ్రాయుధమగును. ఈశ్వర బలము లేనిచో వజ్రాయుధము సహితం పూరిపుడక యగును. లోకములో సత్యబలమును, ధర్మబల ములునే బలములుగాని యవిలేని అధికార బలమును విత్త బలమును బలములు కావు" అని ఆయన దృఢ విశ్వాసము. అందువలననే తన స్వీయ చరిత్రను వ్రాయునప్పుడు ముందుగా నిర్గుణ పరబ్రహ్మమును ప్రార్థన చేసియే ఆయన ప్రారంభించాడు. "ఆత్మ శ్లాఘా పరత్వము"ను నా మనస్సు నుంచి దూరం చేయి. నా హృదయంలో సదా సత్యాన్ని వినయాన్ని నెలకొలు' అని పరాత్పరుని ప్రార్థించాడు. ఎంత గొప్పవారితో వైరం పెట్టుకొన్నా, ఆయన అవలంబించిన పక్షం న్యాయపక్షమని, ఈశ్వర ప్రీతికరమని ఆయన దృఢ నిశ్చయమైనందువలన ఆయన మనశ్శాంతిని ఎప్పుడూ కోల్పోయేవాడు కాదు. వివేకవర్ధని నడచినన్నాళ్ళు, స్థాపించిన ఉద్దేశ్యాల నుంచి దానిని ఆయన వైదొలగనీయలేదు.

శుష్కంగా నీతులు యితరులకు చెప్పి తాను ఆచరించని పరోపదేశ పాండిత్యం అంటే ఆయనకు గిట్టదు. "ఒకరు తాముపదేశించిన దానిననుష్ఠించి చూపినగాని కేవల శుష్కోపన్యాసముల వలనను పుస్తక ప్రకటనము వలనను కార్యముండదు" అని ఆయన ఉద్దేశ్యము.

వీరేశలింగానికి సాంఘిక విషయాల్లో బుద్ధి వికాసంతో కూడిన ఉదార దృష్టి, ప్రజాహిత కాంక్ష రాజకీయ విషయాల మీద లేదు. అందుకే అనేకమార్లు ఆయన ముందు సాంఘిక విషయాలలో దేశాన్ని అభివృద్ధి చేసుకొంటే తరువాత రాజ్యాంగ (రాజకీయ) విషయాలు ఆలోచించుకోవచ్చు అని తన అభిప్రాయాన్ని తెలిపాడు. ఆయనకు ఆంగ్ల ప్రభువులు, అధికారుల మంచితనం మీద విశేషమైన నమ్మకం ఉన్నది. అందుకే రాజ్యాంగ విషయాలలో మార్పులు దొరతనం వారు తీసుకొని రాగలిగినవే కాని మనం చేయగలది కాదని తెలియజేశాడు.

నిజానికి ప్రభుత్వ చట్రంలో వీరేశలింగానికి ఒక చిన్న ఉద్యోగం. ఆయన స్వతంత్ర జీవనం గడపాలనుకొన్నా అది కుదరలేదు. రాజకీయాలలో పాల్గొనాలంటే ఆయనకు స్వేచ్ఛ లేదు. అంతమాత్రంచేత ఆయనకు దేశభక్తి లేదని అనుకోకూడదు. ఆయన ఇంగ్లండుకు భారతదేశంలో ఏర్పడిన అనుబంధం దైవసంకల్పం అని భావించేవాడు. అందుకే ఆయన "మన దేశాభివృద్ధి నుద్దేశించి పరమ దయాపరుడైన ఈశ్వరుడు ప్రసాదించిన యా ఇంగ్లీషు ప్రభుత్వ మహిమను బట్టికాని, కాకపోయిన యెడల మనమీ దినమున నిట్లు సభకూడి యిందరమైకమత్యముతో రాజ్యాంగ విషయములను గూర్చి నిర్భయముగా బ్రసంగింప గలుగుదుమా?" అని భావించేవాడు. బ్రిటిష్ పాలన వల్ల

మనకు కలిగిన లాభాల్ని వివరిస్తూ ఆ పాలన రాకముందు నిరంకుశాధికారం గల కొందరు దుష్టప్రభావులు జరిగించిన దౌర్జన్యాలు, దురణయాలను గురించి ఆయన బాధపడేవాడు. ఆనాడు న్యాయమంతా ధనాశ్రితమేగానీ, పేదలకది లభించటం కలలోని వార్త అని ఆయన భావన.

ఇంగ్లీషు భాష, ఇంగ్లీషు విద్యల వైపు గురించి ఆయన సమ్మోహనంగా ఆకర్షింపబడ్డాడు. అందుకే "ఇంగ్లీషు విద్య సమోహ్మన మంత్రం కాక మరి యేది?" హిందూ దేశమునకు క్రొత్త ప్రాణము పోయుచున్నది. ఈ భాష యమృత వర్షము కురియునట్లుగా నెల్లయెడల వెదజల్లుచున్న యుత్తమ జ్ఞానమును, నిర్మల ధర్మతత్త్వమును, మనుష్య స్వాతంత్ర్య స్వయుత్తమ జ్ఞానమును, నిర్మల ధర్మతత్త్వమును, మనుష్య స్వాతంత్ర్య స్వరూపమును చవిగొన్న తరువాత నెవ్వరు తమతోటి యజ్ఞాన జన్యమయిన యనైకమత్యమును స్వార్థపరత్వమును, దురభిమాన ద్వేషములను త్యజించి, పరస్పర భ్రాతృవాత్సల్యముతో సంఘీభవించి మానుష స్వభావార్హములయిన స్వాతంత్ర ఫలముల బొందకుండ గోరుదురు? ఇంగ్లీషు విద్య యొక్కయు, నింగ్లీషు ప్రభుత్వము యొక్కయు ఘనతను, శక్తిని ఘోషించుటకయి యింతకంటే వేరేమి కావలెను" అంటూ అంతమాత్రం చేత బ్రిటిష్ ప్రభుత్వం లోపరహితమైందని ఎవరూ భావించకూడదు అని హెచ్చరించేవాడు.

ఏ రకం పిడివాదం అయినా ఆయన దృష్టిలో అది ఒక లోపమే. జాతీయ దురహంకారానికి దోహదం చేసే పొగడ్తలకు ఆయన ఆమడ దూరం. అలా పొగిడేవారంటే ఆయనకు అసహ్యం. అందుకే ఆయన గర్వమెప్పుడునూ మూర్ఖత్వ సూచకము. ఒక దేశము యొక్క అభివృద్ధిని పాడుచేయటానికి గర్వంతో సమానమైనది శత్రువు లోకంలో ఇంకొకటి ఉండదు. కాబట్టి దేశాభిమానంయని నటించే మహానుభావులందరూ దేశక్షేమమే అణుమాత్రమైనా తమ మనస్సులలో కోరుకొనే వారైతే, పనికిమాలిన పొగడ్తలు పొగిడి, జనులను గర్వితులను చేసి చెడగొట్టటానికి తోడు పడకుండా సత్యాన్ని తెలిపి చేతనైనంత వరకు వారి కన్నులు తెరిపించి వారు అభివృద్ధి పొందే మార్గాన్ని చూపవలెను అనేది ఆయన ఉద్దేశ్యం.

'అపుత్రస్య గతిర్నాస్తి' అన్న నమ్మకం ఆయనకు మొదటి నుంచి లేదు. పిల్లలు లేని ఆయన, ఈ కారణం చేతనే, ఎవరి బిడ్డనైనా కొడుకుగా పెంచుకోవాలని ఎప్పుడూ అనుకోలేదు.

జీవితంలోనూ, మరణంలోనూ కూడా 'పరిశుద్ధమైన ఆస్తికుడు'గా తనను తాను వర్ణించుకొన్నవాడు వీరేశలింగం. తాను మరణించిన తరువాత రాజమండ్రిలోని ఆనంద వనంలో తన భార్య రాజ్యలక్ష్మమ్మ సమాధి ప్రక్కన నెలకొల్పిన తన సమాధి ఫలకం

చెక్కించటానికి 'ఏకేశ్వరోపాసి' అనే పదాన్ని నిర్దేశించాడాయన. ఆయనకు భగవంతుని మీద అచంచల విశ్వాసం. అలాంటిదే ఒక సంఘటన తన భార్య మరణ వృత్తాంతాన్ని గురించి వ్రాస్తూ ఆమె నిద్రలో మరణించిన సంగతి తెలుసుకొనగానే విస్తారంగా దుఃఖంలో మునిగిపోయి కళ్ళు మూసుకొని ఈశ్వరుని ధ్యానిస్తూ ఓ ఈశ్వరా! వృద్ధ దశలో నాకిట్టి మహాపదను తెచ్చిపెట్టితివా?" అని ఆక్రోశించాడు. వెంటే ఆ ప్రశ్నకు జవాబుగా "ఓయి! దుఃఖపడబోకుము. ఇది మీ యుభయుల మేలు కొరకే జరిగినది" అని స్పష్టంగా వినిపించింది. ఈ సంగతిని తన స్వీయచరిత్రలో చెప్పిన వీరేశలింగం "క్రింది నుంచి యెవరో వచ్చి నన్నూరడించుచున్నారని తలచి కన్నులు విప్పి నలు దిక్కుల చూచితిని. ఏ ప్రక్కనూ ఎవరును కనబడలేదు. ఇది యంతయు నా భ్రమయే యయి యుండవచ్చును గాని నాకు మాత్రమది ఈశ్వర వాక్యమని దృఢముగా తోచినది. ఆ వరకు నాకున్న విచారమంత యా క్షణములో నదృశ్యమయి, నా మనస్సు నిర్మలమయి, నిర్విచారమయ్యెను" అని వివరించారు. ఈ సంఘటన ఆయనకు గల భగవద్విశ్వాసానికి అర్థోదాహరణం.

ఆయన మహానుభావుడు అన్నింటికీ అతీతుడు. అందుకే మొదట ఆయన మనిషి, కాలక్రమాన మనీషి.

# "భారతనారీ మార్గదర్శకురాలు"

వీరేశలింగానికి 1861లో, పదమూడేండ్ల వయసులోనే వివాహం అయింది. రాజమండ్రి ప్రక్కనే ఉన్న కాతేరు గ్రామ కరణం తెన్నేటి వెంకటరత్నం. ఆయనకు పిల్లలు లేరు. ఒక చెల్లెలు ఉన్నది. ఆమె పేరు కొండమ్మ. వెంకటరత్నంగారికి చెల్లెలు కొండమ్మ అంటే కొండంత ప్రేమ. అందుకే చెల్లెలను ఆ వూరిలోనూ ఉండే సామాన్య మధ్య తరగతి కుటుంబం వారి అబ్బాయి అద్దంకి పట్టాభిరామయ్యకు ఇచ్చి వివాహం చేశాడు. పట్టాభిరామయ్యగారికి కొండమ్మగారికి ప్రథమంగా ఒక అమ్మాయి పుట్టింది. ఆమె పేరే బాపమ్మ. కొండమ్మకు ఇంకొక కొడుకు పుట్టాడు. కానీ విధి వక్రించింది. ఆమె పురిట్లోనే బాలింత గుణానికి గురై మరణించింది. బాపమ్మ చిన్నతనంలోనే తల్లి లేని పిల్ల అయింది. మేనమామ వెంకటరత్నం మేనకోడలిలోనే చెల్లెలిని చూచుకొన్నాడు. బాపమ్మను అల్లారుముద్దుగా పెంచాడు. ఆమే వీరేశలింగానికి సహధర్మచారిణి అయింది. అప్పటికి ఆమె వయసు ఎనిమిది సంవత్సరాలు.

వివాహం అయిన ఒక సంవత్సరంలోపలే బాపమ్మకు స్ఫోటకం పోసింది. అయితే ఆమెపై దాని ప్రభావమంతగా లేదు. ఆ మహమ్మారి ఆమెను ముఖాన మచ్చల వంటివి ఏమీ లేకుండానే తేలికగా వదలింది. పదమూడు సంవత్సరాల వయస్సులో ఆమె మేనమామ ఇల్లు వదలి రాజమండ్రి కాపురానికి వచ్చింది. ఆనాటి నుంచి వీరేశలింగం క్షేమమే ఆమెకు సర్వం. ఆయనను కంటికి రెప్పలా చూచుకొన్నది. అప్పటికి ఇంకా ఆయన చదువే పూర్తి కాలేదు. అయినా ప్రతి తరగతిలోనూ ప్రథముడిగా ఉత్తీర్ణుడవుతున్నాడు. ఆమెకు ఎంతో సంతోషం ఇది కలిగిస్తున్నది. ఆయనతో మాట్లాడటం ఆమెకు ఎంతో

సంతోషంగా ఉండేది. పైగా ఆయన తెలియజేస్తున్న విషయాలు ఆమెకు క్రొత్తగా, ఆసక్తికరంగా ఉండేవి. తమ కాలానికి కంటె యెంతో ముందుండే ఆయన ఆలోచనలు, ముందుచూపు, ఆమెకు ఉత్తేజాన్ని కలిగించేవి. ఆమె దృష్టిలో భర్త ఎంతో ఉన్నతుడు, ఉత్తముడు.

మూఢ నమ్మకాలను నమ్మకపోవటం అనే ఆయన చూపిన సద్గుణం మొదటగా ఆమెను బాగా ఆకట్టుకొంది. ఆ సమయంలో వారి ఇంటిలో ఉన్న అరటి చెట్లలో ఒకదానికి చివరి నుంచి కాక మధ్యలో నుంచి చీల్చుకొని గెల వచ్చింది. అందరూ అది చూచి ఇంటికి అరిష్టమన్నారు. చెట్టు కొట్టేయమన్నారు. వీరేశలింగం ఒప్పుకోలేదు. ప్రకృతిలో జరిగే అనేక విషయాలలో ఇదీ ఒకటి. అంతే తప్ప అందులో చెడు ఏమీ లేదన్నాడు. అరటి చెట్టకు వచ్చిన గెల వలన తమ ఇంటికి అరిష్టం కలగడం ఏమీ ఉండదన్నాడు. ఆయన అంత చదువుకొని చెపుతున్నాడు. కాబట్టి ఆయనదే సరి అయిన ఆలోచన అని ఆమె భావించింది. తన ద్వారా చెట్టు కొట్టించేయాలని ప్రయత్నించిన బంధువులను "ఆయనకు అన్నీ తెలుసులే! మీ పని చూసుకోండి. మీరేమి చెప్పనక్కర లే" దన్నది. ఆ గెల కాయలే బాగా పెరిగాయి. లక్షణంగా కోసి ఒక రోజు కూర వండారు. కూర రుచిగా కమ్మగా ఉన్నది. బంధువుల నోళ్ళకు బంధం పడింది.

వీరేశలింగం గారి తల్లి పున్నమ్మగారికి దయ్యాలంటే పిచ్చి నమ్మకం. తననెప్పుడూ ఒక దయ్యం ఆవహించి బాధిస్తున్నదని ఆమె ప్రగాఢ విశ్వాసం. వీరేశలింగంగారు ఆమెతో అదంతా భ్రమ అని దయ్యాలు లేవని, భ్రాంతి పడవద్దని బోధ చేస్తుండేవాడు. కొంత కాలం బాగా ఉన్నట్లుండి ఏదో ఒక రోజు, మళ్ళీ ఏదో తన మీదకు వచ్చిపడినట్లు బాధపడుతుండేది ఆమె. గాలి సోకిందని అందరితోనూ చెప్పి బాధపడుతుండేది. ఒకసారి ఒక భూతవైద్యుడు తల్లి రోగం నయం చేస్తానని వచ్చాడు. నమ్మకం లేకపోయినా తల్లి బాధపడుతుందని సరేనన్నాడు వీరేశలింగం.

ఆ భూతవైద్యుడు ఏదేదో చేశాడు. దయ్యం పీడ వదలగొడతానని, తరుముతానని చెప్పి, ఏదేదో చేసి, తానే దడుచుకొన్నాడు. దయ్యం తన మీదకే వచ్చిందని భయంతో ఆరోగ్యం చెడగొట్టుకున్నాడు. వీరేశలింగం అతనిని తనకు దయ్యం చూపించమని అడిగాడు. అతను చూపించలేక తానే దయ్యబారిన పడినట్లు భావించి పైగా వీరేశలింగమే తనకు దయ్యం ఆవహించేటట్లు చేశాడని చెప్పి ఆయనకు దయ్యాల ప్రయోగాలు తెలుసని ప్రచారం చేశాడు. నెలకు పైగా జబ్బుపడి తీసుకొని, తీసుకొని చాలాకాలానికిగాని తిరిగి మామూలు మనిషి కాలేకపోయాడు.

ఇదంతా చూడగానే పున్నమ్మగారికి కొడుకు చెప్పిందాంట్లో నిజమే ఉందేమోనని పించింది. అంతటితో ఆమెను ఆవహించిన దయ్యమే కాదు, దయ్యాలున్నాయనే భ్రమ పారిపోయింది. ఈ సంఘటనను చూచిన రాజ్యలక్ష్మికి వీరేశలింగం గారి భావాలు ఎంత సరి అయినవో ఇంకొకసారి తెలిసింది.

వీరేశలింగం కోరంగి పాఠశాల నుంచి ధవళేశ్వరం పాఠశాలకు వెళ్తుంటే చాలా సంతోషించిందామె. అందుకు కారణం అది ప్రధానోపాధ్యాయుడి ఉద్యోగం కావటం పైగా జీతం కూడా నలభై నాలుగు రూపాయలు. ఈ మొత్తం ఆ రోజుల్లో సామాన్యమైంది కాదు. అంతేకాక తన పుట్టిల్లు కాతేరుకు ధవళేశ్వరం కొంత దగ్గర కూడా. ధవళేశ్వరంలో ఉండగానే వీరేశలింగానికి బాలికా విద్య మీద ఆసక్తి కలిగింది. కొందరు పెద్దలతో కలసి ముందుగా బాలికలకు చదువు నేర్పాలనే విషయం మీద చర్చలు చేసేశారు. అప్పుడు ఆమెకు ఆయన దొడ్డ మనసు తెలిసింది. ఎందరో విద్య లేని అభాగ్యస్త్రీల మీద ఆయనకు గల జాలి ఆమెను ముగ్ధురాలిని చేసింది. ఆయన పురుషార్థప్రదాయినిలో స్త్రీ విద్యను గూర్చి వ్రాసిన వ్యాసాలను, పద్యాలను ఆసక్తిగా చదివేది. ధవళేశ్వరంలో ఉండగానే వివేకవర్ధని పత్రికను వీరేశలింగంగారు ప్రారంభించడం చూసింది. ఆ పత్రికను చదువుతూ తనకు తెలియని ఎన్నో విషయాలను తెలుసుకొనేది. తన భర్త ఎంత ఉన్నతుడో ఊహించుకొనేది. ధవళేశ్వరంలో ఆడపిల్లలకు పాఠశాల ప్రారంభం అయింది. అప్పుడామె ఎంతో సంతోషించేది. ఎందరో ఆడపిల్లలు విద్య నేర్చుకొని విద్యావంతులు కాగలుగుతారని తెలిసి ఆనందించింది.

మొదట్లో విధవా వివాహాలకు అవసరమైన నైతిక సహకారాన్ని మాత్రమే ఆయనకు ఆమె అందించినా, క్రమంగా అన్ని విధాలుగా ఆయనకు సహాయపడింది. 1881వ సంవత్సరం డిసెంబర్ నెల 11వ తేదీన రాజమహేంద్రవరంలో మొదటి స్త్రీ పునర్వివాహం జరిగింది. వరుడు వీరేశలింగం తల్లి చేత స్వంత పుత్రునివలె పెంచబడిన గోగులపాటి శ్రీరాములు. ఈయనకు మొదటి భార్య మరణించింది. పది సంవత్సరముల వయస్సు గౌరమ్మ అనే వితంతువుతో ఆయనకు జరిగినా వివాహం మన రాష్ట్రంలోనే ప్రప్రథమ వితంతు వివాహం. దీన్ని జరిపించడం కోసం వీరేశలింగం పడిన బాధలు ఇంతా అంతా కాదు. ఆ సమయంలో అన్ని విధాలుగా ఆయనకు తోడుగా నిలిచింది రాజ్యలక్ష్మి. అటు తరువాత నాలుగు రోజులకే రెండవ వివాహం జరిగింది. శాంతి భద్రతల సమస్యలు లేకుండా ఉండటానికి మొదటి పెళ్ళి పోలీసుల సహాయంతో చేయవలసి వస్తే, రెండవ పెళ్ళికి పురోహిత బ్రాహ్మణుడు, వంటవారు. నీళ్ళవాళ్ళూ అందరూ భీష్మించుకొని ఎగగొట్టారు. ఎగగొట్టలేదు సనాతన ఛాందసులు వాళ్ళను అలా బలవంతం చేశారు.

రాజ్యలక్ష్మి దాదాపు ఒక మైలు దూరం గోదావరికి వెళ్ళి మడినీళ్ళు మోసి తెచ్చి వంట చేసింది. వచ్చిన వారిని ఆదరించింది. అయినా ఇంత శ్రమపడినా, ఆమె ముఖాన చిరునవ్వు చెదరలేదు.

ఎక్కడెక్కడ నుంచో ఎందరో వితంతువులు వారి ఇంటికి వచ్చి ఆశ్రయం పొందేవారు. వారిని ఆదరించి కడుపులో పెట్టుకొని కాపాడింది ఆమె. ఆఖరుకు వితంతువులై, వయసు కోరికలు ఆపుకోలేక కాలు జారిన కన్యలను చేరదీసి వాళ్ళకు పురుళ్ళు పోసింది ఆ దొడ్డ ఇల్లాలు. ఇలా వితంతువులకు పుట్టిన పిల్లలను పెంచింది.

మొదట అందరిలాగే ఆమెకు విగ్రహారాధనలో నమ్మకం ఉన్నా భర్త అనుసరిస్తున్న బ్రహ్మ సమాజ ఉపాసనా విధానం, బ్రహ్మ సమాజపు పెద్దల ఉపన్యాసాలను వినిన తరువాత ఆమెకు విగ్రహారాధన మీద నమ్మకం పోయింది. చుట్టు ప్రక్కల ఇళ్ళల్లో ఉన్నవారిని కూడా ఆహ్వానించి వారానికి ఒకసారి తమ ఇంటిలో సమావేశపరచి ఏకేశ్వరోపాసనను ప్రోత్సహించింది. స్త్రీలందరి కోసం స్త్రీ ప్రార్థనా సమాజంలో స్థాపించింది. పరిశుద్ధాస్తిక భావాలను వ్యాప్తి చేసే కీర్తనలను రచించి వాటిని తమ ప్రార్థనా సమాజంలో పాడించేది. స్త్రీల కోసం ఆ రోజులలో ప్రత్యేక ప్రార్థనా మందిరం నిర్మాణం చేయించేటట్టు చేసింది. మొత్తం ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో ఆ రోజుల్లో ఇంకెక్కడా స్త్రీలకు ప్రత్యేక ప్రార్థనా మందిరాలు లేవు. స్త్రీలనందరిని ఆ ప్రార్థనా మందిరానికి తీసుకుని వెళ్ళేది. ప్రార్థనా సమాజం వారి చేత ప్రతి సంవత్సరం ఉత్సవం జరిపించి వసూలైన చందాలతో, బీదా బిక్కికి, కుంటి గ్రుడ్డివారికి దానాలు చేయించేది. ఆమె కృషి వలన, ఆమె యిచ్చిన ప్రోత్సాహంతో తమ పురుషులకు తెలియకుండా ప్రార్థనా సమాజానికి ముగ్గురు స్త్రీలు గుప్తదానం చేశారంటే ఆమె స్త్రీలపై నెరపిన ప్రభావం ఎటువంటిదో తెలుసుకోవచ్చు.

ఒకానొక సమయంలో అంత్యకులజుడొకడు ఆకలి దప్పులతో నడువలేక వారి ఇంటికి సమీపంలో బాటలో పడిపోయాడు. ఎవరూ అతనిని లేవదీయటానికిగానీ, సహాయం చేయటానికి కానీ దగ్గరకు వచ్చే సాహసం చేయలేదు. అప్పుడామె దారిన పోయే వారినెందరిని అడిగినా వారి నిరాకరణే శరణ్యమైంది. ఆ సమయంలో అక్కడికి వచ్చిన కనపర్తి శ్రీరాములుగారనే సజ్జనుడి సహాయంతో ఎలాంటి సంకోచం లేకుండా ఆ అంత్యజుని ఇంటిలోనికి చేర్చి సపర్యలు చేసింది. అతనికి అన్నం వడ్డించింది. కులాలు మతాలు వీటి అన్నింటికి అతీతమైనది ఆమె విశ్వమానవ భావన.

ఆమెకు పూలన్నా, తాము పెంచే పెంపుడు జంతువులన్నా చాలా ప్రీతి. తమ ఇంటి తోటలో చూచిన పూలను ప్రతిరోజు కోసి అందరు స్త్రీలకు ఇస్తుండేది. వితంతు

శరణాలయంలో ఉండే స్త్రీలకు తానే వారి కొప్పులలో ఆ పూలు తురిమేది. ఇంట్లో తిరిగే కుక్కలు, పిల్లులను ఆమె ఎంతో ప్రేమగా లాలించేది.

భర్త అడుగుజాడలలో నడిచే ఏ హైందవ స్త్రీ అయినా తన భర్త అభిప్రాయాలను అంగీకరిస్తుంది. ఆమె కేవలం భర్త పాల్గొనిన ఉద్యమాలకు ఆమోదం తెల్పడమే కాదు, అక్కడితో ఆగకుండా మనసా వాచా కర్మణా ఆయన ఉద్యమాలలో అండగా నిలిచింది. తన సర్వశక్తులను కేంద్రీకరించి తానూ పాల్గొన్నది. ఈ పవిత్ర కార్యాలలో ఆమె వంటకత్తెగా వంటలు చేసింది, నీళ్ళ మనిషిగా నీళ్ళు మోసింది. మంత్రసానిగా పురుళ్ళు పోసింది. దాదిగా వితంతువుల పిల్లలను సాకింది. గోగులపాటి వీరేశలింగానికి తల్లిగా మారింది. పెంచింది. పెద్ద చేసింది. ఇలా ఎన్నో బాధ్యతలను నిర్వర్తించింది. కొందరు ఆమె సహాయం పొందారు. ఆమెనే రొమ్ముున గ్రుద్దారు. అయినా చలించలేదు ఆ ధీరవనిత.

షష్ఠిపూర్తి చేసుకొన్న వీరేశలింగానికి శరీరం దుర్బలం అయింది. తరచుగా ఆయనను ఉబ్బసరోగం పట్టి పల్లారుస్తున్నది. రోగంతో తీసుకొనే ఆయనకు ఎన్నో రాత్రులు శివరాత్రులే అవుతున్నాయి. అందువలన తాను ఎప్పుడైనా మరణించవచ్చునే అనుమానం పీడించసాగింది. ప్రతి సంవత్సరం వేసవులు బెంగుళూరులో గడిపినందు వలన ఉబ్బసం నుంచి కొంత వెసులుబాటు కలిగేది ఆయనకు. అయితే అదీ ఎక్కువసార్లు పోలేకపోయాడు. రోగం లేనప్పుడు కూడా ఆయనకు తానెప్పుడైనా మరణించవచ్చునే అనుమానం పీడిస్తూనే ఉండేది. తన మరణాన్ని గురించి ఆయనకు చింత లేదు. రాజ్యలక్ష్మి వీరేశలింగం కంటే కేవలం నాలుగేళ్ళు చిన్న. మంచి ఆరోగ్యవంతురాలు. తన తరువాత ఆమె గతి ఏమిటనేదే ఆయనకు దుగ్ధ. తన మీద ఆమెకు ఉన్న అనురాగం తన మరణం తరువాత ఆమెను ఏ అఘాయిత్యానికి పురి కొల్పుతుందో అని ఆయన బాధ. అలాంటి ప్రమాదం జరుగక పోయినా తన తరువాత ఆమెను ఎవరు చూస్తారని ఆయన సంశయం.

అయితే ఆమె నిజమైన భారతనారి. భారతనారి ఎప్పుడూ తాను ముత్తైదువుగానే మరణించాలని కోరుకొంటుంది. అలాంటి దృఢ విశ్వాసం ఆమెకు ఉండేది. ఆ విషయమే భర్తతో ఎన్నోసార్లు అన్నది కూడా. ఒకరోజు రాత్రి కునుకు తీస్తున్న సమయంలో ఆయనకు భార్య చేస్తున్న ప్రార్థన వినబడింది. ప్రక్కన మంచంపై కూర్చొని రాజ్యలక్ష్మి సర్వేశ్వరుడైన భగవంతుడిని ప్రార్థన చేసి, భగవంతుని ఉద్దేశించి భర్త జీవించి ఉండగానే తనను తీసుకొని పోవలసిందిగా ప్రార్థించడం వీరేశలింగంగారు విన్నారు. ఆ రోజు తెల్లవారు ఝాముననే అలవాటు ప్రకారం లేచిన వీరేశలింగం భార్యను మందలించాడు. ఆత్మహత్య వంటి ప్రయత్నం ఎప్పుడూ చేయవద్దన్నాడు. కానీ ఆమె మనస్సు అంత దుర్బలమైంది కాదు. ఆమె అంత బేల కాదు. అందుకే అలాంటిది ఏమి ఉండదని సమాధానం ఇచ్చింది.

కానీ తాను తప్పకుండా ఆయన కంటే ముందే పోతానని, భగవంతుడు పరమ కృపాళువు కాబట్టి తన మొర ఆలకిస్తాడని తనది సహజ మరణమే అవుతుందని ఎలాంటి శంక లేకుండా దిటవుగా జవాబు చెప్పింది. ఆ మహాసాధ్వికి ఎంత ఆత్మప్రత్యయం!

1910 ఆగస్టు నెలలో 11వ రాత్రి వీరేశలింగం త్వరగా నిద్రించాడు. రాత్రిపూట త్వరగా పండుకొని ఉదయం పెందలకడనే లేవటం ఆ దంపతుల అలవాటు. నిద్ర లేవగానే ప్రాతఃకాల ప్రార్థన చేసుకోవటానికి ముందు ఆ దంపతులు కొద్దిసేపు మాట్లాడు కొనేవారు. తెల్లవారగానే, ఆయన 'భార్యకంటే ముందే నిద్రలేచాడు. సాధారణంగా ఆమె ఎప్పుడూ భర్తకంటే ముందే నిద్ర లేచేది. ఆ రోజు లేవలేదు. మామూలుగా జరిగే విషయం ఆమె నిద్రలేచి పడక కుర్చీలో సర్దుకుని కూచోడం ఎంతసేపటికి జరుగలేదు. అలసి నిద్రపోతున్నదేమో ననుకొన్నాడు. అందుకే ఆమె మంచం దగ్గరకు వెళ్ళి తట్టిలేపాడు. ఆమెలో చలనం లేదు. ఒళ్ళు చల్లగా తగిలింది చేతికి. ఆయనకు ఏమీ తోచలేదు. వెంటనే దగ్గరలో ఉన్న వైద్యుని కోసం కబురు పంపించాడు. డాక్టరు వచ్చి చూచి ఆమె యిక లేవదని, అప్పటికి చాలా సేపటి క్రితమే ఆమెకు ప్రాణం పోయిందని తెలిపాడు. ఆరోజు 1910 ఆగస్టు 12వ తేదీ.

ఆయన జీవితంలో భార్యావియోగం కంటే పెద్ద దుఃఖకరమైన విశేషం వేరేమి లేదు. వారి అనుబంధం సాధారణ భార్యాభర్తల అనుబంధం కంటే దృఢమైనది, విశిష్టమైనది. దాదాపు అర్ధశతాబ్దం పాటు సాగిన అపురూపమైన దాంపత్యం వారిది. ఎక్కువగా చదువుకొనకపోయినా భర్త చేసిన పోరాటాలన్నింటిలోనూ ఆమె అదృశ్య చోదకశక్తి. హృదయపూర్వకంగా ఆయనకు పూర్తి సహకారాన్ని అందించింది. ఆ పోరాటంలో భర్త తప్ప ఇక ఏమి పోయినా లెక్కపెట్టలేదు. ఎవరెంతగా బెదిరించినా జంకలేదా మహాసాధ్వి.

వితంతు శరణాలయ ఆశ్రమంలో ఆమె దహన సంస్కారం జరిగింది. తరువాత ఆ స్థలంలోనే ఆమెకు వీరేశలింగం ఒక సమాధిని నిర్మాణం చేయించాడు. సమాధి మీద ఒక పాలరాతి ఫలకం అమర్చాడు. ఆ సమాధి చుట్టూ ఒక తోట పెంచాడు. అందులో ఆమెకు ఇష్టమైన ఎన్నో పూలమొక్కలు నాటించాడు. ఆమె స్మృతి వీరేశలింగానికి విస్మృతి లేనిదే అయింది.

# అస్మద్దేశీయులారా!

భార్య రాజ్యలక్ష్మమ్మ మృతి చెందిన తరువాత విధురుడైన వీరేశలింగం ఒంటరివాడైనాడు. బాల్యసఖుడు దేశిరాజు పెద బాపయ్య, కూర్చు మిత్రుడు బసవరాజు గవర్రాజు ఆమె కంటే ముందు కాలధర్మం చెందారు. వితంతు శరణాలయం తత్సంబంధమైన వాటి నిర్వహణ ఖర్చు ఆయనే చేస్తున్నాడు. అప్పటికే ఆరువేల రూపాయల కంటే ఎక్కువే. ఆ శరణాలయానికి తన స్వంత ధనం ఆయన ఖర్చు చేశాడు. దీని కోసం కొంత ఋణాలు చేయవలసి వచ్చింది. ఆయన పుస్తకముల విక్రయం చేత వచ్చే సొమ్ము, సర్వ కళాశాల పరీక్షకత్వాల వలన వచ్చే ధనాన్ని ఆయన శరణాలయానికే ఖర్చు పెడుతున్నాడు. అప్పటికే వయసు మీద పడినందు వలన ఆయన పరీక్షకత్వాన్ని వదలుకొన్నాడు. పుస్తకముల విక్రయం ఇంతకు ముందులాగా లేదు. కొన్ని పుస్తకాలు ప్రతులు చెల్లిపోయినవి. తిరిగి ముద్రించటానికి ఆయనకు శక్తిగానీ, ధనముగానీ లేదు. భగవంతుని దయ వలన ఆయన జీవికకు మాత్రం ఒకరి నుంచి ఆశించవలసిన పని లేదు. ఆయనకు ఉపకారవేతనం నెలకు ఇరవై నాలుగు రూపాయలు వస్తూనే ఉన్నది. ఒకటి రెండు అనుకొన్న పుస్తకాలను వ్రాయటం తప్ప మిగిలిన తాను చేయవలసిన పనులు అన్నింటిని నిర్వర్తించినట్లుగా ఆయన భావిస్తున్నాడు. ఇక ఈ లోకంలో తాను బ్రతికి ఉండవలసిన అవసరం లేదని ఆయన భావించసాగాడు. ధనాగమనము తగ్గిపోయినందు వలన వితంతు శరణాలయానికి ప్రతినెలా అయ్యే ఖర్చు సంపాదించటం ఆయనకు చాలా కష్టంగా ఉన్నది.

ఎన్ని కష్టాలు వచ్చినా, తన ముక్కున ఊపిరి ఉండగా వితంతు శరణాలయం వంటి సంస్థలను పోగొట్టుకొనదలచలేదు. రాజమహేంద్రపుర వాసులను సమావేశపరచి వారేగాక మొత్తం ఆంధ్రదేశీయులకు తన తరపున ఒక విజ్ఞాపనము చేశాడు. ఏ మాత్రం దేశభక్తి, స్ఫూర్తిమత్త్వము కలిగిన వారికైనా అది ఒక ఊహాలోకంలోకి తీసుకొని పోతుంది. వారిని ఉత్తేజపరుస్తుంది. ఇదే ఆ

## విజ్ఞాపనము

అస్మద్దేశీయులైన ఆంధ్రమహాజనులారా! రాజమహేంద్రపుర వాస్తవ్యులగు భాతృవర్యులారా!

మీవాడనైన నేను కడపటి ప్రార్థన మీకందరికీ చేస్తున్నాను. ఇప్పటి వరకు నా మీద మీరు చూపుతున్న ఆదరాన్నే యిక ముందు కూడా చూపి నా ప్రార్థనను మన్నిస్తారనే

సంపూర్ణమైన ఆశతో, మీకీ విజ్ఞాపనం చేయాలని సాహసిస్తున్నాను. నేను మహాసమర్ధుడిని కాకపోయినా, చెట్టు లేని దేశంలో ఆముదపు చెట్టే మహావృక్షం అన్నట్లుగా విద్యాధికులంతగా లేని కాలంలో తెలుగు దేశాభివృద్ధికి పనిచేసిన వారిలో నేను కూడా ఒకడిని. ఇది ప్రగల్భోక్తి కాదు. నేను ధనవంతుడిని కాదు. బలవంతుడిని కాదు. అధికారమున్నవాడిని కాదు. అధిక విద్యావంతుడిని కాదు. అయినా దేశాభిమానం ఒక్కటే ఉన్నవాడను కాబట్టి శక్యాశక్య విచారణ చేయకుండా నేను దేశ సంస్కరణోద్యమంలో అడుగు పెట్టాను. ఆ రంగంలో నేనెంతవరకు సాధించానో చెప్పలేను. కానీ దానికోసమే నాకున్న అల్ప ధనాన్ని, యౌవనాన్ని, బలాన్ని, విద్యను, బుద్ధిని ధారపోసి మీ ఆదరానికి పాత్రుడను కాగలిగాను. నా భార్య మరణించినప్పటి నుంచి మీరు నాపై చూపుతున్న ఆదరణ, సమదుఃఖ భావము ఇందుకు నిదర్శనాలు.

మీ వలెనే మన దేశీయులు, ఎందరో నా అల్పమైన సంస్కరణ కృషిని గొప్ప చేయటాన్ని బట్టి రాజమహేంద్రవరం సంస్కారాలకు జన్మభూమి అనే పేరు పొందింది. మొదటి నుంచి ఈ రంగంలో కృషి చేస్తున్న న్యాపతి సుబ్బారావు పంతులు వంటివారు ఎందరో ఉన్నారు. పేరు యే విధంగా వచ్చినను, ప్రతికూల శక్తులను బలంతో అణచివేసి ఈ సంస్కరణోద్యమం నిలబెట్టి సఫలం చేయవలసిన భారాన్ని ఇప్పుడు మీరు వహించవలసి ఉన్నది. దేశీయాభిమానులైన మీరు, మీ మీద పడిన ఈ భారాన్ని సంతోషపూర్వకంగా పైన వేసికొని, అధిక సమర్థతతో నిర్వహించి రాజమహేంద్రవరానికి ఇంతకు ముందే కలిగిన ఈ కీర్తి కంటే ఎక్కువ కీర్తిని తీసుకొని రాగలరని మీ వృద్ధ సోదరుడైన నేను వినయపూర్వకంగా వేడుకొంటున్నాను. ఈ కీర్తి రాజమహేంద్రవరందే కాదు. తెలుగుదేశమంతటిది. నేను తమిళ, కర్ణాటక ప్రాంతాలలో సంచారం చేసినప్పుడు వారి చేత తెలుగువారు సంస్కారాది విషయాలలో తమ కంటే ఎక్కువగా ఉన్నారని ఎన్నోసార్లు అనుచుండగా విన్నాను. ఆంధ్రదేశము యొక్క అభ్యున్నతి కానందించి గర్వపడుతూ వచ్చాను.

ఓ ఆంధ్రమహాజనులారా! సంఘసంస్కరణాభిలాషులారా! నేను చెప్పింది రాజమహేంద్రవరానికే వర్తిస్తుందనుకోవద్దు. అది మొత్తం ఆంధ్ర దేశానికి వర్తిస్తుంది. తగిన పోషణ లేక కృశిస్తున్న సంస్కరణోద్యమాన్ని రాజమహేంద్రవరంలాగే, ఆంధ్రదేశ మంతటా నిర్వహించటం మన ధర్మం. అందుకే దాన్ని ఆదరించండి. యిప్పుడు మొదట ఉండే జవసత్త్వాలను పోగొట్టుకొన్నాను. మాతృసేవకు అనర్హమైన దురవస్థలో ఉన్నాను. ప్రస్తుతం శోచనీయ దురవస్థలో ఉన్న ఈ పేద పుత్రుని యెడల సౌభ్రాత్రాన్ని చూపించి,

యీ బీదసోదరునకి విశ్రాంతి నిచ్చి, మీరా భారాన్ని పూర్తిగా వహించండి అని ఆంధ్రమాత తన ప్రియపుత్రులైన మిమ్ములను వేయి విధాలుగా వేడుకొంటున్నది. మాతృస్నేహతత్పరులైన మీరు తదాజ్ఞను శిరసా వహింతురు గాక!

అస్మద్దేశీయులారా! సహజన్ములారా!

నాకు వృద్ధత్వము చేత సర్వశక్తులు క్షీణిస్తున్నాయి. కానీ సంస్కారాశమాత్రం పోవటం లేదు. ఈ సంస్కరణాశ మాత్రమే మీకీ విన్నపం చేయటానికి నన్ను పురికొల్పుతున్నది. సావధానచిత్తంతో నా విన్నపాలను ఆలకించండి!

దేశాభివృద్ధికి సంస్కారమన్ని విషయాలలో సమానంగా ఉండాలి కానీ ఒక విషయంలో మాత్రమే నడుచుచుండటం చాలదు. ఒకదానిలోనే అభివృద్ధి అసలు అభివృద్ధే కాదు. ఈ విషయాన్ని ఇంతకుముందు యెన్నోసార్లు నా ఉపన్యాసాలలో చెప్పినా, వ్రాస్తున్నా, తృప్తి లేక చెప్పినదాన్నే ఇంకొకసారి చెప్పుతున్నాను. శరీరంలోని సమస్తావయవములు పరస్పరానుకూలంగా యెదగక, ఒక కడుపోకాలో యెక్కువగా ఎదిగినప్పుడు దానిని రకరకాల పేర్లతో పిలిచి మహా రోగలక్షణంగా భావించినట్లే, ధార్మిక (మత) సాంఘికాభి వృద్ధికి ప్రయత్నాన్ని ఉపేక్షించి ఒక్క రాజ్యాంగ (రాజకీయ) స్వాతంత్ర్యాన్ని పొందాలని ఉద్యమించినా అది సంపూర్ణ సుఖాన్ని ఇవ్వగలదని భావించలేము. సత్కులాచార స్వాతంత్ర్యాలను సంపూర్ణంగా పొందగలిగినా ధన ప్రాణాలకు రక్షణ నివ్వని క్రూర నిరంకుశ ప్రభుత్వానికి నిరంతర దాస్యం చేయవలసిన యెడల మనం అనుభవించ గల సుఖమేముంటుంది. అందుకే యింటిలోను బయట కూడ హేయమైన దాస్యం నుంచి విముక్తులమై ఉభయ స్వాతంత్ర్యములను పొందగలిగినప్పుడే నిష్కళంక సౌఖ్యం లభ్యం కాగలదు. కాబట్టి నిజమైన దేశ క్షేమం అభిలషించేవారు సమస్త స్వాతంత్ర్యముల నిమిత్తం సమస్తాభివృద్ధుల నిమిత్తం సమానంగా కృషి చేయండి. అప్పుడు మీరు, మీ దేశము సౌఖ్యవంతంగాను, సంతోషంగాను, అభ్యుదయవంతంగాను మారగలరు.

ఇప్పుడు మన ఆంధ్రదేశం మేలుకొని మనవారు దేశాభివృద్ధి కరాకులైన నానా క్షేత్రాలలో మహోత్సాహంతో కృషి చేస్తున్నారు. ఇందుకు నాకు చాలా సంతోషంగా ఉన్నది. ఇది మన దేశ పురోభివృద్ధికి సూచన. ఇలాంటి స్థితి కోసమే నేను ముప్పై నలభై సంవత్సరాల నుండి ఎదురు చూస్తున్నాను. అప్పటికి నా కోరిక దివ్యాస్వప్నం. ఇప్పుడది ప్రత్యక్ష సిద్ధం. అప్పటిలో సభలు ఏర్పాటు చేయాలంటేనే రాజమహేంద్రవరంలో నిషిద్ధం. ఇప్పుడు అది సర్వసామాన్యం. అప్పట్లో స్త్రీ విద్య అంటే నిషేధం. నేడు అన్నిచోట్ల బాలికా పాఠశాలలు వెలుస్తున్నాయి. అప్పుడు పురుషులు చదువుకొనటానికే పుస్తకాలు లేవు. ఇప్పుడు స్త్రీలు చదవటానికి కూడా దినదినాభివృద్ధిగా పుస్తకాలు వస్తున్నాయి. అప్పటిలో

ఆంధ్రభాషా పత్రికలు అంతగా లేవు. నేడో దేశభాషావృత్తాంత పత్రికలధికమై వేల కొలది చదువరులను గలవై ప్రకాశిస్తున్నాయి.

ఓ రాజమహేంద్రపుర నివాసులారా! అస్మద్దేశీయులైన ఆంధ్ర మహాజనులారా! మీ దేశ సేవలో కాలము గడిపి మీకు దయనీయుడునైన నేను చేతులు జోడించి వినయపూర్వకంగా మీకు నా కడపటి ప్రార్థన చేస్తున్నాను. హితకారిణీ సమాజంలో సామాజికులు (సభ్యులు)గా చేరి దానినుద్దేశించి, నిరంతరాయంగా కొనసాగేటట్లు చేయండి. నాకు చేసిన దాని కంటె నాకెక్కువ ప్రీతికరం అయిన ఈ సమాజాన్ని నిలబెట్టి తోడుపడటం నాకేకాదు యావదాంధ్ర దేశానికి మేలు చేసినట్లే.

ఓ భక్తవరదా! ఓ దీనరక్షకా! దీనుడనైన నేను ఈ ఆంధ్రదేశమును సంతతాభివృద్ధి నొందుచుండు దానినిగా చేయ ప్రార్థించుచున్నాను. నా ప్రార్థనను సఫలము చేయుదువు గాక!

అని ఆయన చేసిన తుది విన్నపం పూర్తిగా చదివిన తరువాత మన మనసు ఒక ఊహా లోకం నుంచి నిజలోకంలోకి వస్తుంది. కళ్ళ యెదుట వృద్ధుడు అయిన ఒక తేజోమూర్తి దయనీయంగా చేస్తున్న ప్రార్థన హృదయాన్ని ఆర్ద్రం చేస్తుంది.

ఆయన ప్రార్థన నాడే కాదు నేడు పరిశీలించి పాటించవలసినదే!

# అస్తమయం

వీరేశలింగం పంతులుగారికి క్రమంగా వార్ధక్యం వచ్చింది. వార్ధక్యం అనేది ఆయన శరీరానికేగానీ మనసుకు కాదు. ఎంతో ఉత్తమ యిల్లాలైన ఆయన భార్య రాజ్యలక్ష్మమ్మ ఆగస్టు 12, 1910 శుక్రవారం నాడు నిద్రలోనే తుదిశ్వాస వదిలింది. ఆమె యాభైయేళ్ళ జీవితాన్ని ఆయనతో పంచుకొన్నది. అప్పటికి వీరేశలింగం గారి వయస్సు అరవై రెండు సంవత్సరాలు. ఆయన స్వతహాగా దుర్బలశరీరుడు. చిన్నతనం నుంచి తరచుగా ఏదో ఒక అనారోగ్యం ఆయనను పీడించింది. ఎన్నోసార్లు మృత్యుముఖం నుంచి బయటపడ్డాడు. అయితే శారీరకంగా ఆయన ఎంత దుర్బలుడో మానసికంగా అంత బలశాలి. శక్తివంతమైన ఆలోచనలు చేయటం, ఆలోచనలెప్పుడూ సకారాత్మకమైనవే కావటం ఆయన దృఢ సంకల్పానికి దోహదం చేశాయి. కాబట్టే అ దుర్భల శరీరుడు తన జీవితంలో ఎన్నో సాధించగలిగాడు. ఎందరినో ప్రభావితం చేయగలిగాడు.

ఆరోగ్యం క్షీణించటం మొదలైంది. పులవర్తి సుబ్బారావు అనే ఆయనకు డబ్బు ఆశ చూపగా ఆయన కుటుంబం వారు భోజనం ఏర్పాట్లు చేశారు. ఆయనకు చేయవలసిన ఏర్పాట్లు కుదరలేదు. ఆయనకు భార్య తరచుగా గుర్తుకు రాసాగింది. ఆమె లేని చోటులో ఏమిటో అర్థం అవుతున్నది. అయినా చేయగలిగే దేమున్నది. భార్య పోయిన నాలుగు నెలల వరకూ కనీసం ఒకసారైనా ఆయన అభ్యంగన స్నానమైనా చేయలేకపోయాడు.

వేళకు సరిగా భోజనం లేకపోవటం, తిన్నది సరిగా జీర్ణం కాకపోవటంతో తరచుగా ఆయన ఆరోగ్యం చెడిపోసాగింది. నీరసం ఎక్కువ అయింది. అయినా మంచం పడకవేయకుండా వితంతు శరణాలయం పనులు చూస్తూ కాలం గడుపుతూ కొంత ఒంటరితనాన్ని మరచిపోయే ప్రయత్నం చేసేవాడు.

1912వ సంవత్సరం జనవరిలో, ఆయనకు పెద్ద జబ్బు చేసింది. వైద్యుని సలహా ప్రకారం కాఫీ త్రాగాడు. వెంటనే స్మృతి కోల్పోయి వెనక్కుపడిపోయాడు. శ్వాస ఆగిపోయింది. పెదవులు వివర్ణం అయినాయి. నాడి కొట్టుకోవడం దాదాపు ఆగిపోయింది. అందరూ ఆయన మరణించారనే భావించారు. ఇలా కొంతసేపు ఉన్న తరువాత కళ్ళు తెరచి చూచాడు. చాలా బలహీనపడ్డాడు. కనీసం ప్రక్కకు వత్తిగిలి పడుకొనే శక్తి కూడా లేదు. ఆ సమయంలో మంగమ్మ ఆయనకు ప్రశంసనీయమైన సేవ చేసింది. తరువాత చాలా రోజులకు గానీ ఆయన మామూలు మనిషి కాలేకపోయాడు.

జబ్బు పడినప్పటి నుంచి కొంత కోలుకొన్న తరువాత ఏదో కొంత వ్రాయటానికి ప్రయత్నం చేయగా చేయి వణికి పట్టు తప్పిపోయేది. ఏమీ వ్రాయలేకపోయేవాడు. మొదటి నుంచి వీరేశలింగంగారికి ఆప్తమిత్రుడు బసవరాజు గవర్రాజు. అన్ని పనులలో చేదోడు వాదోడుగా ఉండేవాడు. ఒకసారి ఆయన 1887లో వీరేశలింగంగారిని వివరాలు ఇవ్వండి జీవిత చరిత్ర రాస్తానని అడిగాడు. అందుకు ఆయన అంగీకరించక, తన మరణం తరువాత వ్రాయవచ్చులే అని నిరుత్సాహపరిచాడు. అయితే 1888లో అకస్మాత్తుగా బసవరాజు గవర్రాజు మరణించాడు. తన జీవిత చరిత్ర వ్రాస్తానన్న మిత్రుడి జీవిత చరిత్రను తానే వ్రాసి సంతాప సభలో చదివాడు వీరేశలింగం.

1894వ సంవత్సరంలో, తోలేటి వెంకటసుబ్బారావు అనే ఆయన వీరేశలింగం జీవిత చరిత్రను రచించి ముద్రించాడు. వీరేశలింగంగారికి స్వీయచరిత్ర రాయాలనే సంకల్పం మిత్రుల ప్రోద్బలం వల్ల కలిగింది. చాలా మంది మిత్రులు ముఖ్యంగా సి. వై. చింతామణి మొదలైనవారు ఆయనను బలవంతపెట్టారు. అందువల్ల 1908లోనే కొంత వ్రాసి వారి ముద్రణశాలలోనే ముద్రించాడు. అప్పటికి దానిని వదలివేశాడు. ఈ భాగాన్ని చదివిన కొమర్రాజు లక్ష్మణరావు ఆయనను విశేషంగా ఒత్తిడి చేశాడు. అందువలన 1910-1913 సంవత్సరాల మధ్య కాలంలో వీరేశలింగం తన స్వీయచరిత్ర ప్రథమ భాగాన్ని పూర్తి చేశాడు. వెంటనే 1911లో కొమర్రాజు లక్ష్మణరావుగారి విజ్ఞాన చంద్రికా గ్రంథమాల పక్షాన ముద్రణ జరిగి ప్రచురించబడింది.

ఈ గ్రంథాన్ని ఆయన తన అర్ధాంగి లక్ష్మి రాజ్యలక్ష్మికి అంకితం చేశాడు. దీనికి ఆముఖంగా ఆయన "నేను చేసిన సమస్త సత్ప్రయత్నములలోను ఛాయ వలె నాతోడ నుండి నన్ను ప్రోత్సాహపరచుచు, ధర్మమార్గానుసరణమునందు నా తోడ గూడ సకల కష్టములను సంతోషపూర్వకముగా సహించుచు, సత్యమైన సహధర్మచారిణియయి, తల్లి బిడ్డకు వలె నవ్యాజానురాగము తోడ సహస్ర హస్తములతో సదా నాకు సంరక్షణము చేయుచు, ఏబది సంవత్సరముల కాలము నా ప్రాణమునకు ప్రాణమయి యుండిన నా

యర్ధాంగి లక్ష్మియైన రాజ్యలక్ష్మికి దీనిని నేనంకితము చేయుచున్నాడను” అని వ్రాశారు. ఈ వాక్యాలు ఆయనకు ఆమెపై ఎంత ప్రేమో తెలుపుతున్నాయి గదా!

భార్య జీవించి ఉండగానే బెంగుళూరులో వేసవి కాలంలో మకాం చేసినప్పుడు 1910లో ఆయన స్వీయచరిత్ర ద్వితీయ భాగం రచన ప్రారంభించాడు. తిరిగి అటు తరువాత ఇంకొకసారి బెంగుళూరు వెళ్ళిన సమయంలోనే దాని రచన పూర్తి అయింది. ఈ ద్వితీయ భాగాన్ని 1915లో వీరేశలింగంగారే స్వయంగా ప్రచురించాడు. తరువాత వీరేశలింగం తన జీవితకాలంలోనే స్వీయచరిత్ర మూడవ భాగం కూడా వ్రాయాలని సంకల్పించినట్లున్నది. మరణానికి కొద్ది సమయమునందు ఆయన స్వీయచరిత్రలో నలభై అయిదు పేజీలు వ్రాశాడు. చివరి వాక్యాన్ని పూర్తిగా కూడా వ్రాయలేకపోయాడు. అయితే ఆ భాగం యేమైందో ఇప్పుడు మనకు తెలియదు.

అప్పటి వరకు ఆయన వ్రాసిన కవుల చరిత్రను సింహావలోకనం చేస్తుంటే కవి కాలాదులు మొదలైన వాటిలో తన రచనలలోనే అనేక అసంగతాలు కనిపించసాగాయి. దానిని పునశ్శోధనం చేసి తిరిగి ముద్రించాలని ఆయన కోరిక. ఒక అభిప్రాయాన్ని పిడివాదంగా చేసికొని ఉండటం ఆయనకు ఎప్పుడూ సమ్మతం కాదు. తగిన ఉపపత్తులుంటే, ఆధారాలు దొరికితే, తన అభిప్రాయాలు మార్చుకోటానికి ఆయన ఎప్పుడూ సిద్ధమే. అందుకే 1917వ సంవత్సరంలో ఆయన తన కవుల చరిత్రను పరిష్కరించడం ప్రారంభించి లభ్యమైన ఆధారాలతో మార్చి వ్రాశాడు. దాదాపు డెబ్భై సంవత్సరాల వయసులో అస్తవ్యస్థమైన ఆరోగ్యం, అరకొర వసతులతో ఆయన కవుల చరిత్ర మొదటి సంపుటాన్ని సంశోధించి పునర్ముద్రించారు. దీనికి చాలా శ్రమపడ్డాడు. ఆ సంశోధనలో ఆయనకు మానవల్లి రామకృష్ణ కవి, వేటూరి ప్రభాకరశాస్త్రి వంటి పండిత పరిశోధకుల రచనలు చాలా ఉపయోగపడ్డాయి.

1919లో ఆయనను గిడుగు వెంకట రామమూర్తి పంతులుగారు కార్యదర్శిగా ఉన్న వర్తమాన ఆంధ్రభాషా ప్రవర్తక సమాజానికి అధ్యక్షత వహించవలసినదిగా ఆహ్వానించారు. ఈ సభకు అధ్యక్షత వహించిన వీరేశలింగం ఆ సమాజానికి వ్యవస్థాపక అధ్యక్షులుగా ఎన్నుకోబడ్డాడు. గిడుగు రామమూర్తి పంతులు గారి వ్యావహారిక భాషోద్యమంలోని హేతువాదం ఆయనకు నచ్చింది. వ్యావహారిక భాషోద్యమానికి వీరేశలింగం కొమ్ము కాయటం ఆనాటి ఛాందసులకు నచ్చలేదు. ఎవరు ఎన్ని నిరర్ధక నిందలు వేసినా, విమర్శించినా తాను నమ్మినదానిని ఆచరణలో పెట్టటం ఆయన నైజం. అందుకే యిలాంటి ఉడతవూపులకు ఆయన జంకలేదు.

1919 ఏప్రియల్ నెల 16వ తేదీ ఆయన డైబ్భై రెండో జన్మదినం. రాజమండ్రిలో పెద్ద ఆడంబరాలు లేకుండా పుర ప్రజలు, ఆయన శిష్యులు జన్మదినాన్ని నిర్వహించారు. జన్మదిన వేడుకలు అయిపోయిన మూడవ రోజుకే కవుల చరిత్ర ద్వితీయ సంపుటాన్ని పరిష్కరించటానికి కొన్ని మూలాధారాలు అవసరమని ఆయన భావించాడు. వాటి మూల ప్రతులు మద్రాసులోని ప్రాచ్య లిఖిత భాండాగారంలో ఉన్నాయి. ఆ మూల ప్రతులతో సంప్రదించాలని భావించాడాయన.

దేహం ప్రాణావశిష్టం అయ్యేంత వరకు ఏదో ఒక వ్యాసంగం చేయవలసినదే. అందుకే మద్రాసు ప్రయాణం. బయలుదేరబోయే ముందు తనను కలవటానికి వచ్చిన మిత్రులతో తాను మద్రాసు నుంచి రాగలనో లేదో ఇదే చివరి చూపేమోనని సందేహం వ్యక్తం చేశాడు. తాను ఇంకా సాధించవలసినవి మరో మూడు ముఖ్య విషయాలున్నాయని వారికి మనవి చేశాడు. అవి. 1.నన్నయ భట్టారకుడి పేరు మీద రాజమండ్రిలో సర్వసమగ్రమైన గ్రంథాలయము ఒకదానిని ప్రారంభించటం 2. తన తెలుగు కవుల చరిత్రను పునః సంశోధించి పూర్తి రచనను ప్రచురించటం 3. తెలుగు భాషకు ఆధునిక పద్ధతిలో నవ్యాంధ్ర వ్యాకరణం రచించటం. అయితే కేవలం తన వలననే అన్నీ జరగాలనుకోలేదాయన. 'నేను చేయలేకపోతే నా జీవిత కాలంలో కాకపోయినా నా తదనంతరం నా మిత్రులు యే విధంగానైనా ప్రయత్నించి సాధించగలరని నేను ఆశిస్తున్నాన'ని మద్రాసు వెళ్ళే ముందు ఆయన ఆంధ్ర దేశవాసులకు, రాజమండ్రి పౌరులకు ఇచ్చిన అంత్య సందేశం.

మద్రాసుకు వెళ్ళిన తరువాత ఆయన కొమర్రాజు లక్ష్మణరావుగారి నివాస గృహం 'వేద విలాస్'లో దిగాడు. ఆయన బస మొదటి అంతస్థులో ఉండేది. ఆయన పెంచి పెద్ద చేసిన ఒక స్త్రీ ఆయన వెంటనే ఉన్నది. ఇంకొక ముసలి నౌకరు కూడా ఆయన వెంట రాజమండ్రి నుంచి వచ్చాడు. ఆయన క్రొత్త వసతిలో కాస్త స్థిమితపడటంతోనే స్వీయ చరిత్ర మూడవ భాగం వ్రాసే ప్రయత్నం చేశాడు. 'మనిషి అప్పటికే బాగా నీరసించి ఉన్నాడు. కేవలం పాలలో నానవేసిన అటుకులు మాత్రమే ఆయన ఆహారం. అయినా అప్పుడప్పుడూ లేచి కూర్చొని వ్రాస్తుండేవాడు. దేహం దుర్బలంగా ఉన్నా, చేయి వణుకుతున్నా మెదడు చురుకుగా, అప్రమత్తంగా పని చేస్తూనే ఉన్నది.' మొదటి నుంచి ఆయన చిత్తు, సాఫు ప్రతులని వేరువేరుగా వ్రాసేవాడు కాదు. ఒకసారి వ్రాసిందే శుద్ధ ప్రతి. కొట్టివేతలు వంటివి ఏమీ ఆయన వ్రాతలో ఉండేవి కావు. సవరణలు ఉండవు.

భాగవతం వ్రాసిన బమ్మెర పోతన - ఒంటిమిట్టవాడా (కడప జిల్లా) ఏకశిలా నగరం (వరంగల్లు) వాడా అనే వాద వివాదాలు ఆ రోజుల్లో ఉద్ధృతంగా నడుస్తున్నాయి. వీరేశలింగం పోతన నివాసం గురించి ఒక వ్యాసం ఆంధ్రపత్రికకు వ్రాయాలనుకొన్నాడు.

వ్యాస రచన పూర్తి అయ్యేలోపుగా వారికి పెద్ద పెట్టున జ్వరం వచ్చింది. ఇన్ఫ్లూయంజా జ్వర లక్షణాలతో కూడిన విష జ్వరంగా అది పరిణమించింది. ఆయన ఒకప్పటి శిష్యుడు డాక్టర్ ఆచంట లక్ష్మీపతి వైద్యం చేస్తున్నాడు. అంత జ్వరంలోను పంతులుగారు వ్యాసాన్ని పూర్తి చేశాడు. పత్రికకు పంపాడు. కనుకొలకుల నుంచి నీరు ధారగా కారుతున్నది. ఆ సమయంలో కూడా ఆయన ఆ వ్యాసాన్ని చదవటంలో, ప్రూఫ్‌లు దిద్దటంలో ఇతరుల సాయాన్ని తీసుకోటానికి ఇష్టపడలేదు. అలాగే ఆ పని పూర్తి చేశాడు. ఆ సాయంత్రానికి అంటే 1919వ సంవత్సరం మే నెల 26వ తేదీన ఆయనకు జ్వర లక్షణాలు తీవ్రం అయినాయి. ఆచంట లక్ష్మీపతి వీరేశలింగంగారి మిత్రులందరికీ టెలిగ్రాములు పంపారు. కాశీనాథుని నాగేశ్వరరావుగారు వచ్చి ఆయన చివరి కోరిక సెలవివ్వవలసినదని కోరారు. పంతులుగారు ఏదో గొణిగారుగానీ మాట బయటకు రాలేదు. రోగ లక్షణాలు తీవ్రం అయినాయి. తెల్లవారుఝామున మూడు గంటల సమయంలో క్రమంగా నాడి దిగజారిపోయింది. 1919వ సంవత్సరం మే నెల 27న సరిగా ఉదయం నాలుగు గంటల 20 నిమిషాలకు ఆయన శ్వాస అనంతవాయువులలో కలిసిపోయింది. ఆయన మృత దేహాన్ని రాజమండ్రి తరలించాలని ప్రయత్నం చేశారు. కానీ అది ఫలించలేదు. ఆ తరువాత మే 28న మద్రాసులోనే అంత్యక్రియలు జరిగాయి.

ఒక ధృవతార రాలిపోయింది. దహన సంస్కారాలు అయిన తరువాత, ఆయన చితాభస్మాన్ని ఆయన భార్య సమాధి ప్రక్కన భూస్థాపితం చేయటం కోసం రాజమండ్రి పంపించారు. ఆయన తన సమాధి స్థలాన్ని తానే ఎన్నుకొన్నాడు. ప్రక్కప్రక్కనే వీరేశలింగంగారు, ఆయన సతీమణి రాజ్యలక్ష్మిగారి సమాధులున్నాయి. మరణంలోనూ, జీవితంలోనూ వారు భాగస్వాములే. ఆయన తెలుగుతేజానికి సూర్యుడు.

# అభినవాంధ్రకు ఆద్యబ్రహ్మ

ఆయన చేసిన పోరాటాలు, నిర్వహించిన ఉద్యమాలు, సాధించిన సత్కార్యాలు, వ్రాసిన గ్రంథాలు, స్థాపించిన సంస్థలు, వాటికి కూర్చిన ఆస్తులు, నడిపిన పత్రికలు ఇవి అన్నీ ఒక మానవ మాత్రుడు, నిత్య అనారోగ్యపరుడు తన జీవితకాలంలో చేయగలిగినవి కావనిపిస్తుంది. ఒక సంస్థ కూడా ఇన్ని పనులు నిర్వహించగలదంటే అనుమానమే. మన ఒకనాటి రాష్ట్రపతి, మహాతత్త్వవేత్త సర్వేపల్లి రాధాకృష్ణ పండితుడు

"Sri Viresalingam Pantulu was one of the earliest pioneers in South India to demand and work for radical changes in our society. Like all pioneers, who are ahead of their times he suffered misunderstanding and persecution. We owe it to his memory to work for social regeneration even as he did, braving all radical and danger" అని తెలిపారు.

ఎవరు ఎన్ని విధాలుగా స్తుతించినా తరగని ఆయన గుణరాశిని, ఆయన శిష్యుడు, సమకాలీనుడు అయిన చిలకమర్తి లక్ష్మీనరసింహం సరిగా ఇలా ప్రశంసించాడు.

తన దేహము తన గేహము

తన కాలము తన ధనమ్ము తన విద్య జగ

జ్జనులకు వినియోగించిన

ఘనుడీ వీరేశలింగకవి జనులారా

# కందుకూరి వీరేశలింగం

(1848 - 1919)




VICTORY

విక్టరీ పబ్లిషర్స్

# 30-17-3ఎ, వారణాసి వారి వీధి, సీతారాంపురం,
విజయవాడ - 520 002. ఫోన్ : 0866-2444156